
గొల్లపూడి బాలల బొమ్మల సంపూర్ణ

మహాభారతము



బాలల బొమ్మల

మహాభారతము



ప్రచురణ కర్తలు

© 2465253

గొల్లపూడి వీరాస్వామి సన్

పబ్లిషర్స్ అండ్ బుక్ సెల్లర్స్

కోటగుమ్మం - రాజమండ్రి - 1

వెల: **51-00**

బాలల బొమ్మల

సంపూర్ణ భారతము

రచన :

శ్రీమతి జి.యస్.ధనలక్ష్మీదేవి

చిత్రకారుడు :

కీ॥శే॥జె.యస్.రాజు

ముఖచిత్రాలంకరణ

గోల్డెన్ గ్రాఫిక్స్

రాజమండ్రి

ఫోన్ : 2464707

గ్రంథ ముద్రణ :

శ్రీ మహేశ్వరీ ఆఫ్‌సెట్ ప్రింటర్సు

పేపరుమిల్లు రోడ్

రాజమండ్రి - 533 104.

ఫోన్ : 2478594.

ముఖచిత్ర ముద్రణ :

ఈశ్వర్ ఆఫ్‌సెట్ ప్రింటర్సు

రాజమండ్రి - 533 103.

ఫోన్ : 2461532

ప్రకాశకులు :

గొల్లపూడి వీరాస్వామి సన్

కోటగుమ్మం - రాజమండ్రి.

ఫోన్ : 2465253

ముందుమాట

భారతీయులందరకూ శిరోధార్యములైన గ్రంథములు మూడు గలవు. మొదటిది రామాయణము మహాకావ్యము, రెండవది భారతేతిహాసము, మూడవది భాగవత పురాణము.

పసినాటి నుండి తల్లిదండ్రులు తమ బిడ్డలకు వీనిలోని గాథలు చెప్పుట మనదేశమున ఆనవాయితీగా వచ్చుచున్నది. కాని అధునాత కాలమున ఏర్పడిన జీవన వేగము వలననూ, వివిధములైన కారణములచేతను ఆ పరంపరాకథన మించుక వెనుకబడినది. ఇట్టి సమయములో పిల్లలు తమకు తాముగా ఆ దివ్యగ్రంథములను పరిచయము చేసుకొనుటకుగాను - అనువైన భాషలో ప్రచురించుట అవశ్యకముగా తలంచితిమి.

పిల్లలకు ఉత్సుకత కల్గించుటకొరకై నడుమ నడుమ చక్కని చిత్రములను గీయించినాము. వర్ణమాల క్షుణ్ణముగా వచ్చిన పిల్లలకు కూలంకషముగా అర్థమగు రీతిలో తేట తెలుగు శైలిలో - ఈ గ్రంథములను వ్రాయించి ముద్రించుచున్నాము.

ఈ వరుసతో తొలుతగా మేము ప్రచురించిన సంపూర్ణ రామాయణమును చూచి ఆనందించిన అసంఖ్యాక పాఠకులకూ, బాలికలకూ కృతజ్ఞులము. అశేష ప్రజ లొసంగిన ఆదరణయే అండదండలుగా భావించి - ద్వితీయ ప్రయత్నముగా ఈ పిల్లల బొమ్మల భారతమును మీ ముందుకు తెచ్చినాము.

పిల్లలు వారి ఉత్సాహమునూ, పెద్దలు తమ ఆశీస్సులతోబాటు తగు సలహాలనూ అందించినచో మరింతగా మీ సేవయందుండగలవారమని మనవి చేసుకొనుచున్నాము.

ఇట్లు
పబ్లిషర్స్

ఒక్క విషయము

భారత మహేతిహాసమును తెలుగులో వ్రాయమనగానే నన్నయభట్టంతటి వారే రవ్వంత ఆలోచనలో పడ్డారట. ఇక నేననగా ఎంత?

అందులోనూ - ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలకూ ఆటపట్టు అనేక మర్మ విషయాలతో కూడినదీ అయిన ఈ భారతమును వ్రాయడమే కష్టమైనది.

ముఖ్యముగా - చిన్నపిల్లలకు - కధాకధనముపై వుండే మక్కువ అధికము. అద్భుత రసావిష్టులయ్యే పిల్లలకు ప్రధాన ఘట్టాలపరంగానే భారతమును ఎరిగించాలనే దృష్టితో నా శక్తికి తగిన ప్రయత్నము నేను చేశాను.

ఆదిలో నాచేత రామాయణమును వ్రాయించిన శ్రీ గొల్లపూడి వీరాస్వామి సన్ వారే ఈ భారతాన్ని కూడా వ్రాయించడము యెంతైనా ముదావహము.

మనమంతా భారతీయులము. మన పూర్వుల చరిత్రే భారతము. తప్పనిసరిగా పఠించవలసిన ఉత్తమోత్తమ చారిత్రక గాథ యిది.

గతంలో నా రామాయణాన్ని ఆదరించినట్లే యీ గ్రంథాన్ని కూడా ఆదరించి యిటువంటి సద్గ్రంథ ప్రచురణకర్తలైన పబ్లిషర్సునూ నన్నూ ప్రోత్సహిస్తారని నమ్ముతూ ఉన్నాను.

శ్రీమతి జి.యస్.ధనలక్ష్మీదేవి
రాజమండ్రి

విషయసూచిక

2. సభాపర్వము

3. అరణ్యపర్వము

4. విరాటపర్వము

5. ఉద్యోగపర్వము

6. భీష్మ పర్వము

7. ద్రోణ పర్వము

8. కర్ణ పర్వము

శ్రీరస్తు　　　　శుభమస్తు　　　　అవిఘ్నమస్తు

బాలల బొమ్మల సంపూర్ణ మహాభారతము

వ్యాసుడు విఘ్నేశ్వరునిచే మహాభారతమును వ్రాయించుట

శ్రీకృష్ణ అవతార విశేషము, కృష్ణశక్తి, మహిమ, చంద్రవంశపు భారతవీరుల జీవిత విశేషాలు, వారి చరిత్ర సంపూర్ణముగా తెలిసిన మహాత్ముడు వ్యాస మహర్షి మాత్రమే. ఆయన భారతవీరుల చరిత్రను మనసులోనే ఒక మంచి కావ్యంగా రూపొందించినాడు. ఇంత గొప్ప కావ్యాన్ని వ్రాయుటకు వ్యాసునకు యెవరును కానరాక, సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని స్మరించినాడు. బ్రహ్మ ప్రత్యక్షమైనాడు.

వ్యాసుడు బ్రహ్మకు ప్రణామమాచరించి తన కోరికలను తెల్పాడు. అదివిని బ్రహ్మ సంతోషపడి 'ఈ మహాభారతాన్ని వ్రాయగల సమర్థత ఒక్క విఘ్నేశ్వరునికే ఉన్న'దని చెప్పి- వ్యాసుని సంకల్పము సఫలీకృతమగునట్లుగా ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

బ్రహ్మ కృపకు పాత్రుడైన వ్యాసమహర్షి వెంటనే విఘ్నేశ్వరుని స్మరించాడు. విఘ్నేశ్వరుడు వ్యాసుని యెదుట ప్రత్యక్షమై, విషయము తెలుసుకొన్నాడు. "మహర్షీ! నీవు చెప్పినది వ్రాస్తాను. కాని, మధ్యలో నా కలం ఘడియ కూడా ఆగదు. అంత వేగంగా



వ్యాసుడు చెప్పుచున్న మహాభారత కథను వ్రాయుచున్న విఘ్నేశ్వరుడు

నీవు చెప్పగలిగితేనే నేను వ్రాస్తాను" అన్నాడు. అది విని వ్యాసుడు అలాగే కాని, నేను చెప్పినది నీవు అర్థం చేసుకొని, దానిని బట్టి నీ కలం ఆగకుండా వ్రాయాలి"అని చెప్పాడు. 'తథాస్తు' అన్నాడు విఘ్నేశ్వరుడు.

ఆదిపర్వము

పూర్వకాలమున మన దేశమును పాలించిన రాజవంశములలో ప్రసిద్ధిజెందిన వంశములు రెండు. అవి ఒకటి సూర్యవంశము, రెండవది చంద్రవంశము.

చంద్రవంశపు రాజులందు చెప్పుకోదగిన వారిలో దుష్యంతుడు ఒకడు. ఆ దుష్యంతునకు శకుంతల యందు జన్మించినాడు భరతుడు.



సింహముతో ఆడుకొనుచున్న భరతుడు

భరతుడు చిన్నతనము నుండియే అజేయ పరాక్రమవంతుడై పులులూ- సింహాలతో ఆడుకొనుచుండెడివాడు. ఆ భరతుని పరిపాలనా కాలంలో ప్రజలన్నివిధములా ఆనందముతో నుండెడివారు. తండ్రి తన కప్పగించిన రాజ్యమును మరింతగా పెంచినాడు. మరెన్నో విధములుగా రాజ్యమును అభివృద్ధి చేసినాడు. ఈవిధముగా భరతుని వలన పెరిగిన రాజ్యమునకు భరతఖండము (భారతము) అని పేరు వచ్చినది. భరతుని అనంతరము 'హస్తి' అనువాడు రాజ్యపాలనలోకి వచ్చెను. హస్తి నివాసమేర్పరచుకొన్న నగరమే హస్తినాపురముగా ప్రసిద్ధి కెక్కినది. హస్తి తరువాత మరికొంతమంది రాజులు పాలనలోకి వచ్చినా, ఆయన తరువాత చెప్పుకోదగినవాడు శంతనుడు. అతఁ ప్రజారంజకముగా రాజ్యపాలన చేయుచుండెడివాడు.

శంతనుడు గంగాదేవిని చూచి మోహించుట

తరచు వేటకు వెళ్ళే అలవాటు కల శంతనుడు ఒకరోజు వేటాడి అలసిపోయి గంగాతీరము జేరి అచ్చట వీస్తున్న చల్లని గాలిని అనుభవిస్తూ విశ్రాంతి తీసుకొనుచుండెను. అదే సమయమున అతనికి అనతి దూరములో ఒక స్త్రీ విహరించుచుండెను. శంతనుడు ఆమె రూప లావణ్యములకు ఆశ్చర్యమునొంది, మోహపరవశుడై 'ఆహా! ఏమి అందము? ఈమెను వివాహమాడ గలిగినచో లోకమున అతనికంటె అదృష్టవంతుడు మరొక డుండగలుగునా?' యని తలంచుకొనుచు, ఆమెను చూచుచు తన్మయత్వము చెందసాగెను. ఆమెయు అతని మనస్సు గ్రహించినదా యన్నట్లుగా శంతనుని అనురాగ దృక్కులతో చూచినది.



తనను వివాహమాడుమని గంగాదేవిని కోరుతున్న శంతనుమహారాజు

ఈ విధముగా చూపులు కలియగానే శంతనుడు ఆమెను సమీపించి "దేవీ! నీ యనుమతితో నిన్ను వివాహము చేసుకో నిర్ణయించుకొన్నాను. నీ అందము నన్ను మోహపరవశుణ్ణి చేసినది" యని తన కోరిక తెలిపాడు.


అందుకామె "రాజా! నిన్ను వివాహ మాడుటకు నాకేమీ అభ్యంతరము లేదు. కాని నాకొక నియమం ఉన్నది. అదేమిటనగా! నేను చేసే పనులకు నీవు అడ్డు చెప్పకూడదు. అందుకు యిష్టపడునట్లు అయితే నిన్ను భర్తగా స్వీకరించగలను. ఏనాడు నా పనికి అభ్యంతరము చెప్పి, నన్ను తూలనాడెదవో ఆ మరుక్షణమే నిన్ను విడిచి వెళ్ళిపోతాను సుమా' యని చెప్పినది.

ఆమె అందచందాలను మాత్రమే చూసి ముగ్ధుడై మోహపరవశుడైన శంతనుడు ఆ విషయం యేమిటో, దానివలన యెటువంటి అనర్థము జరగనున్నదోయని ఆలోచింపక 'దేవీ! నీవు నా భార్యయగుటయే నాకు ముఖ్యము. నీ మాటలకు, చేతలకు నేను యేనాడూ అడ్డు చెప్పను. నీ యిష్టప్రకారమే నడుచుకొంటాను' యని మాట యిచ్చి ఆమెను తన రాజధానికి తీసికొని వెళ్ళి ఒక శుభముహూర్తమున శాస్త్రోక్తముగా పరిణయమాడి భార్యగా స్వీకరించినాడు. వారిద్దరు యెంతో అన్యోన్యత కలిగి ప్రేమానురాగములతో కాలము గడుపుచుండిరి. కొంతకాలమునకు వారికి ఒక కుమారుడు కలిగెను. వెంటనే ఆమె ఆ కుమారుని తీసుకొని వెళ్ళి గంగానదిలో వదలివచ్చినది. ఈ విధముగా కలిగిన కుమారులను కలిగినట్లుగా వరుసగా యేడుగురు పుత్రులను గంగపాలు చేసినది. ఆమె రాక్షస చర్యను చూస్తున్న శంతనుడు లోలోన బాధపడుచూ ఆమె కిచ్చిన మాటకొరకు ఏమీ అనలేక యూరకుండెను. తానేమైనా అభ్యంతరము చెప్పినచో ఆమె తనను వదలి పోతుందనే భయముతో తనలో తానే బాధను భరిస్తూ యుండేవాడు.

భీష్ముని జననము

ఇలా జరిగిన మరికొంత కాలమునకు ఒకానొక శుభఘడియలలో మరొక పుత్రుడు జన్మించినాడు. ఆ బాలుడు దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ తల్లియొక్క రూపలావణ్యములు కలిగి యెంతో అందముగా నుండెను. శంతనుడు ఆ బాలుని అందచందాలకు మురిసి పోతూ ఏమైనాసరే ఆ బిడ్డను గంగపాలు కానీయటము ఇష్టములేక బిడ్డను గొనిపోవుచున్న

భార్యను ఆపి దేవీ! ఇప్పటికి యేడుగురు బిడ్డలను కఠినాత్మురాలివై గంగపాలు చేసావు. అయినా నీకిచ్చిన మాటకొరకు ఆ బాధను భరించాను. ఈ బిడ్డను అయినా చిరంజీవిగా వుండనీ! నీవు బిడ్డలను కన్న తల్లివై యుండి గంగపాలు చేస్తున్నావు. మానవ మాత్రులయితే యీ దురాగతికి పాల్పడరు. మానవరూపం దాల్చిన రాక్షసివా? లేక పిశాచినివా? అసలు నీవెవరవు? అని నిలదీశాడు.



ఈ బాలుని అయినా చిరంజీవిగా నుండనీయుమని గంగను అడుగుచున్న శంతనుడు

అందుకామె నవ్వుతూ 'రాజా! నీకు కొడుకు కావాలంటే వీడిని నీకిస్తాను కాని యీ రోజుతో మన అనుబంధము తెగిపోయింది. అడిగావు కనుక చెబుతున్నాను నేను సామాన్య స్త్రీని కాను, గంగాదేవిని. ఒకప్పుడు వశిష్ఠుడు అష్టవసువులను వారు చేసిన పొరపాటుకు కోపించి మానవులుగా జన్మించమని శపించాడు వారే నా కుమారులుగా జన్మించారు. వారి శాపవిమోచనము కొరకు పుట్టినవెంటనే యేడుగురినీ గంగలో కలిపాను.

ఈ యెనిమిదవాడు దీర్ఘాయుష్కుడై కీర్తిమంతుడుగా వెలుగొంది చంద్రవంశానికే రత్న మాణిక్యమై ప్రకాశిస్తాడు" అని చెప్పగా శంతనుడు తన భార్య సాక్షాత్తు గంగాదేవియే అని తెలిసి ఆశ్చర్యచకితుడైనాడు. అది చూసి గంగ "మహారాజా! ఈ కుమారునకు విద్యాబుద్ధులు నేర్పించి త్వరలో నీ కప్పగిస్తాను' అని చెప్పి కుమారుని తీసుకొని వెళ్ళిపోతుంది.

గంగాదేవి కుమారుని శంతనునకు అప్పగించుట

మరికొన్ని సంవత్సరములు కాలగర్భములో కలసిపోయినవి. పిదప ఒకనాడు శంతనుడు గంగాతీరమునకు వచ్చి విహరించుచుండగా ఆ ప్రదేశమున తన విలువిద్యా నైపుణ్యమును ప్రదర్శించుకొనుచు గంగా ప్రవాహమునకు ఆనకట్ట కట్టుచు ఆనందిస్తున్న బాలుని చూచినాడు. ఆ బాలుని నైపుణ్యమునకు ఆశ్చర్యము నొందుచు "ఏమీ యీతని అస్త్రవిద్యా కౌశలము? ముక్కుపచ్చలారని ఈ ముద్దు కుమారునకు యింత చిన్న వయస్సులోనే అంతటి నైపుణ్యమును అలవరచిన పుణ్యాత్ములెవరో కదా' యని మనస్సున తలపోయుచూ, ఆ బాలుని చూస్తూ ఆనందము పొందసాగెను.

అప్పుడు గంగాదేవి పూర్వరూపముతో వచ్చి ఆ బాలని తీసుకొని శంతనుని దరిజేరి "రాజా! ఈ బాలుడే మన కుమారుడు దేవవ్రతుడు. వేదవేదాంగములు సంపూర్ణముగా నేర్చుకొన్నాడు. బుద్ధియందు బృహస్పతిని మించినాడు. వశిష్ఠాది ప్రముఖుల వద్ద సమస్త విద్యలను అభ్యసించి, అతి పరాక్రమ సంపూర్ణుడై ధనుర్వేదములో పరశురాముని మించినాడు. ఇక నీ కుమారుని నీవు తీసుకొని వెళ్ళవచ్చును. నేటితో నా బాధ్యత తీరిపోయింది" అని చెప్పి కుమారుని శంతనునకు అప్పగించి తాను అంతర్ధానమైనది.

శంతనుడు కుమారుని తీసుకొని హస్తినాపురము జేరి పెద్దలతోను, గురుదేవులతోను ఆలోచించి యువరాజుగా పట్టాభిషిక్తుని గావించెను. అది మొదలు గంగ దూరమైనదే యను చింత లేకుండా రాజకార్యములను సక్రమంగా నిర్వహిస్తూ కుమారునితో వినోదముగా కలము గడుపుచుండెను. ఈ విధముగా మరి అయిదు సంవత్సరములు గడిచిపోయినవి. చాలా వరకు పరిపాలనా బాధ్యత దేవవ్రతుడే నిర్వహించుచుండుట వలన ఒకరోజు మృగములను వేటాడుటకుగాను శంతనుడు యమునాతీర ప్రాంతము

చేరినాడు. అచట అతనికి యేనాడూ యెరుగునంత అపూర్వమైన సుగంధ పరిమళము సోకి ఆ సువాసన వచ్చుచున్న వైపుగా వెళ్ళెను. కాని ఆ పరిమళము యెచటి నుండి వచ్చినదో తెలుసుకొనలేక మరింత ముందుకు వెళ్ళగా అచట నదిపై వయ్యారంగా పడవ నడుపుచున్న ఒక అపురూప సుందరి కనిపించినది. శంతనుడు ఆ పరిమళము ఆమెనుండియే వస్తున్నదని గ్రహించి, ఆమెను సమీపించి పలుకరించినాడు.

"సుందరీ నీ వెవరవు? నీ పేరేమిటి? వర్ణింపశక్యముకాని అతిలోక సౌందర్యవతివై యుండి కూడ, పడవ నడుపుటకు గల కారణమేమిటి" అని అడుగగా, ఆ సుందరి చిరునగవు చిందిస్తూ "మహారాజా! నేను దాశరాజు కుమార్తెను నన్ను మత్స్యగంధి, యోజనగంధి అంటారు. కాని, పేరు మాత్రం సత్యవతి, నా తండ్రి దాశరాజు అనతిని శిరసావహించి పడవ నడుపుచున్నాను" అని చెప్పినది.



సత్యవతిని తనకిచ్చి వివాహము చేయుమని దాశరాజును అడుగుచున్న శంతనుడు

శంతనుడు ఆమెను పెండ్లాడగోరి వెంటనే దాశరాజు వద్దకు వెళ్ళినాడు. దాశరాజు శంతనునికి అతిథి మర్యాదలు చేసి గౌరవించి "రాజా! మీవంటి మహాత్ములు ఇక్కడకు స్వయంగా వచ్చుటకు గల కారణమేమిటో తెలుసుకొనవచ్చునా?"అనగా "దాశరాజా! నీ కుమార్తె సత్యవతిని భార్యగా పొందుటకు నీ అనుమతిని గోర వచ్చితిని" అని శంతనుడు తన యభిప్రాయమును తెలిపినాడు.

అది విని దాశరాజు 'రాజా! నీవంటి మహాత్ముడు కోరి నా అల్లుడవుతానంటే అంతకన్నా వేరే ఆనందమేమున్నది? కాని నా కుమార్తెకు పుట్టినవారే నీ అనంతరము రాజు కావాలి అందుకు నీవు సమ్మతించినట్లు అయితే నా కుమార్తెను నీకిచ్చి వివాహము జరిపించుటకు నాకు యెట్టి అభ్యంతరము లేదు' అన్నాడు.

ఆ మాటలు విని శంతనుడు ఖిన్నుడైనాడు. తన కుమారుడు దేవపుత్రుడు యువరాజై యున్నాడు. అతనిని కాదని యికముందు పుట్టబోయేవాడిని యే విధంగా రాజును చేయగలను? సమర్థుడు అయిన పెద్దవానిని కాదని చిన్నవానిని రాజును చేయుట న్యాయసమ్మతముకాదే!' యని ఆలోచించి విచారముతో దాశరాజుకు యేమియు చెప్పలేక, సత్యవతిపై మోహము వీడలేక, చింతాక్రాంతుడై రాజ్యమును చేరెను. దేవవ్రతుడు తండ్రి విచారమును గమనించి దానికి గల కారణము తెలుసుకొన్నాడు.

వెంటనే మంత్రి పురోహితాదులను వెంటబెట్టుకొని దాశరాజు వద్ద వెళ్ళినాడు. దాశరాజు దేవవ్రతునకు అతిథి మర్యాదలు చేసి గౌరవించినాడు. తరువాత దేవవ్రతుడు 'దాశరాజా! నీ కుమార్తెను నా తండ్రికి భార్యగా నిచ్చుటకు నీకు గల అభ్యంతరము యేమిటి' అని అడిగినాడు.

భీష్మ ప్రతిజ్ఞలు

అందుకు దాశరాజు 'అయ్యా! నా కుమార్తె నీ తండ్రికిచ్చుట నాకు ఆనందదాయకమే కాని, యీమె ఉపరిచరవసువు కన్న కూతురు. ఆయన యీమెను నాకప్పగిస్తూ తగిన వరుని తోడనే వివాహము చేయమన్నాడు. ఆయన పెట్టిన పేరే సత్యవతి. నీ తండ్రి తగిన వరుడే కాదనను, నా కుమార్తెకు పుట్టిన కుమారుడే రాజ్యానికి వారసుడు కావాలి.

పెద్ద కుమారుడవు నీవుండగా అదెలా సాధ్యపడుతుందా? యని సందేహముగా నున్నది' అని చెప్పాడు.

అంత దేవవ్రతుడు దాశరాజా! అష్టదిక్పాలురూ, దైవమూ సాక్షిగా యింతమంది పెద్దల యెదుట ప్రతిజ్ఞ చేయుచున్నాను. నాకు నా తండ్రి రాజ్యము అవసరము లేదు. ఆ రాజ్యానికి నీ మనుమలనే వారసులను చేస్తాను' యని శపథం చేసాడు.

అది విని దాశరాజు'యువరాజా! తండ్రి అనే మమకారంతో నీవు శపథం చేశావు కాని, అందరూ నీవలెనే త్యాగం చేయగలరా? ముమ్ముందు నీ కుమారులు కూడా రాజ్యం వదులుకోగలరని నమ్మకం యేమిటి? అని అడుగగా దేవవ్రతుడు "దాశరాజా! నా సంతతిని గురించి నీవు భయపడుతున్నావు కనుక, నేను బ్రతికి వున్నంతకాలము బ్రహ్మచారిగానే వుంటాను. అని మరో శపథం చేస్తున్నాను. ఇకనైనా మీ సత్యవతిని నా తండ్రికివ్వగలరా అని అడిగెను. యీ ప్రతిజ్ఞలను విని, అక్కడి వారందరూ ఆశ్చర్యపోగా మునులు ఆశీర్వదించినారు. దేవతలు పుష్పవర్షం కురిపించి "భీషణములైన ప్రతిజ్ఞలు చేసిన వాడవు కనుక, ఇకనుండి "భీష్ముడు'గా కీర్తి నొందెద''వని పొగడినారు దాశరాజు సంతృప్తినొంది సత్యవతిని శంతనునికిచ్చి మహావైభవముగ కళ్యాణమును జరిపించాడు. శంతనుడు కుమారుని పితృభక్తికీ, త్యాగ శీలతకూ మిగుల సంతోషము జెంది తనకు యిష్టము వచ్చినపుడే దేహం చాలించునట్లుగా వరం ప్రసాదించి ఆశీర్వదించినాడు.

చిత్రాంగదుని రాజ్యపాలన

కొంతకాలమునకు సత్యవతికి చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు అను యిద్దరు కుమారులు కలిగినారు. వారిద్దరూ చిన్నపిల్లలుగా వుండగానే తమ్ములు పెరుగునంతవరకు రాజ్యభారం భీష్మునికి అప్పగించి శంతనుడు మరణించెను. భీష్ముడు తండ్రికి వుత్తరక్రియలు జరిపి, తన ప్రతిజ్ఞ మేరకు చిత్రాంగదునికి రాజ్యాభిషేకం జరిపించి భారమంతా తాను వహించినాడు.

కాలక్రమేణా పెద్దవాడైన చిత్రాంగదుడు మహా గర్వాంధుడై అందరితో విరోధము తెచ్చుకొనుచుండెను. ఒకనాడు ఒక గంధర్వునితో అనవసరముగా కయ్యానికి కాలు దువ్వి యుద్ధము చేసెను. ఇద్దరూ సమాన బలశాలులే యగుటచేత యుద్ధము మహా

ఘోరముగా జరిగినది. ఇక యిదికాదు పద్ధతి' యని భావించి గంధర్వుడు మాయా యుద్ధము చేసి చిత్రాంగదుని చంపెను. ఈ విధముగా దుష్టప్రవర్తన కల చిత్రాంగదుడు మరణించినాడు. తమ్ముని మరణమునకు భీష్ముడెంతగానో విచారించినాడు.

విచిత్ర వీర్యుని జీవితం

భీష్ముడు చిత్రాంగదుని స్థానంలో విచిత్రవీర్యుని రాజుగా నియమించి, కాశీ రాజు కుమార్తెలయిన అంబిక, అంబాలికలను తీసుకొనివచ్చి వివాహము జరిపించినాడు. సహజంగా స్త్రీలోలుడయిన విచిత్రవీర్యుడు రాజ్యపాలన సక్రమముగా నిర్వహించక భార్యలతోనే కాలం గడుపుచూ సంతానము కలుగకముందే రోగపీడితుడై మరణించెను. భీష్ముడు విచావదనుడై, తమ్మునికి పుత్తరక్రియలు జరిపించి, తల్లిని ఓదార్చినాడు.

మరి కొలది దినములు గడిచిన పిమ్మట సత్యవతి భీష్ముని పిలిచి 'నాయనా భీష్మా! నీవయినా వివాహము చేసుకొని ఈ వంశాన్ని ఉద్ధరించు' అని వేడుకొన్నది.

భీష్ముడు అందులకు ఒప్పుకొనక 'అమ్మా! నా ప్రతిజ్ఞలను నేను యే పరిస్థితిలోనూ మార్చుకోలేను. సమయానుకూలముగా మాటను మార్చుకొంటే ఇంకా ప్రతిజ్ఞకు విలువెలా వుంటుందమ్మా! వ్రతమునకు భంగము రానీయను. వంశము నిలుపుకొనుటకును, దేశము అరాజకము కాకుండా కాపాడుకొనుటకును మరొక మార్గము కలదు. పరశురాముడు క్షత్రియులనందరినీ హతమార్చినపుడు వారి భార్యలు బ్రాహ్మణోత్తముల ద్వారా సంతానమును పొంది తమ వంశాలను నిలుపుకున్నారు. అదే ప్రకారముగా ఎవ్వరేని మహర్షి యనుగ్రహముతో నీ కోడండ్రను సంతానవతులుగా చేయుము. ఇంతకన్నా మరో మార్గములేదు' అని చెప్పగా సత్యవతి సరే నన్నది.

వ్యాసమహర్షి ఆగమనము

సత్యవతి కన్యగా నున్నప్పుడు పడవ నడిపే రోజులలో పరాశర మహర్షి వలన వ్యాసుడు జన్మించెను. పుట్టిన వెంటనే పెద్దవాడై తపోవనమునకు వెళ్ళుచు ఏదైనా అవసరము కలిగినపుడు తలచుకొంటే వెంటనే వచ్చెద'నని తల్లితో చెప్పి వెళ్ళాడు. అది

గుర్తుకు తెచ్చుకొని సత్యవతి భీష్మునితో వ్యాసమహర్షి ద్వారా ఈ భరత వంశాన్ని నిలబెడితే బాగుంటుందేమోనన్నది. భీష్ముడు సంతోషముతో 'తథాస్తు' అని భారం తల్లికే అప్పగించి వెళ్ళిపోయాడు.

సత్యవతి వ్యాసుని తలచు కొన్నది. వెంటనే వ్యాసుడు వచ్చి "అమ్మా! ఎంత కాలమునకు నిన్ను చూడగల అదృష్టాన్ని కలిగించావు!' అంటూ సాష్టాంగ నమస్కారము చేసెను. సత్యవతి కుమారుని దగ్గరకు తీసుకొని కుశల ప్రశ్నలు వేసి ఆసీనుని గావించినది. తరువాత భీష్మ ప్రతిజ్ఞ మొదలు జరిగినదంతయు చెప్పి 'నాయనా! నీ మరదళ్ళను స్వీకరించి వారికి పుత్రసంతతి కలుగునట్లు చేసి యీ వంశాన్ని నీవే నిలపాలి. ఈ కార్యము నీవల్లనే జరగాలి' అన్నది. వ్యాసుడు తల్లి ఆజ్ఞను శిరసావహించి 'సరే' అన్నాడు.



వంశమును నిల్పుమని వ్యాసుని కోరుచున్న సత్యవతి

ధృతరాష్ట్ర, విదుర, పాండురాజుల జననము

సత్యవతి మాటలను తలదాల్చి పుత్రప్రాప్తికొరకు వ్యాసమహర్షి వద్దకు వెళ్ళిన అంబిక అతని రూపమును చూసి కనులు మూసుకొన్నది. కనులు మూసుకొన్న అంబికను అలాగే చూసి, తన దివ్య తపోశక్తిచే ఆమెకు పుత్రసంతానము ననుగ్రహించిన వ్యాసుడు తల్లికిచ్చిన మాటను నెరవేర్చుకొని తల్లివద్దకు వెళ్ళి జరిగినది చెప్పినాడు. సత్యవతి విచారించి యీసారి అంబాలికను పంపినది. ఆమె వ్యాసుని దరిచేరినది కాని అతని రూపమును చూసి తెల్లబోయినది. యీ విధంగా వ్యాసుని దరిజేరిన అంబిక కనులు మూసుకొనుటచేత ఆమెకు గ్రుడ్డివాడయిన ధృతరాష్ట్రుడు, అంబాలిక తెల్లబోవుటచేత ఆమెకు పాండు (తెల్లని) దేహముతో పాండురాజు జన్మించినారు. ఈ బాలుర నిద్దరినీ చూసి తృప్తినొందని సత్యవతి అంబికను హెచ్చరించి యీసారి అయినా తగిన కొడుకుని కనుమని చెప్పి, మరల వ్యాసుని వద్దకు పంపినది. అత్త మాటలు కాదనే ధైర్యములేని అంబిక, సరేనని చెప్పి వెళ్ళి తన దాసిని అలంకరించి వ్యాసునివద్దకు పంపినది.

ఆ దాసి వ్యాసునివద్దకు వెళ్ళి ఆ మునిని చూసి యే విధమైన భావము వెలిబుచ్చక భక్తితో దరిజేరినది. అందుచేత వ్యాసుడు దాసికి పుత్రప్రాప్తిని కలుగజేసినాడు. ఆమెకు సకల సద్గుణ సంపన్నుడు, దైవభక్తి పరాయణుడు అయిన కొడుకు జన్మించినాడు. దాసీ తన పుత్రుని చూచి ఆనందించి భీష్ముని అనుమతితో విదురుడు యని నామకరణం చేసినది.

ఈ విధముగా వ్యాసుని వలన జన్మించిన ఆ ముగ్గురు బాలురు పెరిగి పెద్దవారగుచుండిరి. రాజ్యబారం వహించిన భీష్ముడు వారికి క్షత్రియోచిత విద్యలు, వేదవేదాంగాలు నేర్పించాడు. వారిలో పెద్దవాడైన ధృతరాష్ట్రుడు బహు పరాక్రమశాలిగాను, పాండురాజు ధనుర్విద్యలో ప్రవీణుడుగాను, విదురుడు దర్మపరుడుగాను తయారైనారు.

కాలక్రమమున ఈ ముగ్గురు బాలురు యుక్తవయస్సువారయినారు. భీష్ముడు వారితో ఒకరికి రాజ్యాభిషేకం చేయతలంచి, పెద్దవాడయిన ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడగుటచేత రాజ్యపాలనకు అర్హుడు కాడు. విదురుడు వ్యాసుని యనుగ్రహమున జన్మించినను దాసీ పుత్రుడగుటచేత రాజ్యపాలనకు తగినవాడు కాదు అని ఈ విధముగా ఆలోచించి అన్ని విధములా సమర్థుడైనపాండురాజుకు రాజ్యాభిషేకము జరిపించాడు.

పాండురాజు అన్నగారియందు గల భక్తిభావము చేత ధృతరాష్ట్రునే రాజుగా భావించుకొని, రాజ్యభారము మాత్రము తానే వహించి భీష్ముని అనుమతితో విదురుని మంత్రిగా నియమించుకొనెను. ఈ విధముగా కొలది రోజులు గడచిన పిమ్మట వారికి వివాహము చేయ నిశ్చయించుకొన్న భీష్ముడు సత్యవతితో చెప్పి తగిన కన్యల గురించి అన్వేషించి గాంధారదేశపు రాజయిన సుబలుని కుమార్తె గాంధారిని ధృతరాష్ట్రునికిచ్చి వివాహము జరిపించినాడు. తరువాత పాండురాజునకు తగిన కన్య యెవరా? యని ఆలోచించుచు అన్వేషించసాగెను.

కర్ణుని జననము

యాదవ ప్రముఖులలో ఒకడయిన శూరసేనునకు పృథ అనే కూతురు కలదు ఆమెను కుంతిభోజుడు కోరగా పెంపకమున కిచ్చాడు. కుంతిభోజుడు ఆమెను అల్లారు



బాలుని నదిలో వదులుతున్న కుంతీ కుమారి

ముద్దుగా పెంచుకొనుచు తన పేరు కలియునట్లుగా 'కుంతి' యని పిలుచుకొనుచుండెను ఈ విధముగా కుంతిభోజుని పెంపకములో ఆమె యుక్తవయస్కురాలైనది. ఒకనాడు కుంతిభోజుని యింటికి దుర్వాసుడు రాగా కుంతి ఆయనకు జేసిన అతిధి సత్కారములకు సంతోషించి ఆమెకు ఒక మంత్రము నుపదేశించి 'అమ్మా! నీవు ఈ మంత్రమును జపించి యే దేవుని కోరితే ఆ దేవుడు నీకు గొప్ప కుమారుని ప్రసాదించగలడు' అని చెప్పి వెళ్ళెను.

'ఇది యెంతవరకు యధార్ధమో చూడవలె'నను అభిప్రాయముతో కుంతి ఒకనాడు సూర్యభగవానుని మనస్సులో నిల్పుకొని ఆ మంత్రాన్ని జపించి ఆయన అనుగ్రహము వలన కవచ కుండలములు కల తేజసంపన్నుడైన బాలుని పొందినది.

అది చూసి భయపడి, లోకానికి జడిసి ముద్దులు కురిపిస్తున్న ఆ చిన్నారి బాలుని వదలలేక వదలలేక, తప్పనిసరియై - ఆ బిడ్డను పెట్టెలో పరుండబెట్టి నదిలో వదలినది. ఆ పెట్టె అలా పోయిపోయి ఒక సూతునికి దొరికినది. సూతుడు ఆ పెట్టెయందు గల బాలుని భగవంతుడే తనకి ప్రసాదించి, పిల్లలులేని కొరత తీర్చినాడని భావించి మిగుల ఆనందించినాడు. ఆ బాలుని తీసుకొనిపోయి తన భార్య రాధకు యిచ్చి జరిగినదంతయు చెప్పగా ఆమె యెంతో ఆనందించినది. అది మొదలు ఆ దంపతులు తమకు దొరికిన బాలుని యెంతో ప్రేమగా పెంచుకొనుచుండిరి. ఆ బాలుడే కర్ణుడు.

పాండురాజు వివాహములు

ఈ విధముగా జరిగిన కొంత కాలమునకు కుంతిభోజుడు తన కుమార్తె కుంతికి స్వయంవరం యేర్పాటుచేసి అన్ని దేశములకు ఆహ్వానములు పంపెను. స్వయంవరము నకు యెందరో రాజులు వచ్చారు. వారిలో పాండురాజు కూడా వున్నాడు.

సహజంగా అందగాడైన పాండురాజు అలంకరణతో మరింత వైభవోపేతముగా కనిపించుటచేత కుంతి పూలమాలను పాండురాజు మెడలో వేసినది. అది చూసి సమర్ధుడైన పతి నెన్నుకొన్నందుకు సంతోషముతో కుంతిభోజుడు వారిద్దరకూ వివాహము జరిపించి అంతులేని కానుకలనిచ్చి హస్తినాపురమునకు పంపాడు.



కుంతి - పాండురాజుల వివాహము

భీష్ముడు, పాండురాజునకు మరొక భార్యను కూడా చేయతలచి, మద్రదేశపు రాజయిన శల్యుడికి కన్యాశుల్కము చెల్లించి అతని చెల్లెలు మాద్రిని తీసుకొని వచ్చి వైభవోపేతముగా వివాహము జరిపించినాడు. పాండురాజు యిద్దరు భార్యలతోను సమస్త సుఖాలు అనుభవించుచూ ధర్మయుక్తముగా రాజ్యపాలన చేయుచూ దిగ్విజయ యాత్రకు బయలుదేరి నాలుగువైపుల రాజులనూ జయించి విజయుడై హస్తినాపురి జేరినాడు. తరువాత భీష్ముని అనుజ్ఞను తీసికొని భార్యల నిద్దరినీ వెంటబెట్టుకొని వన విహారము కొరకై హిమవత్పర్వత ప్రాంతములోని అడవులకు వెళ్ళాడు.

గాంధారికోరిక

భీష్ముడు విదురునకు కూడ దేవకుడనే రాజకుమార్తెను తీసికొచ్చి వివాహము చేశాడు. ఈ వివాహము జరిగిన కొద్దిరోజులకు వ్యాసమహర్షి విపరీతమైన ఆకలితో

హస్తినాపురమునకు వచ్చాడు. గాంధారి ఆయనకు సకలోపచారములు చేసి ఆతిధ్యమొసగి ఆకలి తీర్చి తన భర్త బలపరాక్రమములకు తీసిపోని నూరుగురు కుమారులను కోరగా, వ్యాసుడు సంతోషముతో 'తథాస్తు' అని వరమిచ్చి వెళ్ళిపోయాడు. కొలది దినములకే గాంధారి గర్భవతి అయినది.

మునిశాపం - పాండవుల జననము

ఒకనాడు పాండురాజు భార్యలతో అడవులలో విహరిస్తూ, కనిపించిన జంతువులను వేటాడుచూ తిరిగి వచ్చుచుండగా దారిలో గుబురుగా నున్న పొదల ప్రక్కన క్రీడా వినోదమున నున్న లేళ్ళ మిధునాన్ని చూసి వాటిపై బాణం వదిలాడు.

ఆ బాణం తగిలి మగజింక చనిపోతూ మనుష్య భాషలో 'దుర్మార్గుడా! కామసుఖాలలో నున్న మమ్ములను కొట్టి విడదీశావు కనుక, నీవు నీ భార్యలతో క్రీడించిన యెడల వెంటనే మరణింతువు గాక' యని శపించి ప్రాణాలు వదిలినది. వెంటనే ఆడ జింక కూడా చనిపోయినది. అవి నిజముగా లేళ్ళు కావనీ, ఆ రూపం ధరించిన ముని దంపతులనీ తర్వాత తెలుసుకున్నారు పాండురాజు.

పాండురాజు ఆ ముని దంపతుల మరణానికి విచారించి తనకు యెదురైన శాపానికి ఆందోళన జెంది, యి జీవితమంతా అక్కడే గడుప నిశ్చయించుకొనెను. కాని తనకు పుత్రులు కలుగకుండానే యెంతటి ఘోర శాపం తగిలింది' అనే విచారముతో కాలం గడుపుచుండగా, కుంతి పాండురాజు విచారమునకు కలత జెంది తనకు దూర్వాస మహాముని వుపదేశించిన మంత్రమును గురించి చెప్పినది. అది విని పాండురాజు మిక్కిలి సంతోషించి ధర్మదేవతను తలచుకొని ధర్మజ్ఞుడైన కొడుకును పొందుమని చెప్పగా కుంతీదేవి యమధర్మరాజును స్మరించి అతని అనుగ్రహమున ధర్మరాజును పొందినది. మరల పాండురాజు కోరికపై వాయుదేవుని అనుగ్రహమున భీముని, దేవేంద్రుని వలన అర్జునునీ పొందినది. కుంతికి ముగ్గురు కుమారులు కలుగగా మాద్రి, కుంతి వలన ఆ మంత్రమును తెలుసుకొని భర్త కోరికపై అశ్వనీ దేవతల అనుగ్రహమున 'నకులుడు-సహదేవుడు' అను కవల పిల్లలను పొందినది.

ఈ అయిదుగురు బాలురు పాండురాజు పుత్రులగుటచేత వీరికి పాండవులని పేరు వచ్చినది. పిల్లలను చూచుకొని పాండురాజు విచారమును మరచి వారితో కాలక్షేపము చేయుచుండెను.

కౌరవుల జననము

కుంతికి ధర్మరాజు జన్మించాడనే వార్తను విన్న గాంధారి బాధపడి, తాను గర్భం దాల్చి యింతకాలమైనా పిల్లలు గలుగలేదే యని యీర్ష్యాసూయలతో గర్భాన్ని కొట్టుకొన్నది. దానితో గర్భస్రావము అయినది. అది తెలిసి వ్యాసుడు గాంధారిని చూడవచ్చి, ఆమె గర్భం నుండి పడిన మాంసపు ముద్దలను నీటిలో కడిగించి గాంధారి కోరికపై 100 భాగాలు చేసి కుండలలో పెట్టించి వెళ్ళిపోయాడు. అలా పెట్టిన సంవత్సరమునకు అందు ఒక కుండ నుండి ఒక బాలుడుద్భవించినాడు. భీముడు పుట్టిన రోజునే జన్మించినాడు. వీడికి దుర్యోధనుడని పేరు పెట్టారు. భీముడు పుట్టిన వెంటనే అచట శుభసూచనలు కన్పించగా, దుర్యోధనుడు పుట్టిన వెంటనే యిక్కడ దుశ్శకునాలు కలిగినవి. ఈ విధముగా దుర్యోధనుని అనంతరం ఒక్కొక్కరుగా ప్రతికుండలో నుండి ఒక్కొక్క బాలుడుద్భవించినాడు. ఆఖరి కుండనుండి మాత్రం బాలిక పుట్టెను. ఈ నూరుగురు కుమారులు ఒక కుమార్తె ధృతరాష్ట్రుని సంతానము కనుక వీరికి ధార్త రాష్ట్రులని పేరు వచ్చింది. కురువంశము తరపున ధృతరాష్ట్రుడే రాజు గనుక ఆయన వారసులుగా ఆ వందమందిని కౌరవులని కూడా పిలిచేవారు.

పాండురాజు మరణము

కుమారుల ముద్దుముచ్చట్లు చూచుకొంటూ కాలము గడుపుచున్న పాండురాజు ఒకనాడు ఒంటరిగా నున్న మాద్రిని చూచి కామమోహితుడై, ఆమెతో క్రీడించి ముని శాపమువలన వెంటనే ప్రాణాలు కోల్పోయాడు. మాద్రి భయముతో భర్తను కౌగిలించుకొని యేడ్చుచుండగా ఆ యేడ్పు విన్న కుంతి పరిసర ప్రాంతములయందలి స్త్రీలు-మునులూ వచ్చి పాండురాజు మరణించి యుండుట చూచి విచారించినారు. మాద్రివలన విషయము తెలుసుకున్న కుంతి మరింతగా బాధపడి ఆమెను ఓదార్చి "పిల్లలను చూచుకో. పెద్దదానిని కనుక భర్తతో సహగమనం చేస్తానంది.

మాద్రి యేడుస్తూ 'లేదక్కా! భర్త ప్రాణాలు కాపాడుకొనలేకపోయిన నేను పిల్లలను మాత్రం ఎలా పెంచగలను? భర్త వెంట నేను పోతాను' అని కుంతిని ఒప్పించి నకుల సహదేవులను ఆమెకి అప్పగించి భర్తతోబాటు చితిపై ఆహుతి అయిపోయినది. పాండురాజు పోయిన తరువాత యిక కుంతీ, పిల్లలూ అడవులయందుండుట క్షేమం కాదని భావించి మునులు వారిని వెంటబెట్టుకొని హస్తినాపురమునకు వచ్చారు.

మునులు జరిగినదంతయూ ధృతరాష్ట్రునికీ, భీష్మునికీ చెప్పి, కుంతిని పాండవులనూ వారికప్పగించి వెళ్ళిపోయిరి. పాండురాజు మరణమునకు విచారించి, భీష్మ ధృతరాష్ట్రులు కౌరవ పాండవులను సమముగా చూచుకొనుచు పెంచసాగిరి. ఆటపాటలు అన్నిటా ఆధిక్యతను సంపాదించుకొనుచున్న భీముని చూచి దుర్యోధనుడు ఒక జట్టుగా విడివడి భీముని చంపు ప్రయత్నములు చేయుచుండెను. ఒకరోజు భీముడు నిద్రించుచుండగా కాళ్ళు చేతులు కట్టి సముద్రములో పడద్రోయించెను.

ఆ ప్రయత్నము విఫలమై సురక్షితముగా ఇల్లు చేరిన భీమునికి మరోరోజున అన్నములో విషము కలిపి పెట్టాడు. విషము జీర్ణమై ఆ ప్రయత్నము కూడ విఫలమైనది ఈ విధముగా పాండవులంటే దుర్యోదనాదులకి చిన్నతనమునుండే అసూయ ద్వేషములు పెరుగుచున్నవి.

విద్యాభ్యాసము

భీష్ముడు కృపాచార్యుని పిలిపించి, కౌరవ పాండవ కుమారులకు విద్యాభ్యాసమునకై నియమించాడు. ఒకరోజు ఊరి వెలుపల బాలులందరూ బంతి ఆట ఆడుకొనుచుండగా బంతి ఎగిరివెళ్ళి ఆ సమీపమున గల నూతిలో పడినది. బంతిని పైకి యెట్లు తీయటమా యని రాకుమారులందరూ బావి చుట్టూ చేరి చూచుచుండిరి. అదే సమయమున ఆ వైపుగా వచ్చుచున్న ద్రోణాచార్యులు నూతిచుట్టూ చేరిన రాకుమారులను చూచి, వారి వద్దకు వచ్చి 'రాకుమారులారా! ఎందులకలా కంగారుపడుచున్నారు. అని అడిగి ఆ బాలకుల వలన విషయము తెలుసుకున్నాడు. 'బంతియే కదా మీకు కావలసినది నేను తీస్తాను చూడండి' అని ఒక బాణమును బంతికి దిగునట్లుగా వేసినాడు.

దాని తరువాత మరికొన్ని బాణములు వేసి చేతికందువరకు త్రాడుగా తయారు చేసి బంతిని తీసి యిచ్చినాడు. రాకుమారులది చూసి ద్రోణాచార్యుని' భీష్మని వద్దకు

తీసుకొనిపోయి జరిగినదంతయు చెప్పినారు. భీష్ముడు అది విని ద్రోణాచార్యుని చాకచక్యమునకు సంతోషించి, రాకుమారులను అస్త్రవిద్యయందు పరిపూర్ణులుగా తయారు చేయుమని చెప్పి ద్రోణునకు అప్పగించినాడు.

ద్రోణుడు కొలది దినముల తరువాత రాకుమారుల నందరిని సమావేశపరచి "నాయనలారా! మీరు సమస్త విద్యలయందు గొప్పవారై పరిపూర్ణత సాధించిన తరువాత నా కోరికను యెవరు తీర్చగలరు" అని అడిగెను. ద్రోణుని మాటలు విని అందరూ ఒకరి మొహం ఒకరు చూచుకొనుచుండగా అర్జునుడు లేచి "గురువర్యా! మీ కోరిక ఎటువంటిదైనను సందేహింపక నేను తీర్చెద'నని పలికెను.

ఆ మాటలు ద్రోణునకు అమితానందము కలిగించి అతనిపై ప్రత్యేకాభిమానము పెంచుటచే, విలువిద్యలోని రహస్యములన్నిటిని చెప్పి అర్జునుని అందరికన్నా అధికునిగా తయారుచేసెను.



బావిలో పడిన బంతిని తీయుచున్న ద్రోణాచార్యుడు

ద్రోణాచార్యుని వృత్తాంతము

ద్రోణుడు పాంచాలదేశపు రాజకుమారుడైన ద్రుపదునితో కలసి భరద్వాజుని వద్ద విద్యాభ్యాసము చేసినాడు. ఇద్దరూ చాలా స్నేహముగా వుండెడివారు. కొంతకాలము అయిన పిమ్మట విద్యాభ్యాసము ముగించుకొని వెళ్ళిపోవుచున్న ద్రుపదుడు ద్రోణునితో "మిత్రమా! నీకేదైనా అవసరము కలిగినచో నా వద్దకు రమ్ము. నీవు కోరిన సహాయమును చేసెదను" అని వాగ్దానము చేసినాడు. అటు తరువాత ద్రోణునకు యుక్తవయస్సు రాగా కృపాచార్యుని చెల్లెలు 'కృపి'ని వివాహము చేసుకొని అశ్వత్థామ యను కొడుకును పొందినాడు.

ద్రోణుడు యెంతటి విద్యావంతుడు అయినను భార్యను, బిడ్డను పోషించుకొనలేక



ద్రుపదుని సహాయము కోరుచున్న ద్రోణుడు

పోయినాడు. అటువంటి సమయమున ద్రోణునకు బాల్యమిత్రుడయిన ద్రుపదుడు మనస్సున మెదలి, భార్యాబిడ్డలను తీసుకొని పాంచాల నగరమును చేరినాడు.

ద్రోణుడు రాజసభకు వెళ్ళి ద్రుపదుని కలసి 'మిత్రమా! ద్రుపద మహారాజా! నేను నీ బాల్య మిత్రుడగు ద్రోణాచార్యుడను. నీ సహాయము కోరి వచ్చినానని చెప్పగా, ధన మధాంధుడైన ద్రుపదుడు ద్రోణుని యెగతాళి చేసి 'నీవు నాకు మిత్రుడవా? నీవంటి గర్భదరిద్రుడు ఒక మహారాజునకు మిత్రుడెలా అవుతాడు అసందర్భపు ప్రేలాపన మాని వచ్చినదారినే వెనుకకు పొమ్మ్మ' అని తూలనాడెను.

ద్రోణుడు, ద్రుపదుని మాటలకూ, అతని ప్రవర్తనకూ ఖిన్నుడై జీవనోపాధిని వెదుకుకొనుచు తిరిగి తిరిగి చివరకు హస్తినాపురమునకు బయలుదేరినాడు. అలా వస్తున్న ద్రోణునకు అదృష్టవశాత్తు రాకుమారులు కనిపించుట, వారికి బంతిని తీసి యిచ్చుట, అనుకోకుండా భీష్మని ఆదరణ లభించుట జరిగినది. దానితో ద్రుపదునిపై పగ సాధించి వానికి కనువిప్పు కలిగించవలెనని పట్టుదల పెరిగినది.

రాకుమారుల అస్త్రవిద్యా ప్రదర్శన

ఒకరోజు ధృతరాష్ట్రుడు సభతీరి యుండగా ద్రోణాచార్యుడు సభకు విచ్చేసినాడు. భీష్మాదులు ద్రోణాచార్యుని గౌరవించి ఆసీనుని గావించి, 'ఆచార్యా! మా రాజ కుమారుల విద్యాభ్యాసము ఎలా జరుగుచున్నది?' అని అడుగగా, ద్రోణాచార్యుడు భీష్మనితో 'భీష్మాచార్యా! రాకుమారుల విద్యాభ్యాసము పూర్తి అయినది. వారిశక్తి సామర్థ్యములను మీరే పరీక్షించండి' అని చెప్పినాడు. అది విని భీష్ముడు విదుర ధృతరాష్ట్రులతో అస్త్రవిద్యా ప్రదర్శనకు ఏర్పాట్లను చేయవలసినదిగా చెప్పెను. ద్రోణునితో ఆచార్యా! మా కుమారులను సకల విద్యాపారంగతులను చేసి గురువును మించిన శిష్యులుగా తయారుచేసి వుంటారనే విశ్వాసం మాకున్నది. అయినా మీరు చెప్పిన ప్రకారము అస్త్ర విద్యా ప్రదర్శనకు ఏర్పాట్లు గావించి తమకు కబురు పంపెద'మని చెప్పినాడు.

త్వరలోనే వారు అట్టి విద్యా ప్రదర్శనకు ఏర్పాట్లు గావించినారు. రాకుమారుల ధనుర్విద్యా ప్రదర్శనము తిలకించుటకు ప్రముఖులైన పెద్దలందరూ వచ్చారు. అంతేగాక, ఈ ప్రదర్శనను హస్తినాపురవాసులకు ఒక గొప్ప ఉత్సవములా అనిపించి ఆ వేడుకను

చూడగోరి వచ్చినారు. పోటీలు ప్రారంభమైనవి. అందరూ తమ శక్తిని బట్టి అస్త్ర కౌశలాన్నీ ప్రదర్శించి, విలువిద్యలో తమ ప్రావీణ్యాతను చూపారు. భీముడు, దుర్యోధనుడు తమ గదలను తీసుకొని రెండు ఏనుగులవలె రంగంలో ప్రవేశించినారు. ఆ పరీక్ష వారి నైపుణ్యమును ప్రదర్శించడానికే పెట్టినా, ఆవేశంతో మారుమ్రోగే వారి అరుపులకు కాళ్ళ తావులకు భూమి దద్దరిల్లగా 'యుద్ధం శ్రుతిమించుతున్నది'యని పరిస్థితి గ్రహించిన ద్రోణాచార్యుడు వారి గదా యుద్ధమును ఆపుచేయించినారు.

వారి తరువాత అర్జునుడు గురుదేవులకు నమస్కరించి రంగ ప్రవేశము గావించి తన విలువిద్యను ప్రదర్శించసాగెను. ఆగ్నేయాస్త్రముతో అగ్నిని బుట్టించి వారుణాస్త్రము ప్రయోగించి వర్షమును కురిపించి - ఆ అగ్నిని ఆర్పినాడు. మేఘాస్త్రముతో మేఘములను రప్పించి వాయవ్యాస్త్రమును ప్రయోగించి పెనుగాలిని సృష్టించి మేఘములను చెల్లాచెదురు కావించాడు. ఈ విధముగా తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న అర్జుని ధనుర్విద్యా కౌశల్యం అందరినీ ఆశ్చర్యచకితులను చేసి అమితంగా ఆకర్షించగా మెచ్చుకొనసాగిరి. ఇది దుర్యోధనునికి మరింత అసూయ కలిగించింది.

కర్ణుని అంగరాజ్యాభిషేకము

ఆ సమయమున కవచకుండల ధారియైన కర్ణుడు రంగమున ప్రవేశించి అర్జునుని శక్తిని ఆక్షేపించి, ద్రోణ కృపాచార్యుల అనుమతిని పొంది అర్జునుడు ప్రదర్శించిన అన్ని విద్యలను తాను కూడా ప్రదర్శించినాడు. అది చూసి దుర్యోధనుడు సంతోషముతో కర్ణుని కౌగిలించుకొని మెచ్చుకున్నాడు. తరువాత కర్ణుడు అర్జునుని తనతో ద్వంద్వ యుద్ధము చేయుమని సవాలు చేయగా, అర్జునుడు కర్ణునితో యుద్ధముచేయుటకు తలపడగా ప్రదర్శనను తిలకిస్తున్న కుంతి భయవిహ్వలయై మూర్ఛపోయినది. అంత కృపాచార్యుడు వారి యుద్ధమును ఆపుచేయించి రాజవంశజుడైన అర్జునునితో సూత కులస్థుడైన కర్ణుడు ద్వంద్వ యుద్ధము చేయుటకు అర్హుడు కాడని చెప్పినాడు.

ఈ మాటతో దుర్యోధనుడు కోపోద్రిక్తుడై పాండవుల నోడించుటకు తనకు కర్ణుని స్నేహమవసరమని భావించి, కృపాచార్యునితో 'గురుదేవా! కర్ణుడు రాజు కాకపోవుటచేతనే కదా మీరు అభ్యంతర పెట్టుచున్నది? రాజ్యము నేలువాడు యెటువంటి వాడయినా

రాజేకదా? యని ధృతరాష్ట్రుని అనుమతిని తీసికొని అప్పటికప్పుడు కర్ణుని అంగరాజ్యాధి పతిగా అభిషేకించాడు.

దుర్యోధనుడు తనకు చేసిన మహోపకారమునకు వింతజెంది కర్ణుడు ఎ సంతోషముతో రాజా! నీవు నాకు కలుగజేసిన ఈ గౌరవమునకు ప్రత్యుపకారముగా ఏమివ్వగలను' అనగా 'నీవంటి అజేయ పరాక్రమవంతుడు నా జీవితమంతా స్నేహితునిగా వుండాలనే నా కోరిక. కనుక నీవు నా స్నేహితునిగా నుండుటయే నాకు చేయుగల ప్రత్యుపకారం' అని దుర్యోధనుడు సమాధానమిచ్చెను. దానితో ఆనాటి సభ ముగిసినది

గురుదక్షిణ

అస్త్రవిద్యా ప్రదర్శనానంతరము ద్రోణాచార్యుడు ఒకనాడు రాకుమారులతో 'మీ విద్యాభ్యాసము పూర్తి అయినది. మరి నాకు గురుదక్షిణ సమర్పించండి'. అని అడుగగా వారు ఏమి కావలెనో కోరుకోండి. తప్పక ఇచ్చెదము' యని చెప్పినారు.

ద్రోణాచార్యుడు చిరునగవుతో, ద్రుపదుడు తనను అవమానపరచిన సంగతిని చెప్పి 'రాజ్యమద గర్వితుడైన ఆ ద్రుపదుని ప్రాణాలతో తీసుకొనివచ్చి గర్వ దరిద్రుడైన మీ గురువునకు కానుకగా సమర్పించడి. అదే మీరివ్వతగిన గురుదక్షిణ' అన్నాడు.

ద్రుపదుని గర్వభంగము

కౌరవ కుమారులందరూ ద్రోణాచార్యునివద్ద సెలవు తీసుకొని, కొంత సేనను వెంటబెట్టుకొని వెళ్ళి పాంచాలపురాన్ని ముట్టడించి, ద్రుపదుని ధాటికి ఆగలేక వెనుతిరిగి వచ్చారు. అపుడు అర్జునుడు ద్రోణునకు నమస్కరించి, భీముని మాత్రం వెంట తీసుకొని వెళ్ళి ద్రుపదుని సేనలను యెదుర్కొన్నాడు. అర్జునునీ బాణ వర్షానికి సేనలు చెల్లాచెదురు అగుచుండుట గమనించిన ద్రుపదుడు అర్జునునితో ద్వంద్వ యుద్ధానికి తలపడ్డాడు. అంత భీముడు పాంచాల సేనలను నుగ్గు చేయుచుండగా అర్జునుడు ద్రుపదుని ఓడించి అతనిని పట్టి రథానికి కట్టి, తెచ్చి ద్రోణునకు సమర్పించెను.

ద్రోణాచార్యుని చూసి ద్రుపదుడు తల వాల్చుకొనగా, ద్రోణుడు ముసి ముసి నవ్వులు నవ్వుచూ 'ఓహో! రాజ్యాలనేలే మహారాజుగార్కి ఈ రోజున యీ దరిద్రుని

యెదుట తలవంచుకొని నిలబడవలసిన దుర్గతి పట్టినదా? అయ్యోపాపం అని 'మహారాజా! ఇప్పటికైనా నీ బాల్యస్నేహితుణ్ణి గుర్తించగలవా? గర్వాంధుడవై దరిద్రునకు ధనికునకు స్నేహం ఏ విధముగా కలుస్తుందని అన్నావు. మరి యిపుడు నీవు అన్నీ పోగొట్టుకొన్న బందీవి కదా? నాతో స్నేహము చేయుటకు అంతస్తుల తేడా రాదనుకుంటాను' అని పరిహసించగా, ద్రుపదుడు అవమానముతో తలవంచుకొని, ద్రోణునితో శాశ్వత మైత్రిని కోరి, తన తప్పును క్షమించుమన్నాడు.

'సరే, అర్ధరాజ్యం యిస్తున్నాను, తీసుకొని యేలుకో. గంగకు దక్షిణ భాగంగా వున్నదంతా నీవు తీసుకో. ఉత్తరంగావున్న రాజ్యాన్ని నేను తీసుకొంటాను అపుడు యిక స్నేహం చేయుటకు నక్కకు నాగలోకమునకు గల తేడా మనమధ్య లేకుండా సమాన అంతస్తు కలిగి వుంటాము' అని చెప్పి, ద్రోణుడు ద్రుపదుని వదిలివేసినాడు.



ద్రుపదుని ద్రోణునకు అప్పగిస్తున్న భీమార్జునులు

రాజ్యము చేరిన ద్రుపదుడు సైనిక బలముతో ద్రోణుని గెలవటం అసాధ్యమని భావించి, అర్జునుని పరాక్రమమునకు ఆనందించి యజ్ఞము చేసి ద్రోణుని చంపగల కుమారుని అర్జునుని భర్తగా పొందగల కుమార్తెను యజ్ఞఫలముగా పొందినాడు.

ధర్మరాజునకు యువరాజ పట్టాభిషేకము

కుమారులు పెద్దవారగుటచేత, ధృతరాష్ట్రుడు భీష్మాదులతో ఆలోచించి కౌరవ, పాండు కుమారులలో పెద్దవాడు సరళహృదయుడు, సద్గుణ సంపన్నుడు అయిన ధర్మరాజునకు యువరాజ పట్టాభిషేకం జరిపించినాడు. ధర్మరాజు రాజ్యపాలనను సమర్ధవంతముగా నిర్వహించుచు, పెద్దల మెప్పులేకాక ప్రజలచేత కూడా 'రాజ్యపాలనా నిర్వహణలో పాండురాజును మించినాడు' అని కీర్తింపబడుట చూసి దుర్యోధనుడు బాధచెందుచుండెను. క్రమేపి పాండవుల కీర్తి నేల నాలుగు చెరగులా వ్యాపించసాగినది.

దుర్యోధనుని పన్నాగము

పాండవులు అందరి మన్ననలు పొందుట భరించలేని దుర్యోధనుడు ధృతరాష్ట్రుని కడకేగి 'తండ్రి! దూరమాలోచింపక ధర్మరాజును యువరాజుగా నియమించినారు. రాజోద్యోగులు, ప్రజలు కూడా నీ గొప్పతనమును గుర్తింపక పాండవులనే కీర్తిస్తున్నారు. నీవు గ్రుడ్డివాడవూ, భీష్ముడు బ్రహ్మచారి పెద్దవాడూ యగుటచేత మిమ్ములను ఎవరూ గౌరవించుటలేదు. మీకు లభించని గౌరవము మీ పుత్రులమైన మాకు ఏమాత్రము ఏ విధముగా లభిస్తుంది అందుచేత మేము కూడా ఆ పాండవులకు దాసులం కావలసి వస్తోంది. కాబట్టి యెలాగైనా పాండవులను రాజ్యము నుండి పంపివేయాలి. అది నీ వల్లనే అవుతుంది' అని చెప్పగా, శకుని దానికి వంత పలికాడు.

అంత ధృతరాష్ట్రుడు 'అయితే యిప్పుడు నన్నేమి చేయుమంటావో చెప్పు నాయనా! ప్రజాభిమానమును సంపూర్ణముగా పొందిన సరళ హృదయుడైన ధర్మరాజును యే కారణము చూసి పదవీచ్యుతునిగా చేయమంటావో చెప్పు? అని అడుగగా దుర్యోధనుడు నవ్వి-

'తండ్రీ! ఏదో ఒక వంకతో పాండవులను కొంతకాలము రాజ్యము నుండి దూరముగా పంపండి. వారు లేని ఆ కాలములో మేము రాజ్యభారము వహించి, ప్రజలను

అన్నివిధములా సంతృప్తులను జేసి వారి అభిమానము పొందెదము. అటులచేసినచో మన యధికారము స్థిరపడుటచే గాక మేము కీర్తిమంతులమౌతాము. ఆ తరువాత పాండవులు తిరిగి వచ్చినా మమ్ముల నేమియు చేయలేరు. మీ కుమారులు ఔన్నత్యమును పొందవలెనని మీరు ఆశించినచో ఇది ఒక్కటియే మార్గము' అని చెప్పినాడు.

వారణావతగమనము

దుర్యోధనుని దుర్బోధ పూర్తిగా తలకెక్కిన ధృతరాష్ట్రుడు ఆలోచించి, ఒక నిశ్చయానికి వచ్చి పాండవులను పిలిపించి, ధర్మరాజుతో 'నాయనా ధర్మరాజా! మిమ్ములను చూస్తుంటే నా తమ్ముడు పాండురాజు దగ్గతే యున్నట్లుగా నున్నది. నా తమ్మని ఆత్మశాంతి కొరకు గోదాన, భూదాన, సువర్ణ-దానములు చేయండి అదీగాక యువరాజు వయిన నీకు లోకానుభవము మరింతగా పెరగాలి. అందుచేత మీరు కొంత కాలము వారణావతములో నుండి, దాన ధర్మములు ముగించుకొని దేశయాత్రచేసి రండి. వారణావతం మహాత్ములు నివసించు పుణ్యభూమి కనుక దాన ధర్మములు చేయుట కనువుగా నుండును. కావున నీవు రేపే నీ తమ్ములతో బయలుదేరుము' అని చెప్పెను.

ధృతరాష్ట్రుని మాటలకు శిరసావహించి భీష్మ, ద్రోణ, విదుర, కృపాదుల వద్ద సెలవు తీసుకొని ధర్మరాజు తల్లినీ, తమ్ముళ్ళనూ తీసుకొని మరునాడే వారణావతముకు బయలుదేరెను.

దుర్యోధనాదుల దురాలోచన

ఈ లోపుగా దుర్యోధనుడు - కర్ణ, దుశ్శాసనులతో ఆలోచించి పాండవులు వారణావతము చేరక ముందే యిక్కడ ఒక పెద్ద మేడను లక్కతో నిర్మింపజేసెను. ఆ మేడ చూచుటకు కన్నులు మిరుమిట్లు గొల్పుచూ యెంతో అందముగా చూడముచ్చటగా నున్నది. పాండవులు ఆ మేడలో నిద్రించుచుండగా హతమొనర్చుటకుగాను దుష్టచతుష్టయము పురోచనుడను వానిని నియమించినారు.

పాండవులు వారణావతము ప్రవేశించిన వెంటనే పురోచనుడు వారికి యెదురేగి "మహారాజా! తమకొరకు సుందరమైన మందిరమును నిర్మించినాను. తమరుండుటకు

ఆ మేడ బహు అందముగా కనుల కింపుగా నున్నది. రండి'' అని చెప్పి తన వెంట తీసుకొని వెళ్ళి ఆ మేడను చూపించినాడు. ధర్మరాజు ఆ లక్క మేడ యొక్క అందచందాలు చూసి సంతోషించి అందులో ప్రవేశించి ఉండసాగెను.

లక్కయిల్లు

రాజధానిలో విదురుడు దుర్యోధనాదుల కుట్ర నెరిగి తనకు నమ్మకమయినవాడూ, సొరంగములు త్రవ్వుటలో అఖండుడూ అయిన ఒక మనిషిని ధర్మరాజు వద్దకు పంపినాడు. వాడు ధర్మరాజును చేరి, 'రాజా! బహుళ చతుర్దశి రోజున, అర్ధరాత్రి మీరు నిద్రించుచున్న సమయమున ఈ యిల్లు తగుల బెట్టమని దుర్యోధనాదులు పురోచనుని నియమించినారు. అందుచేత మిమ్మల నందరినీ అతి జాగ్రత్తగా నుండ వలసినదిగా



లక్కయింటినుండి వెలువడుచున్న అగ్నిని చూస్తున్న పాండవులు

విదురులవారు తమకు తెలియజేయమన్నా'రని చెప్పి ఆ యింటి నుండి అడవిలోనికి ఒక సొరంగమును త్రవ్వి, తప్పించుకొనే మార్గము చూపి, వారి వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయినాడు.

అడవి మార్గములు తెలుసుకొనవలెను కనుక, ధర్మరాజు - దుర్యోధనుని దురాలోచన విషయము తమ్ములతో చెప్పి, పగలు వేట నెపముతో అడవి కేగుచు రాత్రిపూట, వంతులు వారీగా మేలుకొని కావలి ఉండసాగిరి. బహుళ చతుర్దశి రోజున కుంతి బ్రాహ్మణులను పూజించి, దానధర్మములు విరివిగా చేసినది. ఆ రాత్రి అందరూ నిద్రించుచుండగా మేలుకొనియున్న భీముడు - పురోచనుడు నిద్రించుచున్న గది గొళ్ళెము పెట్టి, తల్లినీ, తక్కిన పాండవులనూ సొరంగములోనికి పంపి, ఆ యింటికి తానే నిప్పు అంటించి సొరంగము చేరి, తల్లినీ అన్నదమ్ములనూ తీసుకొని అడవిలోనికి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి యెక్కడా చోటు దొరకని ఒక అనాథ యెరుకది తన అయిదుగురు పిల్లలతో ఆ యింటి వరండాలో పరుండి వున్నది. పురోచనునితో పాటు వారు కూడ ఆ యింట సజీవ దహనమైనారు.

తెల్లవారినది, లక్కయిల్లు కాలి బూడిద కుప్పగా మారిన విషయము ఊరంతా తెలిసినది. జనము తండోపతండాలుగా వచ్చి చూస్తున్నారు. ఆ ఇల్లు ఇంకా అక్కడక్కడ కొద్దిగా మండుచునే యున్నది. అంతలో సొరంగము త్రవ్వినవాడు వచ్చి పాండవ కళేబరముల కొరకు చూచు నెపముతో తెలివిగా సొరంగాన్ని బూడిదతో కప్పివేశాడు. అన్నివైపులా బూడిద పెళ్ళగించగా, ఒక స్త్రీ మరియు అయిదుగురు పురుషశవాలు మంటలలో మాడిపోయి గుర్తు తెలియని విధముగా నుండుటచేత వారే కుంతీ పాండవులని నిర్ధారణ చేసుకుని, జనం దుఃఖించారు. ఈ వార్త తెలిసిన ధృతరాష్ట్రుడూ, భీష్ముడూ, దుఃఖించగా, అన్నీ తెలిసిన విదురుడు కూడ వారితో పాటు పాండవుల దుర్మరణానికి చింతించాడు. దుర్యోధనాదులు మాత్రము పాండవుల బెడద తమకు శాశ్వతముగా తప్పినందుకు సంతోషము జెందారు.

పాండవుల పాట్లు

సొరంగము నుండి క్షేమముగా బయటపడిన పాండవులు అర్ధరాత్రి అరణ్య మార్గమున గంగాతీరమునకు బయలుదేరారు. అక్కడ వారికి సిద్ధముగా న్ను పడవ

కనిపించగా అక్కడకు వెళ్ళారు. వీరిని చూచి పడవవాడు దగ్గరికి వచ్చి విదురుడే ఈ ఏర్పాటు చేయించినాడని, విదురుడు చెప్పిన సంకేత రూపములోని మాటలు చెప్పినాడు. దానితో, వాడు చెప్పినది నిజమేనని నమ్మి వెంటనే గంగను దాటినారు. తరువాత ధర్మరాజు కొన్ని సంకేతపు మాటలు చెప్పగా అవి విదురునకు తెల్పుటకుగాను ఆ నావికుడు పడవను హస్తినాపురమువైపు మళ్ళించాడు.

గంగను దాటిన పాండవులు కొంతదూరము నడిచి, మరి నడువలేకపోగా 'ఇక లాభం లేదనుకున్న భీముడు వారనందరినీ యెత్తుకొని మరికొంత దూరమేగి యింకా రాత్రి మిగిలి ఉండుటచేత ఒక చెట్టుక్రింద దించి కూర్చున్నాడు. రాత్రి అంతా నిదురలేకపోవుటచేత అరణ్యమార్గమున నడచుట వలననూ అలసిపోయిన కుంతి, ధర్మరాజు, అర్జున, నకుల, సహదేవులు ఆ చెట్టు క్రిందనే పడుకుని నిద్రపోయారు. అది చూసి భీముడు 'యింత ఆపదలో వుండి కూడా నిద్రపోయారంటే వారెంత అలసిపోయారో కదా'' అనుకుని, వారిని జాగ్రత్తగా చూచుకుంటూ తాను అలాగే కాపలా కూర్చున్నాడు.

హిడింబాసురుడు

వీరికి సమీప ప్రాంతములలో హిడింబాసురుడు అనే రాక్షసుడు నివాసమున్నాడు. వాడికి నరవాసన తగిలి, ఇంత కీకారణ్యమునకు నరులెలా వచ్చారా? అనుకుంటూ ఆ ప్రదేశమంతయు కలయచూడగా చెట్టుక్రింద నిద్రించుచున్న పాండవులు కనిపించారు. దానితో, జంతు మాంసమే తిని బ్రతుకుతున్న వాడికి నోరూరి తన చెల్లెలు హిడింబను పిలిచి "హిడింబా! ఇంతకాలానికి మనకు ఆశతీరా నరమాంసం దొరికినది. నీవు పోయి ఆ మర్రిచెట్టు క్రింద నిద్రపోవుచున్న నరులందరినీ చంపి తీసుకొరా'' అని చెప్పి పంపాడు.

అన్నగారి మాటమీద చెట్టువద్దకు వచ్చిన హిడింబి, అచ్చట నిద్రించుచున్న పాండవులకు కాపలా కాస్తున్న భీముని చూసి మోహ పరవశురాలయినది. మనసు చలింపగా, తన అన్నగారి మాటలు మరచి అందమైన స్త్రీ రూపము ధరించి, పెదవులపై చిరునవ్వు లాస్యము చేయుచుండగా సిగ్గులొలక బోయుచు భీముని దరిచేరినది.

ఆమెను చూసిన భీముడు "ఎవరునీవు? అడవిలో ఒంటరిగా తిరుగుటకు కారణ

మేమిటి?'' అని అడుగగా, ఆమె ఓ అందగాడా! నేను హిడింబాసురుడనే రాక్షసుని చెల్లెలిని, మహాబలవంతుడూ, క్రూరుడూ అయిన మా అన్న మిమ్ములనందరిని చంపి తెచ్చి తనకు వండి పెట్టమని పంపినాడు. కాని నిన్ను చూడగానే నా మనస్సు చలించి పెళ్ళాడాలనే కోరిక కలిగినది', అని చెప్పినది.

"అదెలా సాధ్యమవుతుంది? నీవు యిచ్చే సుఖము కోసము నావాళ్ళనందరినీ నీ అన్న రాక్షసత్వానికి యెలా బలి చేస్తాను? మోహాన్ని విడిచిపెట్టి బుద్ధిగా వచ్చిన దారినే వెళ్ళిపో'' అన్నాడు భీముడు.

అందులకామె "రాకుమారా నన్ను నీవు భార్యగా స్వీకరించినట్లు అయితే! వారికి యే ఆపద రాకుండా నేను కాపాడుతాను'' అని చెప్పుచుండగానే హిడింబ యెంతకూ రాకపోవుటచేత ఆలస్యమును భరించలేక విసుగుజెందిన హిడింబాసురుడు పాండవులున్న



హిడింబాసురుని వధించుచున్న భీముడు

చోటుకు వచ్చి భీముని సరసన అందమైన రూపము ధరించి మాటలాడుచున్న చెల్లిని చూసి కోపోద్రిక్తుడై ఆమెను చంపబోయాడు. అది చూచి భీముడు వాడిని నేర్పుగా ఒడిని పట్టుకుని దూరముగా యీడ్చుకుపోయాడు.

హిడింబాసురుడు భీము పట్టు విడిపించుకుని గట్టిగా వాటేసుకుని వీపుపై గ్రుద్ది భయంకరముగా పెడబొబ్బ పెట్టాడు. వాడి కేకలకు తల్లికీ, సోదరులకూ నిద్రాభంగము కలుగుతుందని భావించి, భీముడు వాడిని మరింత దూరమునకు లాగుకొనిపోయి బొమ్మపై గ్రుద్ది మోకాలితో డొక్కలో పొడిచాడు. ఆ దెబ్బలకు హిడింబుడు మరింత రెచ్చిపోయి ప్రక్కనే వున్న చెట్టును పీకి కొట్టబోగా, భీముడు తప్పించుకున్నాడు. ఇద్దరూ మదపుటేనుగులవలె కలియబడగా వాళ్ళ తావులకు భూమి దద్దరిల్లినది. దానితో, కుంతీ, పాండవులూ నిద్రనుండి లేచి తమ సమీపముననే నిలబడియున్న స్త్రీమూర్తిని చూసినారు. వారు మేల్కొనుట చూసిన హిడింబ జరిగినదంతయు చెప్పి వారిని భీమ, హిడింబాసురులు పోరాడుచున్న ప్రదేశమునకు తీసుకువచ్చినది.

భీముడు హిడింబాసురుని రెండుకాళ్ళు పట్టుకుని గిరగిర త్రిప్పి అక్కడున్న బండ రాళ్ళపై కొట్టగా వాడు పెడబొబ్బలు పెడుతూ రక్తం కక్కుకుని ప్రాణాలు వదిలాడు. దానితో భీముడు సామాన్యుడు కాడని గ్రహించిన హిడింబ, అతనిపై మరింత అనురాగమును పెంచుకున్నది. హిడింబద్వారా అంతావిన్న కుంతీ, ధర్మరాజులు హిడింబను భార్యగా స్వీకరించమని భీమునితో చెప్పి వారి చేతులు కలిపారు.

ఘటోత్కచుని జననము

అపుడు భీముడు హిడింబతో 'హిడింబీ! నీకు ఒక కుమారుడు కలిగే వరకు మాత్రమే నీతో వుంటాను. అదయినా పగలు మాత్రమే రాత్రిపూట నా తల్లిని, సోదరులనూ విడిచి వుండటానికి వీలులేదు.' అని చెప్పి ఆమెను భార్యగా స్వీకరించినాడు. అంత హిడింబ, భీముని తీసికొని ఆకాశ మార్గమున వెళ్ళిపోయినది. భీముడు హిడింబతో చాలా సుఖంగా గడిపాడు. ఎన్నో ప్రాంతాలు విహరించాడు. కొలది కాలంలోనే హిడింబ గర్భవతియై ఒక కుమారుని గనెను. వాడు పుట్టిన వెంటనే కామరూపుడై నవయౌవనుడుగా సకల శాస్త్ర పారంగతుడుగా తయారైనాడు. వాడే ఘటోత్కచుడు.

ఘటోత్కచుడు కుంతికి, పాండవులకు నమస్కరించి, భీమునితో తండ్రీ! మీకు నా అవసరము కలిగినపుడు తలచుకోండి. వెంటనే వచ్చి మీ ఆనతిని శిరసావహిస్తాను' అని చెప్పి, ఉత్తరదిశగా బయలుదేరినాడు. హిడింబ కూడా అందరివద్దా సెలవు తీసుకొని భీమునికి నమస్కరించి కొడుకుతో వెళ్ళిపోయింది.

ఏకచక్రపురంలో నివాసము

పాండవులు ఘటోత్కచుని, హిడింబని సాగనంపి బ్రాహ్మణ వేషములు ధరించి దేశ సంచారము చేయసాగినారు. మార్గమధ్యములో వ్యాసుడు కనిపించి నాయనలారా! ధృతరాష్ట్రుడూ, వాని కొడుకులూ మీకు చేసిన అన్యాయము తెలిసి చాలా బాధ కలిగినది. ఈ చిన్న వయసులో మీరు కష్టాలపాలు అయినందుకు విచారించకండి. మీరు ఏకచక్రపురం వెళ్ళి అక్కడ కొంతకాలముండండి' అని చెప్పి ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

పాండవులు ఏకచక్రపురం జేరి, అక్కడ ఒక బ్రాహ్మణుని గృహములో నివాసం ఏర్పాటు చేసుకొన్నారు. కుంతీ పాండవులూ అచట అందరికీ మేలు చేస్తూ మంచిని పెంచుకుని భిక్షాటన చేస్తూ కాలక్షేపము చేయుచున్నారు. వారు తెచ్చిన ఆహారాన్ని కుంతి రెండు భాగములు చేసి ఒక భాగం భీమునికి పెట్టి రెండో భాగం తామందరూ తినేవారు. ఈ విధంగా ఒకనాడు కుంతీ, భీముడూ ఇంట నుండగా మిగతావారు నలుగురూ భిక్షాటనకు వెళ్ళారు. ఆ సమయమున బ్రాహ్మణుని యింటిలో నుండి యేడ్పులు వినిపించగా కుంతి వారి వద్దకు వెళ్ళి వారి యేడుపునకు కారణమడిగింది.

"ఏమని చెప్పగలమమ్మా! మాకు కలిగిన ఈ విపత్తు మానవ మాత్రులు తీర్చెడిది కాదు. ఈ నగరమునకు సమీపమున గల అడవిలో బకాసురుడను రాక్షసుడు నివాస ముంటున్నాడు. వాడు నగరములో జొరబడి కనపడిన వారినందరినీ చంపి తినుచుండెను. అది భరించలేక అందరమూ కలసి వాడితో ఒక ఒప్పందము చేసుకున్నాము. దాని ప్రకారము ఈ ఊరివాళ్ళు రోజునకొక యింటి వంతున ఒక బండెడు అన్నమును, రెండు యెనుబోతులను ఒక మనిషినీ వాడి కాహారముగా పంపాలి. ఈరోజు మావంతు వచ్చినది. ఆ రాక్షసుడికి ఆహారముగా ఎవరిని పంపను? ఇంతకాలము నాకు సహధర్మ చారిణిగా నుండి నావలన సంతానవతి అయిన నా భార్యను పంపనా వంశాంకురమైన

నా ఒక్కగానొక్క కుమారుని పంపనా? లేక మరొకరి చేతిలో పెట్టి కన్యాదానము చెయ్యవలసిన నా కూతురును పంపనా? ఏం చెయ్యను? ఎవ్వరినీ పంపలేను. కనుక నేనే పోతాను" అనినాడు బ్రాహ్మణుడు.

అది విన్న కుంతి "అయ్యా! మీరు దుఃఖించకండి. మీలో యే ఒక్కరూ వెళ్ళనవసరము లేదు. మీకు ఒక్కడే కొడుకు. నాకు అయిదుగురు కొడుకులున్నారు. అందులో ఒకడిని మీ కుమారునికి మారుగా పంపుతాను" అని చెప్పగా బ్రాహ్మణుడు చెవులు మూసుకొనుచు "అమ్మా ఎంతమాట అన్నారు? కొంతకాలము తల దాచుకుంటామని చెప్పి నాకు అతిథులుగా వచ్చినవారు మీరు' మీ కుమారుని మా వంతుగా పంపి చంపించి ఆ పాపమును భరించలేను" యనెను.

"అయ్యో? మీరు అంతగా బాధపడవలసిన అవసరము లేదు. ఆ రాక్షసుడు నా బిడ్డను చంపలేడు. నా కుమారుడే ఆ రాక్షసుని చంపుతాడు. రాక్షసులను చంపగల శక్తిని వాడి గురువు పదేశించాడు" అని చెప్పి, కుంతి వారిని ఒప్పించినది. తల్లి చెప్పిన పద్ధతికి భీముడు చాలా సంతోషించాడు.

భీమ బకాసురుల యుద్ధము

బ్రాహ్మణుడు బండికి రెండు దున్నపోతులను కట్టి, బండినిండుగా అన్నము రాసిపోసి భీమునికి అప్పగించగా, భీముడు దక్షిణ దిశగా తోలుకొనిపోయి అరణ్యానికి కొంత దూరంలో గల యమునానది ఒడ్డున బండిని ఆపి బకాసురుని రమ్మని కేకలు పెట్టాడు. వాడు వచ్చువరకు ఊరకే కూర్చోవడం దేనికని బండిలో గల అన్నమును తానే తినివేయ సాగెను.

భీముని కేకలు విన్న బకాసురుడు కోపముతో "ఏమి పొగరు? సామాన్య మానవాధముడు నన్ను రమ్మని కేకలు పెట్టుటయా?" అనుకొని మండిపడుతూ, పెద్ద పెద్ద అంగలు వేస్తూ బండిని సమీపించి అచట అన్నమును తినివేయుచున్న భీముని చేరి మరింత కోపముతో పెడబొబ్బ పెట్టి, రెండు చేతులూ యెత్తి భీముని వీపుమీద ఒక గ్రుద్దు గ్రుద్దాడు. ఆ దెబ్బకు చలింపక అన్నమంతయు తిని నదిలో నీరుత్రాగి త్రేన్చుచూ వచ్చాడు.



భీమ బకాసురుల ద్వంద్వయుద్ధము

ఈలోపుగా బకాసురుడు ఒక చెట్టును పీకి భీమునిపై పడవేయగా, భీముడు ఎడమచేతితో దానిని ప్రక్కన నెట్టి, మరొక చెట్టును పీకి వాడితో కలియబడ్డాడు. ఇక లాభము లేదనుకొని బకాసురుడు ద్వంద్వయుద్ధమునకు తలపడగా భీముడు కొంతసేపు అదే ప్రకారముగా యుద్ధము చేసి, చివరకు బకాసురుని క్రింద పడద్రోసి మోకాళ్ళతోను మోచేతులతోను కుమ్ముతూ ఎక్కడి అవయవాల నక్కడే విరగబొడిచాడు. దానితో బకాసురుడు బొబ్బలు పెడుతూ ముక్కు వెంట నోటివెంట రక్తము కక్కుతూ ప్రాణములు విడచినాడు.

భీముడు ఆ రాక్షసుని కళేబరమును తీసుకొనివచ్చి ఏకచక్రపుర సమీపమున పడవేసెను. బకుని చావుని గురించి తెలుసుకున్న ఆ పురప్రజలు ఆనందముతో ఆ రోజు పండుగ చేసుకున్నారు.

పాండవులు పాంచాల నగరమున కరుగుట

ఒకనాడు పాండవుల యింటికి యాత్రలు చేయుచున్న ఒక బ్రాహ్మణుడు అతిధిగా వచ్చెను. కుంతి ఆ బ్రాహ్మణునకు సంతృప్తిగా భోజనము పెట్టి యాత్రా విశేషములను తెలుసుకొనగోరెను. తాను చూసిన స్థలముల గురించి వివరించి ప్రత్యేకముగా చెప్పుకో తగినది పాంచాల దేశము గురించే" యనగా "ఏమిటి నాయనా ఆ ప్రత్యేకత" అని అడుగుతుంది కుంతి, అందులకా బ్రాహ్మణుడు

"పాంచాల దేశమేలే ద్రుపద మహారాజుకు అప్సరసవంటి అందాల రాశియగు ఒక కూతురున్నది. మొదటినుండి ద్రుపదునకు అర్జునుని అల్లునిగా చేసుకోవాలనే కోరిక వున్నదట. కాని దురదృష్ట వశమున పాండవులు లక్కయింట కాలిపోయివారని తెలిసి విచారముతో యిప్పుడా పిల్లకు స్వయంవరము నేర్పాటు చేసినాడు. అర్జునుని వంటి బహుముఖ ప్రజ్ఞాశాలి అయినవాడు తప్పితే ఆ స్వయంవరములో విజయము సాధించలేరు అనే ధృఢసంకల్పముతో నున్నాడు" అని చెప్పెను.

బ్రాహ్మణుని మాటలువిన్న అర్జునుడు స్వయంవర ముహూర్తము యెప్పుడో అడిగి తెలుసుకొన్నాడు. అప్పటికే ఏకచక్రపురము వచ్చి చాలా రోజులు గడుచుటచేత పాండవులు తమ యింటివారివద్ద సెలవు తీసుకొని, బ్రాహ్మణరూపములోనే పాంచాల నగరమునకు ప్రయాణమై స్వయంవర మహోత్సవము నాటికి పాంచాలపురము చేరి యొక బ్రాహ్మణుని యింట బస చేసినారు.


ద్రౌపదీ స్వయంవరము

అప్పటికే అనేక దేశాలనుండి వచ్చిన రాజకుమారులతో పాంచాల నగరము మహా సముద్రమువలె పొంగులెత్తుచు కోలాహలముగా నున్నది. యెటు చూచినా పచ్చనితోరణములతోను, యే ప్రక్కన విన్నా మంగళవాద్యములతోను గొప్ప తిరునాళ్ళవలె నగరమంతా వింత శోభను వెదజల్లుచున్నది.

పాండవులు స్వయంవర స్థలానికి వెళ్ళి ఒకపక్కగా ఉన్నతాసనముపై దుర్యోధనుడు మొదలగు కౌరవులు, కర్ణుడు, శిశుపాలుడు, జరాసంధుడు శల్యుడు, బలరామకృష్ణులు,

అశ్వత్థామ, కృతవర్మ, సాత్యకి, సాంబాది రాకుమారు లెందరో ఆసీనులై యుండుట చూసి, తాము మరోవైపు కూర్చుని యున్న బ్రాహ్మణుల వద్దకు చేరినారు. పాండవుల రాకను గమనించిన శ్రీకృష్ణుడు మనస్సులోనే వారిని ఆశీర్వదించినాడు. సభా మధ్యమున అందముగా నిర్మించిన స్వయంవర మండపమునకు ప్రక్కగా చాలా యెత్తయిన ప్రదేశమున ఒక మత్స్య యంత్రము అమర్చబడి యుండెను. దాని ప్రక్కన ఒక విల్లు అయిదు బాణములు యంత్రము క్రిందుగా నీటితో నిండిన ప్రదేశము కలవు.

ద్రుపదుని కుమారుడు దృష్టద్యుమ్నుడు సభావేదికపైకి వచ్చి సభనంతా ఒకసారి కలియ జూచి 'సభను జయప్రద మొనరింప వచ్చిన మహానుభావులారా! ఈనాడు జరుగుచున్న నా సోదరి స్వయంవరమునకు మీరెల్లరూ రావటం మాకు చాలా ఆనందదాయకము. అదిగో మత్స్యయంత్రము, దాని చెంతనున్న విల్లును ధరించి అక్కడ



మత్స్యయంత్రమును కొట్టుచున్న అర్జునుడు

గల అయిదు బాణములతో క్రింద ఏర్పాటుచేయబడిన నీటిలో యంత్ర ప్రతిబింబమును చూచుచు పైన తిరుగుచున్న మత్స్యాన్ని కొట్టగల వీరుని నా సోదరి వివాహము చేసుకొనగలదు. కనుక, మీయొక్క నైపుణ్యాన్ని చూపి విజయము పొంది నా చెల్లిని భార్యగా స్వీకరించండి" అని చెప్పినాడు.

ఆ సభలో నున్న దుర్యోధన కర్ణాది వీరులందరూ ఒక్కొక్కరుగా ప్రయత్నించినారు. కొందరు విల్లును యెక్కుపెట్టలేకపోయిరి. మరికొందరు విల్లు యెక్కుపెట్టినా అయిదు బాణాలతో మత్స్యాన్ని కొట్టలేకపోయినారు. ముందు వెళ్ళినవారు ప్రయత్నించి పరాజితులగుటచేత అందరు తమ ఆసనములనుండే లేవలేదు. ఈ విధముగా ఏ ఒక్క రాకుమారుడూ కూడా మత్స్యయంత్రాన్ని కొట్టలేనివాడుగానే నిర్ణయమైనది.

ఆ సమయమున అర్జునుడు బ్రాహ్మణ సమూహమునుండి లేచి వెళ్ళగా, సభలోని వారందరూ "మహావీరులైన రాకుమారులే కొట్ట'లేని మత్స్య యంత్రాన్ని బ్రాహ్మణుడు కొట్టడమా?' అని హేళన చేయసాగిరి. అర్జునుడు ఎవరి మాటలనూ లెక్కజేయక మనస్సులోనే కృష్ణునకు నమస్కరించి అవలీలగా ధనుస్సు నెక్కుపెట్టి ఒక్క బాణముతోనే మత్స్యయంత్రాన్ని నేలకూల్చెను. జయజయ ధ్వనులతో ఆ సభా మండపమంతా మారుమ్రోగగా ద్రుపదుని కూతురు 'కృష' ముందుకువచ్చి అందముగానున్న అర్జునుని కంఠమును పుష్పమాలతో అలంకరించెను. "తమకు దక్కలేదే ఈమె" అనుకున్న కొందరు రాజులు, "బ్రాహ్మణునకు రాజకుమార్తెనిచ్చి రాజవంశాలనే అవమానిస్తావా?" అని ద్రుపదుని ముట్టడించగా దుర్యోధనుని ప్రోద్బలముతో కర్ణాది రాజులు అర్జునునిపై బడినారు. పరిస్థితి గ్రహించిన వ్యాసమహర్షి ముందుకు వచ్చి "ఇతడు బ్రాహ్మణుడు కాదు' అజేయపరాక్రమ శాలీ, ద్రోణాచార్యుని ప్రియ శిష్యుడూ అయిన పాండుసుతుడు అర్జునుడు" అని చెప్పగా తమ కోరిక ఈ విధంగా నెరవేరినందుకు ద్రుపదుడు! కృష్ణ సంతోషించగా పాండవులు ఇంకా బ్రతికి వున్నందుకు కోపముతో మండిపడుచూ యేమియు చేయజాలక దుర్యోధనాదులూ మొదలు రాజులు ఎవరి దేశాలకు వారు వెళ్ళిపోయినారు.

ద్రౌపదీ కళ్యాణము

పాండవులు కృష్ణను వెంటబెట్టుకొని తమ బసకు వెళ్ళి, లోపలున్న తల్లితో నవ్వుచూ 'అమ్మా! మేము అమృతమువంటి భిక్షనొకదానిని తీసుకొని వచ్చినాము' అని చెప్పినారు.

ఆ మాటలు విన్న కుంతి, అలవాటు ప్రకారము "అయిదుగురూ సమంగా పంచుకొని తీసుకోండి నాయనలారా!" అన్నది, ఆమె మాటలకు పాండవులు నిర్ఘాంత పోగా, విషయం తెలుసుకున్న కుంతి తన తొందరపాటునకు విచారించినది. అయినా తల్లి మాటను జవదాటక పాండవులు కృష్ణని భార్యగ స్వీకరింప నిశ్చయించుకున్నారు. అంతలో ద్రుపద మహారాజు పాండవుల వద్దకు వచ్చి, వారిని సగౌరవంగా అంతః పురమునకు తీసుకొని వెళ్ళినాడు. తరువాత పాండవుల వివాహ విషయము తెలుసుకొని, ఒక కన్య అయిదుగురు అన్నదమ్ములకు భార్యగా యెట్లు మసులుకొన గలదు!" అనుకొనుచుండగా అచట గల వ్యాసమహర్షి - ద్రుపదుని సందేహమును తీర్చి, ద్రౌపదియొక్క పూర్వజన్మ రహస్యాన్ని బైట పెట్టినాడు. ద్రుపదుడు కూడా తన కుమార్తె పూర్వజన్మను గురించి తెలుసుకొనుటచేత సంతోషముతో పాండవులైదుగురికి ద్రౌపదినిచ్చి అతి వైభవముగా కళ్యాణం జరిపించాడు.

హస్తినాపురమందు భీష్మద్రోణాదులు పాండవులు బ్రతికే యున్నారని తెలిసి సంతోషించుచుండగా, దుర్యోధనాదులు మాత్రం "వీరిని ఏ విధంగా చంపవలెనా!" యని ఆలోచించసాగినారు పాండవులు లక్కయింట చావకుండా "ద్రౌపదిని వివాహమాడి తమకన్నా సుఖంగా వున్నారే-యని బాధపడుచున్న దుర్యోధనుని వైఖరిని గ్రహించి భీష్ముడు దుర్యోధనునికి జ్ఞానబోధచేసి ధృతరాష్ట్రునికి పాండవులను రప్పించుట ఉచితమని చెప్పినాడు ధృతరాష్ట్రుడు. భీష్ముని మాట ప్రకారము పాండవులను తీసుకొని రమ్మని విదురుని పంపినాడు.

విదురుడు పాంచాల నగరమునకు వెళ్ళి ద్రుపద మహారాజుతోను, పాండవులతోను ధృతరాష్ట్రుని కోర్కెను తెల్పినాడు. పాండవులు, ధృతరాష్ట్రుని కోర్కెను ఆజ్ఞగా భావించి ద్రుపదుని వద్ద సెలవు తీసుకొని కుంతి ద్రౌపదులతో విదురుని వెంట హస్తినాపురికి

బయలుదేరినారు. వారిలో ద్రౌపది అన్న దృష్టద్యుమ్నుడు సైన్యముతో వెంట వచ్చి పాండవులను సగౌరవంగా హస్తినాపురము చేర్చినాడు.

ధృతరాష్ట్రుని అనుమతి ప్రకారము కృప, వికర్ణ, ద్రోణాచార్యుడు మొదలగువారు పాండవుల కెదురేగి సత్కరించి తీసుకొని వచ్చినారు. ఇక కనిపించరని నిరాశ చేసుకున్న పాండవులు మరల కనిపించి కనులార చూచుకొన గలిగినందులకు పురజనులు పరమానందముతో స్వాగతం పలికి ఆ రోజు పండుగ చేసుకున్నారు. ఈ విధముగా లభించే అందరి అనురాగముతో పాండవులు హస్తినాపురిలో ధృతరాష్ట్రుని వద్దనే కాలం సాగినారు.

ఒకనాడు సభలో రాచకార్యములను గురించి పెద్దలతో సంప్రదించుచున్న ధృతరాష్ట్రుడు పాండవులను పిలిపించి ధర్మరాజును తాను అన్నమాట ప్రకారము అర్ధరాజ్యమునకు రాజుగా నియమించినాడు. పాండవులు ఖాండవ ప్రస్థమనే ప్రాంతమును రాజధానిగా నిర్ణయించుకొని తమ అభిప్రాయమును శ్రీకృష్ణునకు తెల్పినారు. అంత శ్రీకృష్ణుడు ఇంద్రునితో చెప్పి విశ్వకర్మను పిలిపించి ఆ ఖాండవ ప్రస్థమున సభా భవనమునేకాక నివాసమునకు కూడా ఉపయోగముగా నుండునట్లు చక్కని పట్టణమును నిర్మించుమని ఆదేశించెను. శ్రీకృష్ణుని ఆనతి ప్రకారక విశ్వకర్మ అతితక్కువ వ్యవధిలోనే అచ్చట గొప్ప పట్టణమును నిర్మించెను. ఇంద్రలోకమును బోలి యుండుటచేత 'ఇంద్ర ప్రస్థము' అను పేరు నిర్ణయించి కృష్ణుని అనుజ్ఞపై పాండవులు తల్లితోను ద్రౌపదితోను ఆ పట్టణమునందే నివసించుచు శాంతమూర్తులుగా ఖ్యాతి పొంది, ప్రజారంజకముగా రాజ్యపాలన చేయుచు, సర్వసుఖములను అనుభవించసాగినారు.

ఇట్లుండగా ఒకరోజు నారదుడు ఇంద్రప్రస్థమునకువచ్చి, పాండవుల యోగ క్షేమములను తెలుసుకొని, వారిచ్చిన ఆతిథ్యమును స్వీకరించి ఇట్లనెను. 'పాండు కుమారులారా! మీరు ఇప్పటికే ఎన్నో అవాంతరములను ఎదుర్కొని కష్టాలు అనుభవించారు. వాటినన్నింటినీ అధికమించి ఈరోజు రాజ్యపాలన చేస్తూ సమస్త సౌఖ్యా లనుభవిస్తున్నారు. అంతేకాక, లోకంలోయెవ్వరూ చెయ్యలేని పనిచేసి మీ తల్లి మాట ప్రకారము ఒకే కన్యను ఐదుగురు వివాహమాడినారు. అది మాకు ఆనందమే కాని,

మున్ముందు యెటువంటి అనర్ధములూ జరుగకుండా మీరొక కట్టుబాటుకు నియమితులై యుండుట మంచిది. ఎందుకంటే, పూర్వము ఒక స్త్రీ విషయములోనే సుందోప సుందులు యిద్దరూ కొట్టుకొని చచ్చిపోయారు."


అది విన్న పాండవులు 'మహాత్మా! మీరు ఏదిచెప్పినా మా మేలు కోరియే చెప్పుదురు కనుక, ఆ కట్టుబాటు ఏ విధంగా నుండుట మంచిదో మీరే సెలవీయండి అన్నాడు.

ద్రౌపది ఒక్కొక్కరి యింట ఒక సంవత్సరము వుండవలెననియు అలా ఆమె ఎవ్వరి యింట నున్నదో వారు తప్ప మరొకరు ఆ యింటికి పొరపాటుగానైనా వెళ్ళరాదనియు, ఆ విధముగా యెవరైనా వెళ్ళినట్లు అయితే ఆ వెళ్ళినవారు పన్నెండు నెలలు తీర్థయాత్రలు చేయవలెననియు నారదుడు తన అభిప్రాయమును తెల్పినాడు. ఆ పద్ధతి పాండవులకు నచ్చి, తమ సమ్మతిని తెలియపరచగా నారదుడు వారిని ఆశీర్వదించి వెళ్ళిపోయెను.

బ్రాహ్మణ ఆర్తనాదము

నారదుని సలహాను పాటించుచూ కాలం గడుపుచున్న పాండవులు చాలా సుఖముగా వున్నారు. ఇలా వుండగా నొకనాడు బ్రాహ్మణుడొకడు ఆర్తనాదము చేయుచు అర్జునుని వద్దకు వచ్చి తన ఆవును దొంగలు తోలుకొని పోవుచున్నారనియు, అదియే తనకు జీవనాధారమనియు, ఆ గోవును రక్షించుమనియు మొరపెట్టుకొనెను. అంత అర్జునుడు నీ గోవును తెచ్చి యిచ్చెదను, చింతింపకు"మని బ్రాహ్మణుని ఓదార్చి పంపించినాడు.

కాని తన ఆయుధములు ధర్మరాజు గృహములో నున్నవి ద్రౌపది ధర్మరాజు వద్దనే ఉన్నది. ఏమిటి మార్గం? అని ఆలోచించి, ఒక నిర్ణయమునకు వచ్చి గోవును పట్టుకొనుటయే తన ముఖ్య కర్తవ్యమని భావించి ధర్మరాజు గృహంలో మరోవైపున ఆయుధ రధశాలకు వెళ్ళి విల్లు అమ్ములు తీసుకొని దొంగలను వేటాడి గోవును పట్టించి తెచ్చి బ్రాహ్మణునికి అప్పగించినాడు. తరువాత ధర్మరాజు వద్దకు వచ్చి పట్టించి తెచ్చి బ్రాహ్మణునికి అప్పగించినాడు. తరువాత ధర్మరాజు వద్దకు వచ్చి అన్నా! నీవు ద్రౌపదితో మందిరమునందుండగా నేను ప్రవేశించి నియమ భంగము చేసినాను కనుక నియమం ప్రకారం పన్నెండు మాసములు తీర్థయాత్రలు చేసి వస్తాను' అని చెప్పినాడు.



ఆయుధముల కొరకై ధర్మరాజు గృహములోనికి వచ్చిన అర్జునుడు

అందుకు ధర్మరాజు "అర్జునా? నీవు బ్రాహ్మణ కార్యార్థివై వచ్చినావు కనుక తప్పులేదు" అన్నాడు, కాని అర్జునుడు అందులకు సమ్మతింపక అన్నదమ్ములను తల్లినీ ఒప్పించి తీర్థయాత్రలకై బయలుదేరి వెళ్ళినాడు.

ఉలూచి కళ్యాణము

అర్జునుడు గంగాతీరమును చేరుకొని అచ్చట ఒక చెట్టుక్రింద విశ్రమించెను. ఆ ప్రాంతమున గల నాగకన్య 'ఉలూచి' అర్జునుని సౌందర్యమును చూసి మోహ పరవశురాలై నాగలోకమునకు తీసికొని వెళ్ళి హంసతూలికా తల్పముపై పరుండబెట్టెను.

నిద్రనుండి మేల్కొన్న అర్జునుడు పాన్పువద్ద తనకు యెదురుగా నున్న నాగకన్యను చూసి "నీ వెవరవు? నన్ను యిక్కడికి ఎందుకు తీసుకొని వచ్చినావు?" అని అడుగగా ఆమె-



నిద్రించుచున్న అర్జునుని సౌందర్యమును తిలకించుచున్న ఉలూచి

'నేను ఉలూచి అన నాగకన్యను, నీ సౌందర్యము నా మనస్సును పరవశింప జేసినది. కనుక నన్ను పెండ్లి చేసుకొని నా కోరికను తీర్చు. నీవు సుఖింపుము' అన్నది.

'నేను ప్రస్తుతము తీర్థయాత్రలు చేయుచున్నాను ఇప్పుడు నిన్ను వివాహమాడినచో నియమభంగమగును' అని చెప్పగా,

ఉలూచి బాధపడి 'నీవు నన్ను కాదన్నచో ప్రాణత్యాగం చేస్తాను. ఆ పాపం నీకు అంటుకుంటుంది కనుక, నాకు ప్రాణదానం చేయు'మనగా, అర్జునుడు ఆమె నిర్ణయానికి కలతజెంది, ఆమెను వివాహమాడినాడు. కొద్దిరోజులు ఉలూచితో స్వర్గసౌఖ్యాలు అనుభవించి ఆమెద్వారా సద్యోగర్భమున 'ఇరావంతుడు' అనుకొడుకును పొంది అచట నుండి బయలుదేరి అనేక క్షేత్రములను దర్శించి దక్షిణ దేశములోని మణిపురము చేరెను.

అర్జున, చిత్రాంగదుల వివాహము

మణిపుర రాజయిన చిత్రవాహనుడు అర్జునుని ఆహ్వానించి అతిథి సత్కారములను జేసి తన కుమార్తె చిత్రాంగద నిచ్చి వివాహము జరిపించినాడు. చిత్రాంగదతో కొంత కాలం సుఖంగా గడిపి, ఆమెవలన 'బభ్రువాహనుడు' అనే కొడుకును పొంది చిత్రాంగద, చిత్రవాహనుల వద్ద సెలవు తీసుకొని మరికొన్ని తీర్థములను సేవించి, యతి వేషమును ధరించి ద్వారకా నగరమునకు ప్రయాణమైనాడు.

సుభద్రార్జునుల కళ్యాణము

అర్జునుడు ద్వారకకు వస్తున్నాడని తెలుసుకున్న శ్రీకృష్ణుడు యెదురేగి అర్జునుని కౌగిలించుకొని, కుశలప్రశ్నలువేసి యోగక్షేమాలు తెలుసుకొని రైవతకపర్వత ప్రాంతమున గల ఉద్యానవనములో విడిది ఏర్పాటు చేయించినాడు. యాదవులంతా ఆ మాయ సన్యాసికి పూజలు చేసి వెళ్ళిపోవుచున్నారు. అర్జునుని మనసు గ్రహించిన కృష్ణుడు తన చెల్లెలు సుభద్రను అతని శుశ్రూషకు నియమించినాడు.

అన్నగారి ఆదేశం ప్రకారం యతికి పరిచర్యలు చేస్తున్న సుభద్ర త్వరలోనే ఆ యతి అర్జునుడే యని తెలిసినది. ఆనాటి నుండి మరింత ఆనందోత్సాహములతో పరిచర్యలు చేయు ఎక్కువ కాలం అర్జునుని వద్దనే గడుపుచుండెను. ఆ యిద్దరి మనసులు కలియుట గ్రహించిన కృష్ణుడు వారికి వివాహము చేయు సంకల్పముతో మహేశ్వరులకు ఉత్సవము చేయ తలపెట్టినాడు. యాదవులందరు ఉత్సవమును చూడవచ్చినారు. శ్రీకృష్ణుడు అదే సమయమని భావించి యతివేషమును మార్పించి సుభద్రార్జునులకు కళ్యాణము జరిపించి, వారిని ఇంద్రప్రస్థ పట్టణమునకు రథముపై వెళ్ళుడని పంపి ఏమీ తెలియనివానివలె ద్వారకకు చేరి తన మందిరమున నిద్రించినాడు.

రథముపై సుభద్రను తీసుకొని వెళ్ళుచున్న అర్జునుని చూసి నగర పాలకులు సైన్యముతో అడ్డగించగా, సుభద్ర రథము తోలుచుండగా అర్జునుడు వారి నెదిరించి ముందుకు సాగెను.



యతి వేషమున వున్న అర్జునుని సేవించుచున్న సుభద్ర

ఈ వార్త తెలిసిన బలరాముడు కోపముతో శ్రీకృష్ణుని పిలిపించి విషయము తెల్పగా తన మేనమరదలిని తను తీసుకొని వెళ్ళుటలో అర్జునుని తప్పులేదు. అని సమర్థించినాడు. కృష్ణుడు చెప్పిన మాటలు విన్న బలరాముడు ఇది కృష్ణుడు చేసిన పనిగానే భావించి శాంతించినాడు.

యాదవులు జయించి సుభద్రార్జునులు ఇంద్రప్రస్థము చేరుకొన్నారు. సుభద్ర కుంతికి ద్రౌపదికి నమస్కరించినది. ద్రౌపది ఆమెను అక్కున చేర్చుకున్నది.

మరికొంత సేపటికి శ్రీకృష్ణుడు వసుదేవాదులతో కలసి, వస్తువాహనములను తెచ్చి చెల్లికి సారె యిచ్చినాడు. ఈ విధముగా శ్రీకృష్ణార్జునుల అనుబంధము మరింత గట్టిగా ముడిపడినది. కొద్ది కాలానికి అన్ని విధములా మంగళప్రదమైన శుభఘడియలలో సుభద్రకొక కుమారుడు జన్మించినాడు. ఆ బాలుడే అజేయ పరాక్రమశాలి, అద్వితీయ

రూపవంతుడూ అయిన అభిమన్యుడు మరికొంతకాలమునకు ద్రౌపదికి అయిదుగురు కుమారులు జన్మించారు. వీరినే ఉప పాండవులంటారు.

అగ్నిదేవుని వేదన

వేసవి కాలమున ఒకనాడు కృష్ణార్జునులు చల్లగాలి కొరకు వన విహారమునకై రంగు రంగుల పూలతీగెలు, చందన వృక్షాలు, మంచి చంద్రకాంత శిలావేదికలు చిత్ర విచిత్రములయిన ఔషధ వృక్షములు కలిగి - అతిమనోమహరముగానున్న ఖాండవ వనమునకు వెళ్ళి, అచటగల సెలయేరుల సమీపమున విహరించుచున్నారు.

ఆ సమయమున బ్రాహ్మణుడొకడు కృష్ణార్జునులను సమీపించి "మహానుభావులయిన కృష్ణార్జునులారా! మీ సహాయము కోరి వచ్చినవాడను. నన్ను కాపాడి ప్రాణదానము చేయు"డని వేడుకొనెను. విషయ మేమిటో తెలుసుకొనకనే యిద్దరూ బ్రాహ్మణునకు అభయమిచ్చి "ప్రాణదానము ఏ విధంగా చేయవలెనో తెలియజేయ" మన్నారు. అప్పుడా విప్రుడు-

'నేను అగ్నిదేవుడను శ్వేతకి అను రాజు పండ్రెండు సంవత్సరములు యజ్ఞము చేసినాడు. ఆ యజ్ఞములోని నెయ్యి ప్రతిరోజు త్రాగవలసి వచ్చుటచేత నాకు అజీర్ణ రోగము పట్టుకున్నది. ఆ బాధను భరించలేక, బ్రహ్మయొద్దకు వెళ్ళి మొరపెట్టుకొనగా, 'అనేక రకముల దివ్యౌషధములకు నిలయమైన ఖాండవ వనమును దహించ గలిగినచో, సంపూర్ణ ఆరోగ్యము చేకూరు'నని చెప్పినాడు కాని, ఇంద్రుని రక్షణలో నున్న ఈ వనాన్ని దహించే శక్తి నాకు లేదు. అలాఅని ఊరుకొంటే ఈ అజీర్ణ బాధ నా ప్రాణము తీసేస్తూ ఉంది. ఆ బాధ భరించలేను. కనుక మీరిద్దరూ ఈ వన దహనానికి నాకు సహాయము చేసి, నన్ను సంపూర్ణ ఆరోగ్యవంతునిగా చేయవలెను'అని తన వేదనను తెల్పాడు.

అంత కృష్ణార్జునులు 'అగ్నిదేవా! ఇంద్రునిచే కురిపించబడు వర్షము నీపై పడకుండా ఆపగలము, కాని, ఇపుడు మావద్ద ఆయుధములు లేవే? యెట్లు తోడ్పడగలము' అన్నారు.

తక్షణమే అగ్నిదేవుడు వరుణ దేవుని వద్దకు వెళ్ళి అర్జునునికి గాండీవము, అక్షయ బాణ తూణీరములు, కృష్ణునకు కౌమోదకి అను గదను, సుదర్శన చక్రాన్ని తీసుకొనివచ్చి

యిచ్చాడు. అంతేగాక యిద్దరికీ ఉపయోగపడు కపిధ్వజము గల దివ్యరథమును కూడా యిచ్చెను.

ఖాండవ వన దహనము

కృష్ణార్జునులు ఆ ఆయుధములు ధరించి 'ఇక నిర్భయంగా నీపని సాగించు, దేవలోకమే కదలివచ్చినా నిన్ను ఆపలేరు' అని చెప్పి అగ్నిదేవుని పంపి, వనముపై వర్షం పడకుండా బాణములతో పందిరి యేర్పాటు చేయసాగినారు. అగ్నిదేవుడు కృష్ణార్జునులు యిచ్చిన అభయముచే యెనలేని ఉత్సాహముతో వనాన్ని నాలుగువైపుల నుండి దహించ మొదలిడెను. ఇది చూసిన వనపాలకులు భీతి చెంది ఇంద్రునకు తెల్పినారు.

ఇంద్రుడు కోపోద్రిక్తుడై వనముపై యెన్నడూ యెరుగునంత గొప్పవర్షమును కురిపించమని పుష్కలావర్తక మేఘములకు ఆజ్ఞ యిచ్చినాడు.



ఖాండవ వన దహమనమునకు సహకరిస్తున్న కృష్ణార్జునులు

ఇంద్రుని ఆజ్ఞ ననుసరించి అన్ని దిక్కుల నుండి దట్టమైన మేఘాలు క్రమ్ముకు వచ్చి కుంభవృష్టిగా వర్షము కురిపించసాగినది. కాని అర్జునుడు బాణాలతో నిర్మించిన పందిరి నుండి ఒక్క చుక్క నీరు అయినా ఆ వనము మీద పడకపోవుటచేత అంత వర్షము కూడా మంటలనార్పలేక పోయినది. అది చూసి ఇంద్రుడే స్వయముగా వచ్చి కృష్ణార్జునులను యెదుర్కొని యేమియు చేయజాలక పోయెను. అది చూసి అర్జునుడు వెళ్ళి ఇంద్రునకు నమస్కరించాడు. అపుడు ఇంద్రుడు కోపాన్ని మరచి పుత్ర వాత్సల్యముతో అర్జునుని దీవించి మరికొన్ని దివ్యాస్త్రముల నిచ్చి తిరిగి వెళ్ళిపోయెను.

మయుడి ఆర్తనాదము

ఈ విధముగా కృష్ణార్జునుల రక్షణలో ఏ ఆటంకము లేక ఖాండవ వనాన్ని సమూలంగా దహించిన అగ్నిదేవునికి అజీర్ణ రోగము పోయినది. కాని, ఆ వనములోనే నివసిస్తున్న యముడు అనే రాక్షసుడు ఆ మంటల నుండి బయటకు రాలేక దిక్కు తోచక 'శరణు శరణు' అనుచు ఆర్తనాదము చేయుచుండెను. మయుని ఆర్తనాదము విన్న అర్జునుడు, వాని నా మంటల నుండి బయటకు లాగి రక్షించెను.

★★★

సభాపర్వము

మయసభా నిర్మాణము

మయుడు, రాక్షసుల విశ్వకర్మ, చక్కని కట్టడములను అనేక విధములైన చిత్ర విచిత్ర శిల్ప కళలను యెరిగినవాడు. ఖాండవ దహన కాలమున తనకు ప్రాణ దానము చేసిన అర్జునుడి మేలు మరువలేక వారికి యేదైనా ఒక గొప్ప భవనమును నిర్మించి యివ్వ తలచి "ధర్మరాజుతో 'ప్రభూ! మీ సోదరుడు నాకు చేసిన మేలు ఎన్నటికి మరువలేను, అందుకు కృతజ్ఞతగా ఒక అద్భుతమైన నిర్మాణమును తమకు సమర్పించుకొన వలెనని కోరికగా నున్నది. కనుక ఏమి నిర్మింపవలెనో సెలవీయండి" అనెను.

అంత శ్రీకృష్ణుడు 'పాండవులు గొప్ప పరాక్రమశాలులు. దయామయులు కనుక అపూర్వము విచిత్రము, మణిమయ రమణీయమైన ఒక సభా భవనమును నిర్మింపు' అని చెప్పెను. మయుడు యెనలేని ఆనందముతో వివిధ రకముల రత్న మాణిక్యములను తెచ్చి చూపరులను మభ్యపరచే విధంగా ఒక అపూర్వ కళాకాండము వంటి సభా భవనమును అనతి కాలములోనే నిర్మించాడు. శ్రీకృష్ణుడు పాండవులు ఆ భవనమును చూసి మయుని చాతుర్యమునకు అబ్బురపడినారు.

ఒక శుభముహూర్తమున బ్రాహ్మణోత్తములు వేదమంత్రములు పఠించుచుండగా శ్రీకృష్ణుడు, సోదరులు, కుంతి వెంటరాగా ధర్మరాజు ద్రౌపదీయుక్తుడై నూతన గృహప్రవేశము గావించెను. ఆ రోజున బ్రాహ్మణులకు భోజనములు పెట్టించి యెనలేని కానుకలను సర్పించెను. గృహప్రవేశ మహోత్సవమునకు విచ్చేసిన రాజులు, మహర్షులు, పురవాసులు, బంధువులు ధర్మరాజును అభినందించి, ఆశీర్వదించి మయుని సభా నిర్మాణ చాతుర్యమునకు ఆశ్చర్యము జెందినారు.

నారదుని ఆగమనము

నారదుడు మయ సభను చూడదలచి పాండవుల వద్దకు వచ్చినాడు. పాండవులు నారద మహర్షికి స్వాగతం పలికి అతిధి సత్కారములు గావించి మయసభలోని వింతలను విశేషాలను కూలంకషంగా తెల్పి, భవనమంతా చూపించినారు. అది చూసిన నారదుడు 'ధర్మరాజా! ఇంత గొప్ప భవనమును ఇంద్రుడు కూడా నిర్మించుకోలేక పోయినాడు. ముల్లోకములందును ఇంతటి దివ్య భవనమును సంపాదించగలిగిన భాగ్యమన్న నీదే భాగ్యము దీనికి తోడు రాజసూయ యాగము కూడా చేస్తే మీ కీర్తి దశదిశలా మార్మోగుటయేగాక, మీ తండ్రి కోరికయు తీర్చినట్లవుతుంది. స్వర్గమందు గల నీ తండ్రి ఆనందించును. కనుక త్వరలోనే రాజసూయమును జరుపుటకు యేర్పాట్లు గావింపుము' అని చెప్పి వెళ్ళిపోయెను.

పాండవులు రాజసూయ యాగమును గురించి కృష్ణునకు తెల్పారు అది విని శ్రీకృష్ణుడు ఆలోచించి బావా? 'అజేయ పరాక్రమవంతులయిన తమ్ములు గల నీవు కాక మరెవ్వరు చేయగలరు రాజసూయము? కాని నాలుగు దిక్కుల యందునా విజయం

పొందుటలో గొప్ప చిక్కువున్నది. మొదట మగధదేశపు రాజయిన జరాసంధుని జయింపవలెను. వాడు ఆయుధములతో చావడు. మల్లయుద్ధమున భీమునిచే హతమొనరింప వలెను' అని చెప్పి మొదటి ప్రయత్నముగా ధర్మరాజుని అనుమతి తీసుకొని భీమార్జునులను వెంటబెట్టుకుని బ్రాహ్మణ వేషములు ధరించి గిరి వ్రజపురము చేరుకుని రాజమందిరములో ప్రవేశించినారు. ఆ వచ్చినవారు బ్రాహ్మణులే యనుకొని జరాసంధుడు యెదురేగి లోనికి తీసుకొని వెళ్ళి 'బ్రాహ్మణోత్తములారా! నా వలన తమకు కావలసిన సహాయమేమిటో తెల్పితే తీర్చగలను' అనగా -

కృష్ణుడు 'జరాసంధా! నీవు మాకు యివ్వగలిగిన దేమియు లేదు. మాతో యుద్ధము చేస్తే చాలు' అన్నాడు.

ఆ మాటలకు జరాసంధుడు చకితుడై బ్రాహ్మణోత్తములతో నేను యుద్ధము చేయుటయా? ఇదేమి వింత కోరిక' యనగా, కృష్ణుడు వానితో మేము బ్రాహ్మణులము కాము జరాసంధా! నేను కృష్ణుడను వీరిద్దరూ భీమార్జునులు' అని చెప్పెను. ఆ వెంటనే శ్రీకృష్ణుడు బ్రాహ్మణ వేషము తొలగించి యధా రూపముతో నిలచెను.

అది చూసి జరాసంధుడు "కృష్ణా! మీలో యే ఒక్కరికీ నేను అపకారము చెయ్యలేదే! అటువంటి నన్ను యుద్ధానికి పిలుచుటలో అంతరార్థం యేమిటో తెలుసుకొనవచ్చునా?" అని అడిగినాడు.

నీవు మాకు అపకారం చేయకపోయినా ఎంతోమంది భక్తులను హింసించినావు. మరెన్నో పాపాలు చేశావు. అటువంటి ప్రజాకంటకుడవైన నిన్ను చంపబూనుటలో తప్పేమీ ఉండదు. ఉత్తమ క్షత్రియకులములో జన్మించిన వాడెవ్వడూ యుద్ధము చేయుటకు వెనుకాడడు కనుక మాలోని యెవరో ఒకరితో యుద్ధముచేసి, చేతనయితే విజయము సాధించుకో! మాలో యుద్ధానికి యెవరి నెంచుకుంటావో చెప్పు" అన్నాడు కృష్ణుడు.

అపుడు జరాసంధుడు 'కృష్ణా! నీవా జిత్తులమారి యాదవుడవు. ఇక అర్జును డంటావా? నాకన్నా చిన్నవాడు కనుక, నాకు సమఉజ్జీ - నాతో మల్లయుద్ధము చేయగలవాడు భీముడు మాత్రమే" అన్నాడు.

జరాసంధుని మరణము

దేహ దారుఢ్యములోనూ బల పరాక్రమములలోనూ సమానులయిన భీమ జరాసంధుల మల్లయుద్ధము చాలా ఘోరంగా సాగినది. ఒకరినొకరు తీసిపోకుండా పదు నాల్గు రోజులు ఏకధాటిగా పోరాడినారు. వారిద్దరూ యుద్ధము చేస్తుంటే రెండు మదపుటేనుగులు పోరాడుతున్నట్లుగా నున్నది.

పదునాలుగవ రోజు రాత్రి శ్రీకృష్ణుడు చెప్పిన ప్రకారము మరుసటి రోజున భీముడు తన పినతండ్రి వాయుదేవుని ప్రార్థించి మహాబలసంపన్నుడై జరాసంధునిపై బడి మో చేతులతోను, మోకాళ్ళతోను కుమ్మి, ముక్కూనోటా రక్తం కారునట్లుగా కాళ్ళు పట్టుకొని గిరగిర త్రిప్పి నేలపై పడవేసి రెండు భాగములుగా చీల్చినాడు. అలా చీల్చుచుండగా పెడబొబ్బలు పెడుతూ జరాసంధుడు మరణించినాడు.



జరాసంధుని రెండు భాగములుగా చీల్చుచున్న భీముడు

ఆ అఱుపులు విని ప్రజలంతా భయకంపితులైనారు. తరువాత భీమడు జరాసంధుని కళేబరము యొక్క రెండు భాగములనూ తీసుకొని ఒకటి సింహద్వారము వద్దకు రెండో భాగము మరో వైపునకు విసరివైచెను.

కృష్ణార్జునులు వెళ్లి బంధితులై యున్న రాజుల నందరిని చెఱనుండి విముక్తులను చేసినారు. ఎటువంటి యుద్ధమునకు యెవ్వరి చేతిలోనూ చావని జరాసంధుని చంపి నందుకు అందరూ భీముని పొగడుచుండగా, వచ్చిన పని పూర్తయిందని శ్రీకృష్ణుడు వారిద్దరినీ వెంటబెట్టుకొని విజయోత్సాహముతో ఇంద్రప్రవస్థపురం చేరినాడు.

ఆ తరువాత శ్రీకృష్ణుని ఆదేశం ప్రకారము ధర్మరాజు ఆశీర్వాదము పొంది భీమార్జున నకుల సహదేవులు తలొక దిక్కుగా వెళ్ళి రాజుల నందరినీ జయించి అపరిమిత ధన, కనక, వస్తు వాహనములతో దిగ్విజయ యాత్ర ముగించుకొని తిరిగి వచ్చినారు. అపుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో 'ఇక రాజసూయ యాగం ప్రారంభించ'మన్నాడు.

రాజసూయయాగం

యాగం ప్రారంభ మయినది. హస్తినాపురం నుండి కౌరవులతో సహా నానా దేశముల రాజులు నారదాది మహర్షులు వేద శాస్త్రవేత్తలయిన బ్రాహ్మణోత్తములు భీష్మ, ద్రోణ, కృపాచార్యాది ప్రముఖులే గాక - ప్రజలు కూడా తండోపతండములుగా యాగము చూచుటకు వచ్చినారు. యాగము చాలా విజయవంతముగా ముగిసినది. బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలములు నిచ్చి సత్కరించినారు.

అపుడు భీముడు ధర్మరాజుతో 'నాయనా! నీ తమ్ముల దిగ్విజయ యాత్రతో యాగమును చాలా ఘనంగా ముగించినావు. ఇక యిప్పుడు శ్రేష్ఠుడయిన ఒక మహానుభావునకు అర్ఘ్యము కూడ యిమ్ము' అని చెప్పినాడు.

తాతా! అర్ఘ్యము యెవరికివ్వవలెనో, అది పుచ్చుకొనుటకు అర్హులెవరో నీవే నిర్ణయించు నువ్వు చెప్పినవారికే యిస్తాను' అన్నాడు ధర్మరాజు.

"నాయనా! ధర్మరాజా! ప్రత్యేకంగా నిర్ణయించవలసిన దేమున్నది! మీ క్షేమము కోరుచూ సదా మిమ్ము కాపాడేవాడూ, నీలమేఘశ్యాముడూ, దివ్యతేజోమూర్తి సర్వలోకములకూ పూజనీయుడూ, సకల చరాచర ప్రాణకోటికీ వెలుగునిచ్చువాడూ, తరతమ భేదమెరుంగని సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అయిన శ్రీకృష్ణుడు ఈ సభలో

నుండగా ఆ అర్హత వేరొకరికి యెలా ఉంటుంది. కనుక, శ్రీకృష్ణునకే మొదటి అర్ఘ్యాన్ని సమర్పించు" అన్నాడు.

భీష్ముని నిర్ణయమున ఆనందించిన ధర్మరాజు శ్రీకృష్ణుడొక ప్రత్యేక వేదికపై ఆసీనుని గావించి, సభాసదులు జయ ధ్వానములు చేస్తూండగా తమ్ములతో గూడి శ్రీకృష్ణుని పూజించి అర్ఘ్యము సమర్పించినాడు.

శిశుపాలవధ

అది చూచి సహించలేక చేది దేశపు రాజయిన శిశుపాలుడు అసూయతో లేచి ధర్మరాజునూ, భీష్ముని కృష్ణుని నిందించినాడు. ధర్మరాజు అతి శాంతముతో శిశుపాలుని శాంతింప చేయ ప్రయత్నించినాడు.



చక్రాయుధముతో శిశుపాలుని సంహరిస్తున్న శ్రీకృష్ణుడు

కాలం మూడిన వాడికి మంచి తల కెక్కదన్నట్లుగా శిశుపాలుడు, ధర్మరాజు పలుకులను లెక్కచేయక 'ఈ గొల్లవాడు గోవుల మందను కాసుకొనేవాడు. యే విధముగనూ అర్ఘ్యమును పుచ్చుకొనుట కర్హుడు కా'డనీ ఈ సభలో యింతమంది పెద్దలూ, పూజనీయులూ వుండగా ఈ పశువుల కాపరికి అర్ఘ్యమిచ్చి ధర్మరాజు అందరినీ అవమానపరచినాడనీ 'వయస్సులోనా చిన్నవాడు, అర్హతలోనా గురువు కాదు. బ్రాహ్మణోత్తముడయిన పురోహితుడూ కాదు. ఒక యాదవ కుల సంజాతుడయిన వీడు ఏ విధముగా అర్ఘ్యానికి అర్హుడయినా?'డనీ తూలనాడుతూ ఒరనుండి కత్తి తీసెను.

అప్పుడు శ్రీకృష్ణుడు లేచి "శిశుపాలా! నీవు నా మేనత్త కొడుకువని దయ దలచి నీ తల్లికిచ్చిన మాట ప్రకారము ఇంతవరకూ నూరు తప్పులు క్షమించాను. ఇక నిన్ను యెవరూ రక్షించలేరు'' అనగా

శిశుపాలుడు శ్రీకృష్ణుని హేళన జేయుచు 'ఓరీ పశువుల కాపరీ! నీవా నాకు క్షమాభిక్షను ప్రసాదించేది! నీ దయాభిక్ష నా కెందుకురా! నేను క్షత్రియుడను తలుచుకుంటే నిన్ను ఇప్పుడే అంతమొందించగలను. బ్రతుకుమీద ఆశ వుంటే అధిక ప్రేలాపన మాని అర్ఘ్యమునందుకొనుటకు అనర్హుడని ఒప్పుకో. లేదా నా కత్తికి నీ ప్రాణాలు బలి యివ్వక తప్పదు'' అని పలుకగా

శ్రీకృష్ణుడు కోపముతో 'నీ ఆఖరి ఘడియ సమీపించియే పిచ్చి ప్రేలాపన పేలుచున్నావు. ముందుగా నిన్ను రక్షించుకోగలిగితే, తరువాత నా ప్రాణాలు నీ కత్తికి బలియియ్యవచ్చునులే' అంటూ సుదర్శన చక్రాన్ని వదిలాడు. ఆ చక్రం పారిపోవ ప్రయత్నిస్తున్న శిశుపాలుని కంఠమును ఖండించి శ్రీకృష్ణుని చేరినది.

దుర్యోధన పరాభవము

రాజసూయ యాగమునకు విచ్చేసిన బంధుమిత్రులు అందరూ వెళ్ళిపోయారు. ఒక్క దుర్యోధనుడు మాత్రమే కొద్ది రోజులుండి ఆ సభా నిర్మాణపు వింతలు చూసి వెళ్ళదలచి పాండవుల వద్దనే ఉండిపోయాడు.

ఒకనాడు దుర్యోధనుడు ఆ సభా భవనమును పూర్తిగా చూడవలెనను అభిప్రాయముతో భవనములో ప్రవేశించి ఒక్కొక్క భాగమును చూడసాగెను. ఎక్కడ

చూచిన రత్నమాణిక్యములు ధగధగ మెరయుచు వింతకాంతులు వెదజల్లుచుండుటచేత "పాండవులింత వైభవముగా నున్నారా?" యని మనస్సున తలచి, అసూయ శరీరమంతటా ఆవరించుచుండగా మరియొక భాగములోనికి ప్రవేశించెను. అది అంతయు ఇంద్రనీల మణిమయ ప్రదేశమగుటచేత దివ్యకాంతులు విరజిమ్ముచూ నేలపై ప్రతిబింబము కనిపించుచున్నది. అదిచూసి అచట నీరున్నదా యని భ్రమపడి తడిమి జూసి నీరు లేదని నిర్ధారణ చేసుకొని మరింత ముందుకు వెళ్ళెను.

అచట రత్నాలు పొదిగిన చలువరాయితో నిర్మించిన ప్రదేశము కనబడినది. అది రాయియే అనుకొని అలసటచేత కూర్చునే ఉద్దేశ్యముతో అడుగు ముందుకు వేయగా అచట నీరుండుటచేత కాలు నీటిలో పడి నీరు పైకి చిమ్మి బట్టలు తడిసినవి. మేడపై విహరిస్తున్న ద్రౌపది అది చూసి దుర్యోధనుని భంగపాటునకు నవ్వినది. ఆమె నవ్వును విన్న దుర్యోధనుడు అది అవమానముగా భావించి కలత జెందినవాడై వెంటనే హస్తినా పురికి బయలుదేరాడు.

దుర్యోధనాదుల పన్నాగము

హస్తినాపురికి చేరుకున్న దుర్యోధనుడు నిత్యమూ మయసభలో జరిగిన పరాభవమునే తలచుకొనుచు బాధపడసాగెను. దీనికి తోడు పాండవుల ఔన్నత్యము ఆతనిని మరీ పిచ్చివానిగా చేసినది. రాచకార్యములను చూడక, రాత్రి పగలూ పాండవులపై పెరిగిన అసూయతో దహించుకుపోతూ వారిని ఏ విధముగా అవమానించి రాజ్యము నుండి పాఱద్రోలి బికారులను చేయుటయా? యని ఆలోచింపసాగెను. ఇది గమనించిన శకుని దుర్యోధనుని వద్దకు వచ్చి కారణం తెలుసుకొన్నాడు.

'పిచ్చివాడా! ఈ మాత్రం దానికేనా ఇంతగా బాధపడుతున్నావు? పాండవుల సంపదను అపహరించుట చాలా తేలికైన విషయం ధర్మరాజునకు జూదమంటే మహా ప్రీతి కనుక, జూదమాడుటకు రమ్మని పిలిచి కపట జూదమున వారి సంపదను యావత్తు గెల్చుకొని వారిని బికారులను చేయవచ్చు' నన్నాడు దుర్యోదనుడు తండ్రి వద్దకు వెళ్ళి పాండవులను పాచికలాడుటకు పిలిపించునట్లుగా ఒప్పించి వచ్చినాడు.



పాచికలాడుతున్న ధర్మరాజు, శకుని

ధృతరాష్ట్రునకు యిష్టము లేకపోయినా, పుత్రవాత్సల్యముతో పాండవులను పాచికలాడుటకు ఆహ్వానించి తీసుకొని రమ్మని విదురుని ఇంద్రప్రస్థపురానికి పంపినాడు. విదురుని మాటలు విన్న ధర్మరాజు ద్రౌపదితోనూ, తమ్ములతోనూ విదురుని వెంట హస్తినాపురము చేరుకున్నాడు.

మాయా జూదము

పాండవుల పక్షమున ధర్మరాజూ కౌరవుల పక్షమున శకుని - జూదమాడునట్లుగా నిర్ణయమైనది. ఆట ప్రారంభమైనది.

భీష్ముడు - మొదలగు కురువంశ పెద్దలు ఈ ఆటను వినోదముగా భావించి చూస్తున్నారు. శకుని మాయాపాచికల ప్రభావమువలన ధర్మరాజునకు ఏ పందెంలోనూ

విజయం లభించక ప్రతి పెందెమూ ఓడిపోసగినాడు. ఈ విధంగా ధనాగారంలో నున్న డబ్బు, రత్నాభరణములు, మరకత మాణిక్యములు, వస్తువాహనములు, తన రాజ్యము యావత్తు పందెం ఒడ్డి సర్వమూ కోల్పోయినాడు. దానితో రోషం పెరిగి తనను తన తమ్ముళ్లను కూడ పందెము కాచి ఓడిపోయినాడు. ఇక పందెము ఒడ్డుటకు ఏమి లేకపోవుటచేత తల వంచుకొని కూర్చున్న ధర్మరాజును దుర్యోధనాదులు హేళనగా మాటలాడి 'ఇక ద్రౌపది వున్న'దనగా పౌరుషముతో ఆఖరుసారిగా ద్రౌపదిని పందెముగా పెట్టి మరో ఆట వేసి ఓడిపోయినారు. ఈ విధంగా ఆటకు ముగింపు కలిగినది.

పాంచాలీ పరాభవము

ఆటను వినోదముగా భావించి చూసిన పెద్దలందరూ జరిగిన మోసాన్ని గ్రహించి బాధతో తలలు వంచారు, అంతటితో తృప్తిజెందని దుర్యోధనుడు నిండుకొలువులో పాండవులను మరింత అవమానపుపాలు చేయతలంచి, సేవకుని పిలచి ద్రౌపది ఇపుడు మాకు దాసి ఇక్కడ జరిగినది ఆమెకు చెప్పి సభకు తీసుకొనిరమ్ము' యని ఆజ్ఞాపించినాడు.

ఆ సేవకుడు వెళ్ళి ద్రౌపదితో జరిగినది చెప్పి దుర్యోధనుని ఆజ్ఞను వివరించినాడు. అది విని ద్రౌపది 'ధర్మరాజు - ముందు నన్ను పందెంలో ఓడి, తరువాత తానోడెనో! లేక ముందుగా తానోడి తరువాత నన్ను పందెం ఒడ్డెనో తెలుసుకొని రమ్మని పంపెను. సేవకుడు తిరిగివచ్చి ద్రౌపది మాటను దుర్యోధనునకు తెల్పెను. దుర్యోధనుడు కోపముతో "తన సందేహమును సభకు వచ్చి తీర్చుకొను"మని మరల కబురంపెను. అయినా ద్రౌపది రాకపోవుటచేత మరింత కోపోద్రేకముతో, ఆమెను సభా మధ్యమునకు ఈడ్చుకొని రమ్మని దుశ్శాసనుని పంపినాడు. సహజంగానే దుర్మార్గుడయిన దుశ్శాసనుడు అన్నగారి ఆజ్ఞతో మరింత ఆవేశంగా వెళ్ళి ద్రౌపదిని పట్టుకొనబోవగా ద్రౌపది 'అయ్యా నేను ఏకవస్త్రను, నన్ను ముట్టుకొనరాదు' అని గోలపెట్టినది. ఆమె మాటలు చెవికెక్కని దుర్మదాంధుడయిన దుశ్శాసనుడు ఆమె జుట్టు పట్టుకొని నిండు సభలోనికి ఈడ్చుకుని వచ్చెను.

అది చూసి భరించలేని భీముడు మండిపడుతూ 'ఓరీ దుర్మదాంధా! దుశ్శాసనా! ద్రౌపదిని ఈ విధంగా అవమానము పాలుచేసిన నిన్ను ఈ రోజు ఈ కొలువులో



ద్రౌపదిని జుట్టు పట్టుకొని సభకీడ్చుకొని వచ్చుచున్న దుశ్శాసనుడు

న్యాయాన్ని కాపాడలేక అసమర్ధులై మూగవానివలె మాటలు లేక తలలువంచుకొని కూర్చునియున్న ఈ పెద్దలందరూ చూస్తుండగానే మరోరోజు నీ గుండె చీల్చి రక్తం త్రాగి ఆ రక్త హస్తాలతో ద్రౌపది ముడివేస్తాను' అని ప్రతిజ్ఞ చేసాడు. ఆ ప్రతిజ్ఞ విని అందరూ కలత చెందగా అదేమీ చెవి కెక్కని దుర్యోధనుడు 'ద్రౌపదీ! నీ భర్తలూ, నీవుకూడా మాకు దాసులు. మేము చెప్పినట్లుగా మీరు వినక తప్పదు. రా నా తొడపై కూర్చో' అనుచు తొడను చూపించినాడు.


ఈ మాటలతో భీముడు మరింత మండిపడుతూ లేచి నిలబడి గద తీయబోగా అర్జునుడు అడ్డుపడి, 'అన్నా! భీమసేనా! కోపానికి సమయం కాదు. ధర్మపరుడయిన ధర్మరాజు మన పరాక్రమాన్ని పందెంగా ఒడ్డి ఓడిపోయినాడు' అని చెప్పి ఆపాడు. చేతులను నిరోధించినా, కోపము నాపుకోలేకపోయిన భీముడు భీకరకంఠుడై దుర్యోధనా!

రాజ్య మదాంధుడవై ద్రౌపదికి యే తొడనైతే చూపించి కూర్చోమన్నావో ఆ తొడను నుగ్గునుగ్గు చేసెదను' అని ప్రతిజ్ఞ చేశాడు.

శ్రీకృష్ణుని అనుగ్రహము

ఇంత జరిగినా బుద్ధిరాని దుర్యోధనుడు భీముని మాటలకు మరింత రెచ్చిపోయి ద్రౌపదిని మరింత అవమానంపాలు చేయనెంచి ఆమె చీరను తీసివేయుమని దుశ్శాసననికి సైగ చేసినాడు.

నిలువెల్లా రాక్షసత్వమే కల దుశ్శాసనుడు ద్రౌపది చీరను పట్టి లాగబోవగా ఆమె దూరంగా జరిగినది. ఆ సభలో గల పాండవులు, భీష్మ ద్రోణ, కృపాచార్యాది పెద్దలందరూ ఆ చర్యను చూసి తలలు వంచుకొని బాధపడుతున్నారే కాని, ఏ ఒక్కరూ ఆమెకు సహాయము చేయలేకపోయారు.



ద్రౌపది వస్త్రాపహరణము - శ్రీకృష్ణుని అనుగ్రహము

ద్రౌపది తన పరిస్థితికి కలతజెంది రోదిస్తూ 'సభలో ఇంతమంది పెద్దలుండి యీ ఆడపడుచుకు జరుగుచున్న అన్యాయాన్ని ఆపలేరా? ఇంత పెద్ద సభలో స్త్రీకి జరిగే అన్యాయాన్ని అందరూ ముక్త కంఠముతో ఆమోదించి రాక్షసత్వానికి బానిసలయి పోయారా? అన్యాయాన్ని ప్రోత్సహించే రాజు ఒక రాజా! రాజ్యమొక రాజ్యమా అందరకూ పూజనీయుడయిన భీష్మాచార్యుడు కూడా ఈ అన్యాయాన్ని ఆమోదిస్తు న్నాడా?' అని సభ నుద్దేశించి అడుగగా, భీష్మునితో సహా యే ఒక్కడూ జవాబు నివ్వలేనివారై వంచిన తలలు యెత్తలేదు.

అక్కడ పరిస్థితినీ, భర్తల అసహాయ స్థితిని గ్రహించిన ద్రౌపది 'హే కృష్ణా ఆపద్బాంధవా! అనాథ రక్షకా! దీనబాంధవా! ద్వారకావాసా! శ్రీకృష్ణా! నిండు సభలో మానభంగం కానున్న నీ చెల్లికి నీవే దిక్కు' అని దీనంగా ప్రార్థిస్తూ అసహాయురాలై నిలచింది.

దుశ్శాసనుడు హేళన చేయుచు ద్రౌపది చీరపట్టి లాగుచున్నాడు. కాని శ్రీకృష్ణుని దయాకటాక్ష వీక్షణములలో నున్న ద్రౌపదిని అవమానపరచలేకపోయాడు. లాగిన కొలదీ చీరలు గుట్టలు పడుతున్నవేకాని తరుగుటలేదు. చీరలు లాగిలాగి దుశ్శాసనుని చేతులు నొప్పి పెట్టి సొమ్మసిల్లే పడిపోయినాడు. ఈ విచిత్ర పరిణామానికి దుర్యోధనుడు ఖిన్నుడై చూడసాగెను. తలలు వంచిన పెద్దలు, పాండవులు, ఆ సంఘటనకు విస్మయం జెంది ద్రౌపది పాతివ్రత్యాన్ని కొనియాడసాగారు. అది విన్న ధృతరాష్ట్రునకు అప్పటికి వివేకం కలిగి, కుమారుల దుర్మార్గానికి చింతించి, ద్రౌపదిని చేరబిలిచి 'అమ్మా! నీకు జరిగిన అన్యాయానికి బాధగానున్నది. కాని, నీ పాతివ్రత్య మహిమకు మాత్రము ఆనందము కలుగుచున్నది. అందుచేత నీకు రెండు వరాలు యిస్తున్నాను. ఏమి కావలయునో కోరుకో అన్నాడు.

అంత ద్రౌపది 'తన భర్తలను దాస్యమునుండి విడిపించుచున్నది. ధృతరాష్ట్రుడు దాస్యము సరే' అన్నాడు. ధర్మరాజు ధృతరాష్ట్రుని ఔన్నత్యమును కొనియాడుచు ద్రౌపదితోను, తమ్ములతోను ఇంద్రప్రస్థానికి వెళ్ళిపోయాడు.

అయితే తన తండ్రి యిచ్చిన వరము వలన తన ప్రయత్నము ఫలించక పోవుటచేత దుర్యోధనుడు చింతించినాడు. పాండవులతో యుద్ధము చేయుట. విజయం పొందుట తనకు అసాధ్యమగుటచే మరల ధృతరాష్ట్రుని అనుమతి తీసుకొని ఈసారి పందెంగా ఏ విధమైన వస్తువాహనాలూ ఒడ్డనవసరము లేదనీ, వినోదముగా మరల పాచికలాడుటకు రమ్మని - ధృతరాష్ట్రుని ఆజ్ఞగా కబురంపి పాండవులను పిలిపించినాడు. ఇంతజరిగినా బుద్ధిరాని ధర్మరాజు వెంటనే వచ్చినాడు. ఆట దగ్గర కూర్చున్న తరువాత దుర్యోధనుడు పందెంగా యేమీ లేకపోతే ఆట బాగుండదనీ "ఓడిపోయినవారు పన్నెండు సంవత్సరములు అరణ్యావాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చేయునట్లుగా నిర్ణయించుకొంటే బాగుంటుం"దనీ అన్నాడు. ధర్మరాజు, తమ్ములు వద్దనుచున్నా వినకుండా దుర్యోధనుడు చెప్పినదానికి 'సరే'నని ఆట ప్రారంభించాడు. శకుని మోస ఫలితంగా ధర్మరాజు ఓడిపోయాడు. అనుకున్న ప్రకారము పాండవులు ద్రౌపదితో అడవికి బయలుదేరినారు. అడవులలో కష్టాలు పడలేదని భావించి కుంతిని మాత్రం విదురుని యింటనే వుంచినారు.

★★★

అరణ్య పర్వము

పాండవులు అరణ్యమునకు వెడలుట

పాండవులు ద్రౌపదితో సహా అరణ్యావాసమునకు వెళ్ళుచున్నారని తెలిసిన ప్రజలు దుఃఖిస్తూ వారి వెంట బయలుదేరినారు.

మరి కొంతమంది బారులుతీరి నిలబడి దుఃఖించుచుండగా ధర్మరాజు వారినందరినీ ఓదార్చి యెన్నో శాంతి వాక్యములు చెప్పి వెనుకకు పంపినాడు. పాండవులను విడిచి వుండలేమనుచున్న కొంతమంది మాత్రం ధర్మరాజు వారించినా వినకుండా వెంట బయలుదేరినారు. ఈ విధముగా బయలుదేరిన పాండవులు గంగానదిని దాటి అరణ్యమునకు ప్రవేశించి సూర్యుని ప్రార్థించి అక్షయ పాత్రను పొందినారు. ఆ పాత్ర అనుగ్రహముతో ద్రౌపది తమ వెంట వచ్చినవారికి యే విధమైన యిబ్బంది కలుగకుండా



అరణ్యవాసమునకు వెళుతూ వున్న పాండవులు - ద్రౌపది

పంచ భక్ష్య పరమాన్నములు పెట్టుచుండెను. ఈ విధముగా అక్షయపాత్ర సహాయముతో సుఖంగా కాలక్షేపము చేయు అచట నుండి కామ్యక వనం చేరి నివాసము యేర్పరచు కున్నారు.

పాండవులు అరణ్యమునకు వెళ్ళినారని తెలిసిన కృష్ణుడు కామ్యక వనమునకు వచ్చి పాండవులను చూసి, ద్రౌపదికి ధైర్యము చెప్పి, రాగల శుభములను వివరించి వెళ్ళినాడు. శ్రీకృష్ణుని సలహాతో పాండవులు ద్వైత వనమునకు నివాసము మార్చుకొని కాలం గడపసాగిరి. ఒకనాడు వ్యాసుడు వచ్చి వారిని ఆశీర్వదించి, వారు చేసిన అతిధి సత్కారములకు ఆనందించి ధర్మరాజును చేరబిలిచి 'నాయనా! ధర్మరాజా! ఈ కష్టాలు కలకాలం వుండవు. కౌరవ పాండవ యుద్ధము తప్పదు. వారి ప్రక్కన మహాయోధులైన వీరులున్నారు. వారిని జయించాలంటే మీకు పాశుపతాస్త్రము సంపాదించాలి. అందుచేత

అర్జునుడిని శివుని గురించి తపస్సు చేయుటకు పంపుము' అని చెప్పి అర్జునునికి తపో విధానమును తెల్పి వెళ్ళిపోయెను.

శివుని పరీక్ష

వ్యాసమహర్షి ఉపదేశమును పొందిన అర్జునుడు! ధర్మరాజు కోరిక ప్రకారము శివుని గురించి తపస్సు చేయ తలచుకొని ఇంద్రకీల పర్వతమునకు వెళ్ళి తపోదీక్ష నవలంబించి కఠిన నియమముల ననుసరించి ఘోర తపస్సు చేసినాడు.

శివుడు అర్జునుని తపోదీక్షకు మెచ్చి, పరీక్షింప తలచి వేటగాని వేషము ధరించి అర్జునుని సమీపమునకు వచ్చినాడు. ఒక అడవి పందిని సృష్టించి అర్జునుని పైకి పంపినాడు. ఆ పంది రాక వలన అర్జునునికి తపోభంగమై దానిపై బాణము వేసినాడు



పశుపతి నుండి పాశుపతాస్త్రమును పొందుచున్న పార్థుడు

అదే సమయమున మరోవైపు నుండి శివునిబాణము వచ్చి ఆ పందికి తగిలినది. రెండు బాణములు ఒకేసారి తగిలి పంది చచ్చిపోయినది. అది చూసి బోయవాడు "నేను కొట్టిన పందిని నీ వెందులకు కొట్టితి"వని అర్జునునితో వాగ్వివాదము పెట్టుకున్నాడు. ఆ వాదన చిలికి చిలికి గాలివానయై చివరకు శివార్జునుల మధ్య యుద్ధమువరకు వచ్చినది.


అర్జునుని యుద్ధ నైపుణ్యమునకు, న్యాయనిరతికి, తపోదీక్షకు సంతసించిన శివుడు నిజరూపముతో సాక్షాత్కరించి, అర్జునునికి పాశుపతాస్త్రము నిచ్చి దాన్ని ఉపయోగించ వలసిన విధానమును తెల్పినాడు. అపుడు ఇంద్రుడు శివుని అనుగ్రహపాత్రుడైన అర్జునుని వద్దకు వచ్చి పుత్రవాత్సల్యముతో కౌగిలించుకొని మరికొన్ని దివ్యాస్త్రములను ప్రసాదించి తనలో ఇంద్రలోకమునకు తీసుకొనిపోయి సత్కరించెను. ఇంద్రుని కోరికపై అర్జునుడు కొద్ది రోజులు అక్కడ గడిపి, తరువాత అన్నదమ్ముల యొద్దకు బయలుదేరినాడు.

భీముని గర్వభంగము

అర్జునుడు తిరిగి వచ్చులోగా ధర్మరాజు తీర్థయాత్రలు చేయదలచి ద్రౌపదిని తమ్ములను వెంటబెట్టుకొని బయలుదేరి హిమాచలము చేరి నారాయణాశ్రమమున విడిది చేసినాడు. ఆ ప్రాంత మంతయు విపరీతమైన గాలి వీచినది. ఆ గాలికి పరిమళము గల ఒక పుష్పము యెగిరి వచ్చి ద్రౌపది ముంగిట పడినది. ద్రౌపది ఆ పుష్పమును భీమునికి చూపించి అటువంటి పువ్వులు కావలెనని తన కోరికగా తెల్పగా భీముడు బయలుదేరినాడు.

కొంతదూర మేగిన పిదప దారికడ్డముగా, తోకను జాపి పడుకొనియున్న ఒక కోతిని జూచి భీముడు సింహనాదము చేసి, 'దారి'ని యిమ్మని అడిగినాడు. అందుకా కోతి 'నాయనా! నేను లేవలేని ముసలికోతిని నీవా అతి పరాక్రమ సంపన్నుడవు కనుక, నీవే నా తోకను ప్రక్కకు జరిపి దారి చేసుకొని వెళ్ళు'యని చెప్పినది.

ఆ మాటలు విన్న భీముడు 'ఏమిరా దారి యిమ్మని అడిగితే, దారి చేసుకొని పొమ్మంటావా? కోతికింత పొగరా?' యనుచు దాని తోకను తన యెడమ చేతితో ఎత్తబోయినాడు. కానీ తోక కదలలేదు. ఇక లాభం లేదనుకొని రెండు చేతులతో ఎత్తుటకు ప్రయత్నించి కొంచెం పైకెత్తి తోకతో సహా క్రిందపడినాడు. దానితో భీముని గర్వము తగ్గి,



దారికడ్డముగా నున్న హనుమంతుని తోకను ఎత్తలేకపోవుచున్న భీముడు

కోతిరూపమున యెవరో మహాత్ముడు తనను పరీక్షింప నెంచి దారికడ్డముగా నున్నారని భావించి చేతులెత్తి నమస్కరించుచు "మహాత్మా! నీ వెవరవో గాని, నీ మహిమ నెరుంగక తూలనాడినాను. నన్ను క్షమించి దారిని యిప్పించుము. అని ప్రార్థించగా అపుడు హనుమంతుడు నిజరూపమును దాల్చి తానెవరో చెప్పి భీముని కౌగిలించుకొని సౌగంధిక పుష్పములున్న కొలనుకు దారి జూపి, జయము కలుగునని దీవించి పంపెను. భీముడు అచటనుండి బయలుదేరి సౌగంధిక పుష్పములున్న సరోవరము వద్దకు చేరి సరోవరమునకు కావలియున్న వారిని యెదుర్కొని విజయుడై పుష్పములను తెచ్చి ద్రౌపదికిచ్చెను. ఇంతలో తపస్సుకు వెళ్ళిన అర్జునుడు కూడా వచ్చి అన్నదమ్ములను కలుసుకున్నాడు. పాండవులు యింకొన్ని రోజులు అక్కడే గడిపి మరికొన్ని ప్రదేశములు చూసి మరల ద్వైత వనమును జేరినారు.

దుర్యోధనుని భంగపాటు

రాజ్యము కోల్పోయి అడవుల పాలయిన పాండవులకు తన వైభవమును చూపదలచి, తమ ఆవుల మందను పీడించుచున్న క్రూరమృగములను వేటాడి వచ్చెనని తండ్రితో చెప్పి, దుర్యోధనుడు భార్యామిత్రులనూ సైన్యమునూ వెంటబెట్టుకుని ద్వైత వనమును చేరి పాండవుల నివాసమునకు సమీపమందు గల సరోవర ప్రాంతమున విడిది చేసినాడు. అది చూచి సరోవర రక్షకులు దుర్యోధనునితో 'రాజా! ఈ సరోవరం చిత్రసేనుడను గంధర్వరాజుది. ఇక్కడ యెవరూ విడిది చేయరా'దని తెల్పగా దుర్యోధనుడు గర్వాంధుడై ఆ మాటలను లెక్క చేయక ఆక్షేపించినాడు.

అది తెలిసిన చిత్రసేనుడు దుర్యోధనునికిపైకి గంధర్వులను పంపినాడు. కౌరవులకు గంధర్వులకు యుద్ధము జరిగినది. అందు ఓడిపోయిన దుర్యోధనుని గంధర్వులు



దుర్యోధనుని బంధించి తోలుకుపోవుచున్న గంధర్వులు

బంధించి తీసుకొని పోవుచుండగా సేవకులు పరుగు పరుగున ధర్మరాజు వద్దకు పోయి జరిగినది చెప్పినారు. వెంటనే ధర్మరాజు ఆజ్ఞతో భీమార్జునులు వెళ్ళి గంధర్వులనుండి దుర్యోధనుని బంధవిముక్తుని గావించి తీసుకొని వచ్చినారు. ధర్మరాజు దుర్యోధనునికి అన్ని వేళలా మూర్ఖత్వము వుండుట మంచిది కాదని సమయా సమయములు ఆలోచింపవలె'నని బుద్ధి చెప్పి పంపినాడు. దుర్యోధనుడు బాధపడుచు 'తానొకటి తలిస్తే మరొకటి జరిగినదే' అనుకొని జరిగిన భంగపాటును నెమరువేసుకొనుచు హస్తినాపురికి తిరుగు ప్రయాణం కట్టాడు.

సైంధవ పరాభవము

ఒకనాడు పాండవులంతా వేటకు వెళ్ళగా ఆశ్రమంలో వున్న ద్రౌపది పూల మొక్కలకు నీరు పోయుచుండెను. ఆ సమయమున అదే మార్గమున పోవుచున్న సైంధవుడు ద్రౌపది రూపురేఖా లావణ్యములను చూసి మోహపరవశుడై రథం దిగి వచ్చి ఆమె ఒంటరిగా నున్నదని గ్రహించి తన కోరి తెల్పినాడు.

అంత ద్రౌపది 'అన్నా! నీకిదేమి బుద్ధి? నేను పాండవుల పత్నిని. నీ కోరిక నా భర్తలకు తెలిసినచో శిక్షింపక మానరు. వారు వచ్చువేళ అయినది ఇక వెళ్ళుము అనగా-

"పాంచాలీ ఆ దిక్కుమాలిన పాండవులతో యీ అరణ్యావాసము నీకెందులకు? అన్నీ పోగొట్టుకుని దరిద్రులై యున్నారు. నిన్ను ఏమి సుఖపెట్టగలరు నీ అందమంతా అడవి గాచిన వెన్నెల చేయక, నాతో వచ్చి అంతఃపురములో అందరిచేత సేవలు పొందుచూ స్వర్గసౌకర్యాలు అనుభవించు" అనినాడు సైంధవుడు.

"దుర్మార్గుడా! కామాంధుడవైన నీకు మంచి మాటలు తల కెక్కవు. చెల్లెలిని మోహించి దరికి వచ్చిన నిన్ను యేమి చేసినా పాపము లేదు. నా భర్తలు వస్తే నీ అంతం చూస్తారు. కామాంధుడవై పరాభవాన్ని కావాలని కోరి తెచ్చుకోకు. మర్యాదగా వెళ్ళు' అని ద్రౌపది చెప్పుచున్నను వినక, అతి కాముకుడైన ఆ సైంధవుడు ద్రౌపదిని బలవంతముగా రథంపై నెక్కించుకొని పారిపోసాగెను.

వేట నుండి తిరిగి వస్తున్న పాండవులకు ద్రౌపది ఆర్తనాదం వినిపించినది. ద్రౌపది కేదో ఆపద వాటిల్లినదని భావించి భీముడు పరుగు పరుగున వచ్చి ద్రౌపదిని తీసికొని



ద్రౌపదిని రథముపై తీసుకొని పోవుచున్న సైంధవుడు


పారిపోవుచున్న సైంధవుని జూచి, కోపముతో సైంధవుని యెదుర్కొని రథముపై నుండి క్రిందకు లాగి తలగొరిగి, తీసుకొనివచ్చి ధర్మరాజునకు అప్పగించెను.

ధర్మరాజు సైంధవునకు మంచిమాటలు చెప్పి, నీతిగా బ్రదుకుమని ఆదేశించి పంపివేసెను. సైంధవుడు తనకు జరిగిన పరాభవమునకు చింతిస్తూ రాజ్యమునకు తిరిగి వెళ్ళలేక అరణ్యములోనే శివుని గురించి తపస్సు చేయసాగెను.

శివుడు సైంధవుని తపస్సుకు మెచ్చి యేమి కావలెనో కోరుకోమన్నాడు. సైంధవుడు "స్వామీ! పాండవులను జయించగల శక్తిని ప్రసాదించు అంతకు మించి నాకు ఏ కోరికా లేదు' అన్నాడు. సైంధవుని కోరిక విన్న యీశ్వరుడు "అర్జునుడు లేని సమయములో తక్కిన నలుగురు పాండవులనూ ఒక్కరోజు మాత్రం జయించగలవు' అని చెప్పినాడు.

కర్ణుని దాతృత్వము

పాండవుల అరణ్యావాసము పూర్తి అగుటయు మరికొద్ది కాలమే ఉండుటవలన అజ్ఞాతవాసం అనంతరము కౌరవ పాండవ యుద్ధము తప్పదని భావించిన యింద్రుడు అర్జునుని క్షేమం గురించి ఆలోచించినాడు. కర్ణుడు సూర్యుని వలన పుట్టినవాడగుటచేత కవచకుండలములు అతని శరీరమున ఉన్నంతవరకు అతనికి చావు లేకుండా సూర్యుడు వరం ప్రసాదించినాడు. యుద్ధమందు కృష్ణార్జునుల పోరు తప్పదు. కనుక కర్ణుడు అర్జునుని చేతిలో చావాలంటే కవచకుండలములు కర్ణుని వద్ద లేకుండా చేయాలని ఆలోచించి, దేవేంద్రుడు బ్రాహ్మణ వేషమును కర్ణుని వద్దకు వచ్చినాడు. కర్ణుడా మాయా బ్రాహ్మణుని గౌరవించి "బ్రాహ్మణోత్తమా! ఏమి కోరి నా వద్దకు వచ్చినారో సెలవీయ వలసిందనగా ఆ బ్రాహ్మణుడు నీ కవచకుండలాలు నాకివ్వ గలిగితే సంతోషిస్తానయ్యా' అన్నాడు. కర్ణుడు వెంటనే తన కవచకుండలములను ఆ బ్రాహ్మణునకు యిచ్చి వేసినాడు.



బ్రాహ్మణునకు కవచకుండలములు నిస్తున్న కర్ణుడు

ఇంద్రుడు కర్ణుని దాతృత్వమునకు పరవశుడై తన నిజరూపమును చూపి కర్ణా నీ ఔదార్యము నన్ను ముగ్ధుణ్ణి చేసినది. నీకు శక్తిబాణం యిస్తున్నాను. తీసుకో ఈ బాణం యెంతటి పరాక్రమవంతునైనా వధిస్తుంది' అని వెళ్ళిపోయాడు.

పాండుపుత్రుల నిర్లక్ష్యం

అడవిలో పాండవు లొకరోజున వేటాడి వేటాడి అడవిలో ఒక చెట్టుక్రింద కూర్చున్నారు. ధర్మరాజుకు దాహం వేసి, సహదేవునితో 'తమ్ముడూదీని దగ్గరలో ఏమైనా జలమున్నదేమో చూసి తీసుకురా' అని చెప్పినాడు. సహదేవుడు చెట్టుపైకెక్కి పరిసరము లను చూడగా ఆ సమీపముననే ఒక సరోవర మున్నదని గ్రహించి చెట్టు దిగి నీరు తెచ్చుటకై వెళ్ళి కొలనులో దిగబోవుచుండగా ' ఈ కొలను నాది నా ప్రశ్నలకు సమాధానము చెప్పి నీరు తీసుకొని వెళ్లు అనే మాటలు వినిపించగా చుట్టూ చూసినాడు. కాని యెవ్వరూ కనిపించక పోవుటచేత సమాధానం యేమీ యివ్వకనే కొలనులో దిగబోయి, అచటనే స్పృహతప్పి నేలమీద పడిపోయాడు. నకులుడు అర్జునుడు భీముడూ - నీటికైవచ్చి యక్షుని మాటలను వినక కొలనులో దిగి పడిపోయారు. ధర్మరాజు తన తమ్ములను వెదకుచు వచ్చి తమ్ములను జూచి బాధపడి "విచిత్రముగా నున్నదే" అనుకొనుచు దాహం తీర్చుకొనుటకుకొలనులో దిగబోయెను.

యక్షప్రశ్నలు

అంతట యక్షుడు కనిపించి 'ధర్మరాజా! నా ప్రశ్నలకు సమాధానం యివ్వకుండా నిర్లక్ష్యముతో జలమును ముట్టినచో నీ తమ్ములకు పట్టినగతే నీకూ పడుతుంది అన్నాడు. అంతట ధర్మరాజు 'మహాత్మా! ఆ ప్రశ్నలు యేమిటో తెలుపు నాకు సాధ్యమైన వయితే తప్పక ప్రత్యుత్తరమిచ్చెద'నని చెప్పినాడు.

యక్షుడు : ధర్మములలో ఏది గొప్పది?
ధర్మరాజు : అహింస
యక్షుడు : ధనవంతులలో గొప్పవారెవరు?
ధర్మరాజు : లోభాన్ని జయించగలిగినవాడు

యక్షుడు : గాలికన్నా వేగమయినదేమిటి?
ధర్మరాజు : మనస్సు
యక్షుడు : అన్నిటికన్నా సంతోషాన్నిచ్చేదేమిటి?
ధర్మరాజు : ఇతరులకు సలహాలివ్వటం
యక్షుడు : సర్వదుఃఖములకు కారణం ఏమిటి?
ధర్మరాజు : కోరిక
యక్షుడు : కీర్తికి, స్వర్గానికీ, సుఖానికీ ఏది నెలవు?
ధర్మరాజు : దానం, సత్యం, శీలం
యక్షుడు : భూమికన్నా ఘనమైనదేమిటి?
ధర్మరాజు : బిడ్డల బరువు బాధ్యతలను భరించే తల్లి



యక్షుని ప్రశ్నలకు సమాధాన మిస్తున్న ధర్మరాజు

ఇదేవిధముగా యక్షుడు వేసిన అనేక ప్రశ్నలకు కూడా ధర్మరాజు సరి అయిన సమాధానములు ఇచ్చినందుకు యక్షుడి తృప్తిపడి 'ధర్మరాజా నీ నుండి సక్రమమైన సమాధానములు వచ్చినవి కుక, నీ తమ్ములలో ఒకరిని మాత్రము బ్రతికించనలను, వారిలో యెవరిని బ్రతికించమంటావో చెప్పు' అన్నాడు.

ధర్మరాజు వెంటనే "నా తమ్ముడు నకులుని బ్రతికించు" అన్నాడు.

"అదేమిటి ధర్మరాజా! ధనుర్ధారీ, గొప్ప పరాక్రమశాలీ, మీకు అన్ని విధములా రక్షణ కలిగించగలిగిన పార్థునీ - గొప్ప బలశాలి అయిన భీమునీ వదలి అల్పుడయిన నకులుని కోరుకుంటున్నావెందుకు?" అని అడిగాడు యక్షుడు ఆశ్చర్యముగా.

యక్షరాజా? నా తమ్ముడే నాకు రక్షకాదు. ధర్మమే మానవునకు రక్ష. నా తండ్రి పాండురాజునకు యిద్దరు భార్యలు. వారిలో పెద్దదైన కుంతి కుమారుడను నేను బ్రతికే వున్నాను. మరి రెండవ ఆమె అయిన మాద్రి పెద్దకుమారుడు కూడా జీవించి వుండటం న్యాయము కదా! అందుచేత మాద్రి పెద్ద కుమారుడయిన నకులుణ్ణే బ్రతికించు" అని ధర్మరాజు చెప్పెను.

"ధర్మరాజా! నీ నిష్పక్షపాతబుద్ధికి చాలా ఆనందిస్తున్నాను. నీ తమ్ములందరూ బ్రతుకుతారు" అని చెప్పి యక్షుని రూపమున వచ్చిన యమధర్మరాజు తన నిజరూపముతో ధర్మరాజువద్దకు వచ్చి "నాయనా! ధర్మరాజా! మీ అజ్ఞాతవాస కాలము మీమీ తపశ్శక్తుల వలనను మీకు లోగడ లభించిన శాపాలవలనను - యెవరూ గుర్తుపట్ట కుండా పూర్తిచేయగలరు" అని ధైర్యము చెప్పి ఆశీర్వదించి వెళ్ళిపోయెను. వెంటనే నలుగురు తమ్ములూ నిద్రనుండి మేలుకొన్నట్లుగా లేచి నిలబడిరి.

ఈ విధముగా అనేక కష్టాల నెదుర్కొంటూ అన్నిటా విజయము సాధిస్తూ మరికొంద్ది రోజులు ఆ ప్రాంతాలనే గడిపి తమ నిర్ణయము ప్రకారము పండ్రెండు సంవత్సరములు అరణ్యావాసము పూర్తి చేసినారు పాండవులు.

★★★

విరాటపర్వము

పాండవులు విరాటుని కొలువులో చేరుట

పాండవులు తమ అజ్ఞాతవాసం పూర్తిచేయుటకు మత్స్యదేశమే అనువయిన ప్రదేశమని భావించి, వేషాలను మార్చుకుని తమ ఆయుధములను ఆ ప్రాంతముననే వున్న ఒక జమ్మిచెట్టుపై భద్రపరచి, మత్స్యదేశం చేరి ఒక్కొక్కరుగా విరాటరాజువద్దకు వెళ్ళినారు.

"మహారాజా! యింతకాలము మేము పాండవులతో కాలము గడిపి వారి సేవలోనే యింతవారమయినాము. కాని కొలది దినముల క్రితమే పాండవులు 'మేమే యీ అడవులలో యెన్నో కష్టాలకు గురి అవుతున్నాము. మాతో మీరు కూడ యెందుకు బాధలు పడతారు? ధర్మశీలుడూ, పూజనీయుడూ అయిన విరాటరాజును ఆశ్రయించి మీకు తగిన ఉద్యోగాలు పొంది కాలక్షేపముచేయం"డని చెప్పినారు. వారి మాటలమీదనే మీ ఆశ్రయము కోరి వచ్చాము అనుగ్రహించి మాకు పనులనిచ్చి మీ ఆశ్రయములో వుండే అవకాశము కలుగజేయండి" అని అడిగినాడు.

విరాటుడు పాండవుల పేరు విని, వారి కెదురైన కష్టాలకు బాధపడి, ధర్మరాజును చూసి "మీరందరూ పాండవుల వద్ద యేమి చేసేవారు? మీ పేర్లు యేమిటి? అని అడిగినాడు.

'నా పేరు కంకుభట్టు, నేను ధర్మరాజునకు సలహాదారుగానుండి తీరిక వేళల్లో పాచికలాడి సంతోషపెట్టేవాడిని' అని చెప్పాడు ధర్మరాజు.

తరువాత భీముడు 'నా పేరు వలలుడు, నేను కమ్మని వంటకాలు తయారు చేసేవాడి'నన్నాడు. దేవలోకములో లభించిన శాపము వలన బృహన్నలగా మారిన అర్జునుడు "నాపేరు బృహన్నల, నేను సంగీతమూ, నాట్యమూ చేయగల'నన్నాడు నకులుడు తాను గుర్రముల రక్షణ చూసేవాడిననీ తన పేరు దామగ్రంధి యని తెల్పెను. సహదేవుడు తనపేరు తంత్రీపాలుడనీ, గోరక్షకుడననీ చెప్పెను.

వారి వివరములు తెలుసుకొనిన విరాటుడు పాండవులవద్ద వున్నవారు కనుక సమర్థులే యని భావించి ధర్మరాజును తనవద్దనే వుంచి, "ధర్మరాజు వద్ద యే విధముగా

గడిపేవాడివో యిక్కడకూడా అలాగే గడప"మన్నాడు. భీముని వంటవాని గాను బృహన్నల (అర్జునుడు)ని అంతఃపుర స్త్రీలకు నాట్యము నేర్పుటకును, నకుల సహదేవులను గుర్రములను గోవులను చూచుటకు నియమించినాడు తరువాత వచ్చిన ద్రౌపదిని తన భార్య సుధేష్ణ వద్దకు పంపినాడు.

సుధేష్ణ ద్రౌపదిని "నీవు పాండవులవద్ద యేమి చేసేదానివి? పాంచాలి నిన్ను ఏమని పిలిచేది? అని అడిగింది. ఈ విధముగా ద్రౌపది సుధేష్ణ ఆదరణను, పాండుపుత్రులు విరాటుని అభిమానమును పొంది యెవరి పనులు వారు అతి జాగ్రత్తగా నిర్వహించుకొనుచు గుట్టుగా కాలక్షేపము చేయుచు యేమరుపాటుగానైనా తమ ఉనికి బయటపడకుండా పదకొండు మాసములు పూర్తిచేసినారు.

కీచకుని వధ

ఒకనాడు కీచకుడు తన సోదరి సుధేష్ణను చూడదలచి అంతఃపురమునకు వచ్చినాడు. పరమ దుర్మార్గుడూ, అతి బలవంతుడూ అయిన కీచకుడు సుధేష్ణ అంతఃపురములో సైరంధ్రిని జూచి పరవశుడై' ఆమె యెవరు? అని అడిగినాడు.

'ఆమె ద్రౌపది పరిచారిక, ధర్మాత్ములయిన పాండవులు అడవులపాలగుట చేత, ద్రౌపది ఆజ్ఞతో నావద్దకు వచ్చినది. చాలా మంచిది. పొరపాటుగా కూడ పరపురుషుల కంట పడకుండా తనను తాను కాపాడుకుంటుంది. నీవు యిక్కడ వున్నావని తెలియదు, తెలిస్తే ఈ వైపు వచ్చేది కాదు'. అని చెబుతుంది సుధేష్ట తమ్మునితో.

కాని కాముకుడయిన కీచకుడు "అవన్నీ మనకెందుకు గాని, ఆమె నాకు కావాలక్కా! ఎలాగైనా నచ్చచెప్పి ఈ రాత్రికి నా వద్దకు పంపు" అన్నాడు.

తమ్ముని కోరిక విని సుధేష్ణ కలత జెంది "తమ్ముడూ! నీ కోరికను నీలోనే యిముడ్చుకో. ఆమె సామాన్యరాలు కాదు. ఆమెకు అయిదుగురు భర్తలట. పైగా వారు గంధర్వులట, ఆమె భర్తలు ఆమె ఎక్కడున్నా సదా రక్షిస్తుంటారు. ఆమె గొప్ప శీలవతి. అందుచేత నీ కోరికను చంపుకో, లేదా నీ కోరికే నీకు వినాశనాన్ని గలుగజేయవచ్చును. గంధర్వులు యేమైనా చేయగల సమర్థులు. నామాట విని ఆమె మీద కలిగిన వ్యామోహాన్ని తగ్గించుకో" అని చెప్పగా.

కామాంధుడయిన కీచకునికి అక్క చెప్పేమాటలు చెవికెక్కలేదు. "అక్కా! ఎప్పుడో గంధర్వులవలన నాకు వినాశనము తప్పదంటున్నావు గాని ముందుగా నీ వినాశనమూ సర్వనాశనమూ కాకుండా నీ రాజ్యాన్ని దక్కించుకో. నీవు నీ భర్తతో సుఖముగా రాజ భోగాలు అనుభవించాలన్నా, నీ రాజ్యాన్ని సర్వనాశనము కాకుండా కాపాడుకోవాలన్నా, నీ దాసిని నావద్దకు పంపక తప్పదు, తరువాత నీ యిష్టము" అని హెచ్చరించాడు.

సింహబలుడుగా ఖ్యాతి కెక్కిన కీచకుని బెదరింపు సుధేష్ణలో భయమును రేకెత్తించి నది "సరే ఆమెను ఏదో వంకన నీ వద్దకు పంపుతాను, నీవే నీ యభిప్రాయమును తెల్పుకో" అని చెప్పి కీచకుని పంపివేసినది.

తరువాత ద్రౌపదిని పిలిచి "సైరంధ్రీ! ఈ పానీయ కలశాన్ని తీసుకొనిపోయి నా తమ్ముని మందిరములో పెట్టిరా" అని చెప్పినది.

ఇష్టము లేకపోయినా దాసీగా ఆమె చెప్పినది చేయక తప్పదు కదా! అని పానీయ పాత్రను తీసుకొని కీచకుని మందిరమునకు వెళ్ళినది ద్రౌపది. ఆమె అక్కడ భయపడు నట్లుగానే జరిగింది.

కీచకుడు ద్రౌపది దారికడ్డు నిలచి 'సైరంధ్రీ! ఈ దాసీపని నీకెందులకు నా రాణివై సకల భోగభాగ్యాలు అనుభవించు, నీపై నాకు అమితమైన ప్రేమగల్గుచున్నది' అనుచూ దరిచేరబోవగా -

ద్రౌపది దూరముగా జరుగుచూ 'రాజా! దాసీదానితోనా నీ పరాచికములు! పరాచికము లాడుటకు రాజకుమార్తెలెవ్వరూ దొరకలేదా నీకు! రాచకులానికి చెందినవారు రాచకుమార్తెనే రాణిగా చేసుకోవాలిగాని, దాసీని రాణీగా చేయరాదు" అన్నది.

'అవసరంలేదు. నీవే నాకు కావాలి' అంటూ ఆమె చెయ్యి పట్టుకొన్నాడు. ద్రౌపది కీచకుని పట్టు విడిపించుకొని బయటకు పరుగెత్తబోవగా, కీచకుడు వెంట తరుముతూ వచ్చినాడు. అది చూసిన విరాటరాజు కీచకుని ప్రవర్తనకు కలత జెందినప్పటికి వాని పరాక్రమమునకు భయపడి యేమంటే యేమి నష్టము వాటిల్లునోయని నోరు మెదపలేక ఊరకుండెను.

వానితో, సందర్భాన్ని అర్థం చేసుకున్న ద్రౌపదిని తనని సమీపించిన కీచకునితో

"రాజా కంటపడి యింత అల్లరి అయిన తరువాత కూడా నేను కాదనటము యేమి బాగుండదు. నీ కోరిక తీర్చగలను. మనము కలుసుకొనుటకు నర్తనశాల అయితే బాగుంటుంది. రాత్రి అక్కడ యెవరూ వుండరు. అక్కడకు రా" అని చెప్పి అప్పటికి ఆ ఆపద నుండి తప్పించుకొని యెలాగో భీమునివద్దకు వెళ్ళి జరిగినది చెప్పి ఏడ్చినది. ఆమె సమయస్ఫూర్తికి సంతోషించిన భీముడు ద్రౌపదని ఓదార్చి పంపినాడు. ఆ రాత్రి కీచకుడు చక్కగా అలంకరించుకుని నర్తనశాలకు వచ్చినాడు. అప్పటికే అక్కడకు చేరిన భీముడు చీరను కప్పుకొని పడుకొని యుండెను. తలుపులు తెరచి యుండుట వలన కీచకుడు లోపల ప్రవేశించి తలుపులు మూసి శయ్యను సమీపించి పడుకొని యున్నది సైరంధ్రియే యని భావించి మెల్లగా దరిజేరి "సైరంధ్రీ" అని పిలుస్తూ లేపసాగినాడు.

ఎంతకూ లేవకపోవుట వలన 'ఓహో బ్రతిమాలవలెనా దేవీ! ఒక్కసారియేమి



కీచకుని వధిస్తున్న భీమసేనుడు

జీవితమంతా బ్రతిమాలుచునే యుంటాను. నేనిక ఆగలేను. కనుక కరుణించు లెమ్ము దేవీ' అనుచు కౌగిలించుకొనబోయినాడు. ఆ సమయముకొరకే ఎదురు చూచుచున్న భీముడు వానిని ఒక తన్ను తన్నినాడు.

ఆ దెబ్బతో 'అబ్బా యనుచు వెనుకకు పడిపోయిన కీచకుడు ఊహించని విధముగా యెదురయిన పరిణామమునకు విస్తుపోయి, లేవబోతుండగా - భీముడు మెరుపులా మరొకసారి డొక్కలో తన్నినాడు.

ఆ విధముగా పడిపోయిన కీచకుడికి పైకి లేచే అవకాశము యివ్వకుండా భీముడు వాడిని చితకబొడిచినాడు. ఆ దెబ్బలతో అంత బలవంతుడయిన కీచకుడు కూడా రక్తము కక్కుకుంటూ ప్రాణాలు వదిలాడు. భీముడు అచటనుండి వెళ్ళి ద్రౌపదికి జరిగినది చెప్పి యేమీ తెలియని వానివలె తన బసకు పోయి నిద్రపోయినాడు.

తెల్లవారినది. 'కీచకుని నర్తనశాలలో యెవరో చంపినారు' అనే వార్త నిమిషాలమీద నగరమంతా తెలిసినది. అది విని కీచకుని నూరుగురు తమ్ములైన ఉపకీచకులు వచ్చి తమ అన్న చావునకు కారణము 'దాసి' అని తెలుసుకుని, దాని భర్త లయిన గంధర్వులే కీచకుని యింత తేలికగా చంపి యెవరికంటా పడకుండాపోయారని భావించి కీచకుని శవాన్ని మోసుకొని బోవుచున్న బండి కట్టుకు ద్రౌపదిని కట్టివేసి తీసుకొని పోవుచుండిరి.

ద్రౌపది ప్రార్థనా రూపముగా మారు పేర్లతో పాండవులను పిలువసాగినది అక్కడ జరుగుచున్న కలకలం విన్న భీముడు వేషము మార్చుకొని స్మశానము వద్దకు వెళ్ళీ ఉపకీచకులను చంపి, ద్రౌపదిని విడిపించినాడు. ద్రౌపది మరల అంతఃపురము చేరినది. ఆమెను చూసి సుధేష్ణ 'అమ్మా! సదా భర్తల రక్షణలో మెలగుచున్న దానివి యెందుకమ్మా నీకు ఈ దాసీపని? ఈగనైతే మీదవాలనీయని అనురాగమూర్తులయిన నీ భర్తలవద్దనే వుండక యెందుకమ్మా నీకీపాట్లు? అమ్మా సైరంధ్రీ ఇక నీచే సేవలు చేయించుకోలేను. ఇంతవరకు తెలియక యేదో జరిగిపోయినది ఇక వెళ్ళమ్మా' అని చెప్పినది.

అది విని ద్రౌపది మనస్సులో "అజ్ఞాతవాసకాలము పూర్తగు సమయమున ఏమిటి భగవాన్. యిలా చేశావు" అనుకొనుచు ఎక్కడ తమ అజ్ఞాతవాసమునకు అంతరాయము కల్గునో ననే భయముతో "అమ్మా! త్వరలోనే నా భర్తలు వచ్చి నన్ను తీసుకొని పోయెదరు.

మరెన్నో రోజులు అవసము లేదమ్మా. వారు వచ్చేవరకు నేను యిక్కడ వుండక తప్పదు. కాదనకండమ్మా' అనగా, ద్రౌపది మాటను కాదంటే మరేమి అనర్ధము జరుగునో యని భయపడిన సుథేష్ట "సరే" నన్నది.

దక్షిణ గోగ్రహణము

కీచకుడు, ఉపకీచకులు - గంధర్వుల వలన హతులైనారని ఆ ఐదుగురు గంధర్వులకు ఒక్కతే భార్యయని దుర్యోధనాదులకు తెలిసినది. సింహబలుడుగా ఖ్యాతి కెక్కిన పరాక్రమశాలి అయిన కీచకుని చంపగల శక్తి భీమునికే యున్నదని తెలిసిన దుర్యోధనుడు సుధేష్ణ యొద్ద పరిచారకగా నుంటున్నది, ద్రౌపదియే అయి వుంటుందని నిర్ధారణ చేసుకున్నవాడై, ఎలాగయినా వారిని బయటపెట్టగలిగితే మరలా అరణ్యావాసము చేయించవచ్చునని భావించి కర్ణాదులతో చెప్పగా, అందరూ దుర్యోధనుని అభిప్రాయము బలపరచినారు. విరాట రాజుకు శత్రువయిన త్రికర్తదేశపు రాజు సుశర్మ కూడా "పాండవులు విరాటుని వద్దనే ఉన్నారనుకొనుటలో సందేహము లేదన్నాడు.

దానితో అందరూ కలసి ఒక పథకము వేసుకున్నారు. దాని ప్రకారం సుశర్మ తన సేనలతో విరాటరాజ్యమును దక్షిణదిశగా ముట్టడించవలెననీ తరువాత దుర్యోధనాదులు ఉత్తరదిశగా వెళ్ళి రాజున కధికముగానున్న గోసంపదను తోలుకొని వచ్చినట్లయితే విరాటునకు సహాయముగా పాండవులు వస్తారనీ భావించినారు.

అదే ప్రకారముగా సుశర్మ దక్షిణ దిశగా వెళ్ళి విరాటుని గోవుల మందను తోలుకొని పోవుచుండెను. అది తెలిసిన విరాటుడు "అయ్యో! ఈ సమయమున సింహబలుడు లేడే' అని చింతించుచుండగా కంకుభట్టు ఆలోచించి "రాజా! భయపడకండి, యుద్ధానికి బయలుదేరండి. నేను బ్రాహ్మణ సన్యాసినే అయినా పాండవులు నాకు అన్ని విద్యలూ నేర్పారు. మన వంటవాడైన వలలుడూ-గుఱ్ఱాలకు. గోవులకు రక్షకులయిన గోపాలకులూ కూడా యుద్ధనైపుణ్యము గలిగినవారే"యని చెప్పినాడు. ఒక్క బృహన్నల తప్పించి తక్కిన పాండవులందరూ సైన్యముతో కలిసి విరాటునకు సహాయంగా వెళ్ళినారు.

విరాట సుశర్మలకు ఘోరమైన యుద్ధం జరిగి యిరువైపులా సేనా చెల్లాచెదురైనది. అదే సమయమని భావించిన సుశర్మ విరాటుని బంధించి తీసుకొని పోవుచుండెను. అది గమనించిన ధర్మరాజు భీమునికి సైగజేయగా భీముడు వెళ్ళి సుశర్మని ఓడించి, అడ్డువచ్చిన సేనని హతమొనరించి విరాటుని తీసుకొని వచ్చినాడు.

ఉత్తర గోగ్రహణము

ఈ లోపుగా దుర్యోధనుడు కర్ణాది ప్రముఖులను వెంటబెట్టుకొని పెద్ద సేనతో ఉత్తరదిశగా వచ్చి మిగిలిన గోవులను మళ్ళించుకుని పోవుచుండెను. గోవులను కాచే గోపాలుడు వచ్చి కోటలో ఒంటరిగా మిగిలివున్న విరాటుని కుమారుడు ఉత్తరునకు యీ వార్త చెప్పినాడు.

అది విని ఉత్తరుడు, "నా తండ్రి లేని సమయం చూసి దుర్మార్గులైన కౌరవులు మన గోవులను తోలుకొని పోవుచున్నారే, ఇప్పుడేమి చేసెదను? రధసారధి అయినా లేడు. సారధి అయినా యున్నచో కౌరవులను చిత్తుగా ఓడించి గోవులను రక్షించుకొన గలిగినవాడినే!" యని, ఆడవారి వద్ద ప్రగల్బములు పలుకుచుండుట చూసిన ద్రౌపది ఉత్తరునకు - బృహన్నలశక్తి సామర్ధ్యములను తెల్పినది.

ఉత్తర పరుగు పరుగున పోయి బృహన్నలతో తన అన్నకు సారధిగా వెళ్ళి తమ గో సంపదను కాపాడమని కోరినది. అంత బృహన్నల ఆలోచించి ఉత్తరుని వద్దకు వచ్చి సారధిగా తను వస్తానని చెప్పగా, యిక దారిలేక ఉత్తర కుమారుడు బృహన్నల సారధ్యముతో యుద్ధానికి బయలుదేరినాడు. ఉత్తర వారి వద్దకు వచ్చి "అన్న! ఓడిపోయిన కౌరవ ప్రముఖుల తలపాగా కుచ్చులు తెచ్చిపెట్టు" అన్నది "ఓ అన్నాడు ఉత్తర కుమారుడు. అయినా సందేహముచే ఉత్తర "ఆచార్యా! ఒక వేళ మా అన్న కాకపోతే మీరయినా తీసుకొనివచ్చి మీ శిష్యురాలి కోర్కె తీర్చండి. అని బృహన్నలతో కూడా చెప్పింది.

"తప్పక తెచ్చి యిచ్చెద"నని ఉత్తరకు మాట యిచ్చి బృహన్నల రధాన్ని నడిపెను. రథం యెక్కి వేగాన్ని చూసి ఆశ్చర్యచకితుడవుతూన్న ఉత్తరుని క్షణాలలో కౌరవసేన

సమీపమునకు తెచ్చి రథాన్ని నిల్పాడు. కౌరవసేనను చూసిన ఉత్తరుడు భయపడుచూ 'బృహన్నలా! కౌరవసేన విషయం తెలియక ప్రగల్భములు పలికినాను. వీరిని ఓడించుట నా తరం కాదు. రథాన్ని వెనుకకు త్రిప్పుము' అనగా బృహన్నల 'భయపడకు ఉత్తర కుమారా! కౌరవసేనను ఓడించి మన గోవులను తీసుకొనీ వెళ్ళియే విరాటరాజు దర్శనం చేసుకుందాం'' అని చెప్పినాడు.

అది విని యిక లాభం లేదనుకుని ఉత్తరుడు రథం దిగి పారిపోసాగెను. అర్జునుడు ఉత్తరుని పట్టుకుని 'నీవు రథసారథ్యము చెయ్యి నేను కౌరవసేనను ఓడిస్తాను' అని నచ్చచెప్పి, అతనిని తమ ఆయుధము లుంచిన జమ్మిచెట్టువద్దకు తీసుకొని వచ్చి ఆపినాడు. అర్జునుడు తన గాండీవమును, శంఖమును తీసుకొని సారథ్యభారం ఉత్తర కుమారుని కప్పగించగా ఎట్టకేలకా రథము కౌరవసేనను సమీపించి ఆగింది. వెనువెంటనే అర్జునుడు శంఖం పూరించి, భీష్మ ద్రోణాదుల పాదములకు వందన బాణములు సమర్పించినాడు. అది చూసి దుర్యోధనుడు ఆ వచ్చినవాడు అర్జునుడే యనీ, తన అనుమానం నిజమయిందనీ సంతోషముతో 'అర్జునుడు అజ్ఞాతవాసము చేయుచు బయటపడినాడు. కనుక పాండవులు మరల అరణ్యావాసము చేయవలె'నన్నాడు. అంత భీష్ముడు 'నిన్నటితో అజ్ఞాతవాసము పూర్తయిన'దని తెలిసి యుద్ధమున కుద్యుక్తు డయ్యెను.

అర్జునుడు వేసే బాణధాటికి కౌరవసేన చెల్లాచెదురయినది. భీష్మ, ద్రోణ, కర్ణాది నాయకులూ-అశ్వత్థామ దుర్యోధనాది ప్రముఖులూ ఉండి కూడా ఒక్క ధనంజయుని ఓడించలేకపోయినారు. ఈ విధముగా కౌరవసేనకు ధనంజయునకు భయంకర్మైన యుద్ధం జరిగినది. యెవరి ఓటమీ తేలక పోవటంతో చివరకు ధనంజయుడు సమ్మోహనాస్త్రం ప్రయోగించి, అందరినీ మూర్ఛితులను గావించి, భీష్మ - ద్రోణులు మినహాగా తత్తిమ్మావారి తలపాగా కుచ్చులన్నీ కోసి తీసుకొని గోవుల మందతో వెను దిరిగెను. ధనంజయుడు తన ఆయుధములను ఎప్పటివలెనే జమ్మిచెట్టుపై నుంచి ఉత్తరునితో విరాట రాజ్యము వైపు బయలుదేరాడు. ఈ విధముగా బృహన్నలే అర్జునుడని ఉత్తరునకు తెలిసినది.

విరాటుని ఆగ్రహము

పాండవుల సహాయముతో సుశర్మను జయించి తిరిగి వచ్చిన విరాటరాజు తన కుమారుడొక్కడే బృహన్నలను తీసుకొని కౌరవులతో యుద్ధానికి వెళ్ళినాడని తెలిసి బాధపడ సాగెను. కంకుభట్టు విరాటునకు ధైర్యం చెప్పుచుండగా భటులు వచ్చి ఉత్తరుడు విజయం పొంది తిరిగి వచ్చుచున్నాడని తెలిపినారు. ఆ వార్త విరాటుడు కంకుభట్టుతో ఆనందముగా పాచిక లాడసాగెను.

వినోదముగా పాచికలాడుచున్న విరాటుడు కుమారుని పరాక్రమమును పొగడు చుండగా, కంకుభట్టు "బృహన్నల వంటి పరాక్రమశాలి రథసారధిగా వెంటనుండగా అపజయ ఎన్నడు కలుగదు" అన్నాడు. అది విని విరాటుడు కోపముతో "పేడిమూతి బృహన్నలను పొగిడి తన కుమారుని పరాక్రమమును కించపఱచుచున్నా"డని భావించి, ఆడుచున్న పాచికలను ంకుభట్టు ముఖంపై విసిరినాడు.



కంకుభట్టు నుదుట రక్తమును తుడుస్తున్న సైరంధ్రి

పాచికలు తగిలి కంకుభట్టు (ధర్మరాజు) నుదుటినుండి రక్తము కారుచుండగా దూరం నుండి చూస్తున్న సైరంధ్రి పరుగు పరుగున వచ్చి తన పైట చెంగుతో రక్తాన్ని అద్ది ప్రక్కనే గల బంగారు గిన్నెలో పిండసాగెను.

అది చూసి విరాటుడు "నా కొడుకు పరాక్రమాన్ని విని సహించలేని వీడి రక్తాన్ని తుడిచి గిన్నెలో పిండుతున్నావెందుకు?'' అన్నాడు.

అంత సైరంధ్రి "ఉత్తమ బ్రాహ్మణుల, క్షత్రియుల, రక్తం యెన్ని చుక్కలైతే నేల రాలుతుందో అన్ని సంవత్సరములు రాజ్యములో అరాజకమేర్పడుతుంది. అలా జరగకూడదనే యిలా తుడుస్తున్నా నన్నది.

విరాటుని పశ్చాత్తాపము

ఇలా వాదోపవాదములు జరుగుచుండగానే ఉత్తరుడు వచ్చి తండ్రికి నమస్కరించి కంకుభట్టుకు పాదాభివందనములు చేసి జరిగినదంతయు తండ్రికి చెప్పి బృహన్నలే ధనంజయుడనీ, కంకుభట్టు ధర్మరాజనీ తెల్పినాడు ఈలోపుగా బృహన్నల కౌరవుల తలపాగా కుచ్చులను ఉత్తరకిచ్చి ఆశీర్వదించెను.

కుమారుని మాటలు విన్న విరాటుడు ధర్మరాజును క్షమాపణ గోరి తనయొక్క తొందరపాటుకు పశ్చాత్తాపము పొంది, పాండవుల వివరములు తెలుసుకుని, యింత కాలం వారిని సేవకులుగా చూసినందుకు బాధపడెను. ఇదంతా తెలుసుకొన్న సుధేష్ట సైరంధ్రీతో "అమ్మా! పాంచాలీ! నీవని తెలియక యెంతోమంది దాసీలతో సేవలందుకునే నిన్ను నేను దాసీదానిగా చూసినందులకు క్షమించవమ్మా" అంటూ ప్రేమతో ఆలింగనము చేసుకున్నది.

శ్రీకృష్ణుని ఆగమనము

ధనంజయుని విజయం గురించి తెలుసుకున్న కృష్ణుడు సుభద్రాభిమన్యులను వెంటబెట్టుకొని వచ్చినాడు విరాటుడు కృష్ణుని కెదురేగి సత్కరించి తీసుకొని వచ్చినాడు. పాండవులకు ఆశ్రయం యిచ్చి అజ్ఞాతవాసం సఫలీకృతమగుటకు తోడ్పడిన విరాటుని కృష్ణుడు అభినందించినాడు, పాండవులు కూడా విరాటునకు కృతజ్ఞతలన తెల్పుకున్నారు.

ఉత్తరాభిమన్యుల కళ్యాణము

తరువాత శ్రీకృష్ణుడు వీరి అనుబంధం శాశ్వత బంధముగా చేయదలచి విరాటుని మనస్సును గ్రహించిన వాడగుటచేట అర్జునునితో మాట్లాడి విరాటరాజు కుమార్తె ఉత్తరను అభిమన్యున కిచ్చి వివాహము జరిపింప నిశ్చయించినాడు.

ఈ వార్త తెలిసి నగరమంతా రంగ రంగ వైభవంగా అలంకరించినారు. ఆ అలంకరణలో విరాట నగరం మరో స్వర్గంలా దివ్యకాంతులు విరజిమ్ముచుండగా బంధు



ఉత్తరాభిమన్యుల కళ్యాణము

మిత్రుల సమక్షములో మణిమయ రత్నాలంకార భూషితమయిన కళ్యాణ వేదికపై ఉత్తరాభిమన్యుల కళ్యాణ మహోత్సవము మహా వైభవముగా జరిగింది.

★★★

ఉద్యోగ పర్వము

ఉత్తరాభిమన్యుల పెండ్లికి వచ్చిన బంధుమిత్రాది రాజులందరనూ ఆ వివాహ వేడుకలు పూర్తయిన తరువాత ఒకచోట సమావేశమైనారు. నియమం ప్రకారం పాండవులు అరణ్య అజ్ఞాతవాసములు పూర్తిచేశారు. కనుక ఇక వారి రాజ్యము వారికిచ్చుట న్యాయ సమ్మతమని యెవరి అభిప్రాయములు వారు తెల్పారు. అందరి అభిప్రాయములు విన్న పాండవులు ఆలోచించి ముందుగా రాయబారిని పంపుట మంచిదని భావించి శ్రేయోభిలాషి అయిన శ్రీకృష్ణుని కౌరవులవద్దకు రాయబారిగా పంపినారు.


శ్రీకృష్ణరాయబారము

సాత్యకి రధసారధ్యం వహించిన శ్రీకృష్ణుడు రాయబారిగా హస్తినా పురమునకు బయలుదేరినాడు. ఇది తెలిసిన ధృతరాష్ట్రుడు రాజ్యాన్ని అలంకరింపజేసి శ్రీకృష్ణునకు ఘనమైన స్వాగత మిచ్చుటకు యేర్పాట్లు చేయమని ఆదేశించినాడు.

భీష్మ, ద్రోణ, కృపాచార్యాదులు, దుర్యోధనాది నాయకులు శ్రీకృష్ణునకెదురేగి స్వాగతం చెప్పి గౌరవ లాంఛనములతో రాజ్యమునకు తీసుకొనివచ్చి అతిధి సత్కారములు గావించి గౌరవించినారు.

శ్రీకృష్ణుడు కొంతసేపు వారితో వుండి తరువాత అచటినుండి బయలుదేరి విదురుని యింటికి వెళ్ళినాడు. కుంతికి పాండవుల క్షేమ సమాచారమును తెల్పి ఆమె యోగ క్షేమములను తెలుసుకొన్నాడు.

శ్రీకృష్ణుడు తన యింటికి వచ్చినందుకు ఆనందించి, విదురుడు ఆయనను యధావిధిగా పూజించినాడు. కొంత తడవు కుశల ప్రశ్నలు అయిన తరువాత కృష్ణుడు తను వచ్చిన పని గురించి కుంతి విదురులకు చెప్పినాడు. అది విని విదురుడు "శ్రీకృష్ణా! నీకు తెలియనిదేమి వున్నది? కౌరవులు నీ శాంతి వచనాలకు లొంగి పాండవులకు న్యాయంగా రాజ్యం యిస్తాననే నమ్మకం నాకు లేదు" అని తన అభిప్రాయమును వ్యక్తపరచినాడు.



విదురుని యింటిలో విందారగిస్తున్న శ్రీకృష్ణుడు

అందుకు శ్రీకృష్ణుడు మందహాసము చేసి "యేదీ జరిగినప్పటికినీ త్వరలోనే పాండవులు తమ రాజ్యమును తాము పొంది చక్కగా సుఖపడగల'రని చెప్పి, కౌరవ సభకు వచ్చినాడు. పాండవ రాయబారిగా శ్రీకృష్ణుడు వచ్చాడని తెలిసి ఆయన ద్వారా పాండవుల యోగ క్షేమములను తెలుసుకోవాలనే కుతూహలముతో విచ్చేసిన జన సమూహముతోను కురువృద్ధులైన భీష్మాది ప్రముఖులతోను సభాస్థలి అంతా క్రిక్కిరిసి యుండెనును.


దుర్యోధనుడు, శ్రీకృష్ణుని ఉచితాసనీనుని గావించి 'మా వద్దకు రాయబారిగా వచ్చిన నీవు విదురుని యింట బస చేసినావెందుకు?" అని అడిగినాడు.

శ్రీకృష్ణుడు నవ్వుచు "నా మేనత్త విదురుని యింటనున్నది కనుక! అదీగాక విదురుడు నా భక్తుడు. నాకు ప్రియమైన ఆప్తుడు, అందుచేత నేనక్కడ బస చేయవలసి

వచ్చినది'' అన్నాడు. అయితే మేము నీకు ఆప్తులము కామా?' అని దుర్యోధనుడు ప్రశ్నించగా' పాండవ నాశనాన్ని కోరే నీవు నాకు ఆప్తుడవెలా అవుతావు? న్యాయంగా ప్రర్తించే వారే నాకు ఆప్తులౌతారు' అని జవాబు నిచ్చాడు కృష్ణుడు.

తరువాత శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో "రాజా! నీ కుమారులు ఆడించిన మాయా జూదములో ఓడిపోయిన పాండవులు నియమం ప్రకారం అరణ్య - అజ్ఞాత వాసములు పూర్తి చేసినారు. ఇక వారి రాజ్యము వారి కిప్పించమని కోరుచున్నారు.'' యని పాండవులు అభిప్రాయమును తెల్పినాడు.

దుర్యోధనుడు, శ్రీకృష్ణుడు చెప్పిన దానికి ఒప్పుకొనక, హేళన చేయుచు "పందెం ఒడ్డిననాడే రాజ్యమును పోగొట్టుకున్నవారు యీ రోజు నిన్ను రాయబారమునకు



సభలో రాయబార సారాంశమును తెలుపుచున్న శ్రీకృష్ణుడు

పంపినారు? అయినా, వారు పంపినంత మాత్రమున తగుదునమ్మా అనుచు నీవెలా వచ్చినావు?' అనగా, వాసుదేవుడు -

"సుయోధనా! మీ మంచి కోరి చెబుతున్నాను. జరిగిపోయినకాలము యెటువంటి దైనా, ఇకముందు అయినా, మీరు శత్రుత్వమును విడనాడి సఖ్యత కలిగి, కలిసి వుండటం మంచిది' పోనీ, పాండవులు తరపున నేనే చెబుతున్నాను. వారి కయిదుగురికీ అయిదు ఊళ్ళయినా యిస్తే మంచిది. మీతో విరోధం పాండవులకు లేదు. నేను చెప్పిన విషయాలతో ఏ ఒక్కదానికైనా మీరు అంగీకరిస్తే మంచిది' అని యెన్నో విధములుగా చెప్పి చూశాడు. శ్రీకృష్ణుని మాటలను సభలోనున్న వారందరూ సమర్థించారు. అయినా ధృతరాష్ట్రుడు నోరు మెదపలేదు.

కాని దుర్యోధనుడు మాత్రం కోపంతో దిగ్గునలేచి "కృష్ణా! నేనేమి మాకు నీతి వాక్యములు చెప్పనవసరము లేదు. పాండవులకు ఒక్క సూది మొన మోపినంత స్థలము కూడా యివ్వనన్నానని చెప్పు ఇక నా మాటలకు తిరుగులేదు." అని గట్టిగా జెప్పి దుశ్శాసను నికి సైగ జేసి శ్రీకృష్ణుని సమీపించెను.

శ్రీ కృష్ణుని విశ్వరూపము

దుశ్శాసనుని చేతిలో త్రాళ్ళనుచూచి సాత్యకి కోపముతో "దుర్మార్గులారా! శ్రీకృష్ణ పరమాత్మనే బంధిస్తారా?" అంటూ కత్తి దూశాడు శ్రీకృష్ణుడు సాత్యకిని శాంతింపజేసి "సుయోధన సార్వభౌమా! గర్వమందాంధుడై నిప్పుతో చెలగాటమాడ ప్రయత్నిస్తున్నావు. పాండవులు కాదు సుయోధనా నీ మాయలోపడి మోసపోవుటకు అన్ని వేళలా నీ అధికారం ఉపయోగిస్తుందని భావించకు. నన్ను బంధించగల శక్తివుంటే బంధించు నీ సరదాను నేను మాత్రం కాదనటం యెందుకు? అంటూ ఆసనము నుండి లేచి నిలబడతాడు.

మరుక్షణములోనే శంఖచక్రధారియై కిరణకాంతులను వెదజల్లుచు వూహించలేని యెత్తు పెరిగినాడు ఆ దివ్య లీలామానుష రూపము వెదజల్లే తేజస్సును చూపి భరించలేని దుర్యోధనుడు కనులు మూసుకున్నాడు. దుశ్శాసనుడు మూర్ఛనొందినాడు విదుర భీష్మాదులు ఆ రూపమును దర్శించి తమ జన్మలు చరితార్థము లయినవని స్తుతించినారు. శ్రీకృష్ణుడు తన రూపమును చూచు అదృష్టము ధృతరాష్ట్రునకు కూడ

కలుగజేసినాడు. ధృతరాష్ట్రుడు ఆ దివ్యమైన తేజోమూర్తిని కనులారా గాంచి "కృష్ణా! నీ మూర్తిని చూసిన నేత్రములతో మరలా యీ పాపలోకమును చూడలేను" అని తిరిగి అంధత్వమునే కోరి పోందినాడు.

శ్రీకృష్ణుడు తన విశ్వరూపమును ఉపసంహరించుకొని ధృతరాష్ట్రునితో "రాజా! నీవూ, నీ కుమారులూ యింత మూర్ఖులనుకోలేదు. సంధిచేసుకొని కులనాశనము జరగకుండా కాపాడుకుంటారనుకున్నాను, సరే చెవిటివాని వద్ద శంఖము నెంత వూదినా ఫలితముండదు. కనుక త్వరలో కౌరవ పాండవ యుద్ధము తప్పదు. ఆ యుద్ధమున ధర్మమూర్తులయిన పాండవులు విజయం సాధించక మానరు." అని చెప్పి సభనుండి వెడలిపోయెను.

శ్రీకృష్ణుని ప్రయత్నము

సభనుండి వచ్చిన శ్రీకృష్ణుడు కర్ణుని ఒంటరిగా కలుసుకుని, అతని జన్మ వృత్తాంతమును తెల్పి పాండవ పక్షమున జేరవలసినదిగా కోరెను. ఎన్ని విధముల చెప్పినా కర్ణుడు దుర్యోధనుని విడిచి రాలేనన్నాడు. నమ్మినవారికి ద్రోహము చేయలేనని ఖండితముగా చెప్పాడు. కర్ణుని వైఖరి చూసి యిక యేమి చెప్పినా లాభం లేదనుకుని శ్రీకృష్ణుడు విదురుని యింటికి వచ్చి కుంతితో "అత్తా! నేను కర్ణుని వద్దకు వెళ్ళివచ్చాను. కాని ప్రయోజనం లేకపోయినది" అని జరిగినదంతయు చెప్పి 'నీవు కూడ వెళ్ళి కర్ణుని ఒప్పించుటకు ప్రయ్నత్నించు'మని సలహా నిచ్చినాడు.

కుమారుని వరమడుగబోయిన కుంతి

కుంతి కర్ణుని వద్దకు వెళ్ళి "కుమారా కర్ణా! ఈ రోజు నీ తల్లి దీనాతిదీనంగా వరమడుగుటకు నీ వద్దకు వచ్చినది, కాదనకుండా యీయగలవా నాయనా?" అని అడిగినది.

అందుకు జవాబుగా కర్ణుడు - "అమ్మా! నీవు నన్ను కన్నావేగాని నిన్ను - అమ్మా! అని నోరారా పిలిచే భాగ్యాన్ని నాకు లేకుండా చేశావు. పుట్టిన వెంటనే కఠినాత్మురాలవై నీట వదిలావు. దైవానుగ్రహమున నన్ను పెంచినవాడు, సూతుడైతే చేరదీసి యింతవానిగా

చేసినది దుర్యోధన చక్రవర్తి. అందుచేత, నీవడిగే వరము యేమిటో తెలిస్తేగాని మాట యివ్వలేనమ్మా?" అనినాడు.



కర్ణుని కాతని జన్మవృత్తాంతమును తెలుపుచున్న శ్రీకృష్ణుడు

"కుమారా! చచ్చిన పామును మరింతగా చంపకు. నిన్ను అలా నీటిపై వదలవలసి వచ్చిన రోజున యెంతగా కుమిలిపోయానో. ఆ భగవంతునికే తెలుసును. ఆ ఆవేదన నాలో యిప్పటికీ వున్నది బాబూ! కాని, యేమి చేయలేని యెవరికి చెప్పుకోలేని నిస్సహాయురాలిని' అదే నిస్సహాయముతో యిప్పుడు నిన్ను పుత్రభిక్ష పెట్టమని ప్రార్థిస్తున్నాను బాబు!' నీ తమ్ములయిన పాండవుల పక్షంలో చేరమని కోరుటకు వచ్చాను బాబు!" అని కుంతి చెప్పెను.

"ఎంత ప్రేమ తల్లీ కన్నబిడ్డలపైనే పక్షపాతం చూపే మాతృమూర్తినినిన్నే చూశానమ్మా! నీవు ఎంత కఠినాత్మురాలవై నన్ను వదులుకున్నా నాకు జన్మనిచ్చిన

తల్లివి కనుక చెబుతున్నాను. నన్నే నమ్ముకొని యున్న దుర్యోధనుని మోసగించి మిత్రద్రోహం చేయలేను. కాని ఒక్కమాట మాత్రం యివ్వగలను. నేను పార్థుని తప్ప తక్కిన నలుగురు తమ్ములనూ యేమి చేయను. పార్థుడే కనుక నా చేతిలో చస్తే నేను తమ్ములతో చేరతాను. ఒకవేళ పార్థుని చేతిలో నేనే పోతే యుద్ధరంగమున అసువులు బాపి వీరస్వర్గ మలంకరిస్తాను. ఇంతకు మించి యీ కుమారుడు నీకు యే ఉపకారము చేయలేడమ్మా!' అని చెప్పగా -

కర్ణుని మాటలు శూలాలై హృదయానికి నాటుకొనగా మారు మాటాడలేని కుంతి మనస్సులోనే రోధిస్తూ వెళ్ళిపోయింది.

శ్రీకృష్ణుని సహాయం

శ్రీకృష్ణుడు రాయబార సారాంశమును పాండవాదులకు తెలిపి ద్వారకకు వెళ్ళిపోయాడు. కౌరవ పాండవులు యుద్ధ సన్నాహములు చేసుకోసాగిరి. పాండవ పక్షపాతియైన శ్రీకృష్ణుడు తమ వైపుకు త్రిప్పుకుంటే యెందుకయినా మంచిదని భావించి దుర్యోధనుడు శ్రీకృష్ణుని సహాయము కోరుటకై ద్వారకానగరమునకు వెళ్ళినాడు. ఆ సమయమున శ్రీకృష్ణుడు నిద్రించుచుండుట వలన తలవైపుగా నున్న ఆసనముపై ఆసీనుడయినాడు, మరికొంత సేపటికి అర్జునుడు వచ్చి శ్రీకృష్ణుడు నిద్రించుచుండుట చూసి దగ్గరకు వెళ్ళి పాదాభివందనము చేసి కాళ్ళవేపు కూర్చుని కృష్ణుడు మేలుకొను సమయమునకై యెదురు చూచుచుండెను.

కొంతసేపటికి మేల్కొన్న శ్రీకృష్ణుడు కాళ్ళదగ్గర కూర్చునియున్న పార్థుని జూచి యేమీ తెలియనివానివలె "ఎప్పుడు బావా తమ రాక" అని పలకరిస్తూ లేచి కూర్చున్నాడు.

అప్పుడు దుర్యోధనుడు యిక ఆలస్యము చేస్తే లాభము లేదనుకొని "బావా! శ్రీకృష్ణా! మాకు జరగబోయే యుద్ధమున నీ సహాయము కోరి వచ్చాను" అని చెప్పినాడు.

"దుర్యోధనా! మీరిద్దరూ నాకు ఒక్కటే. అందుచేత నేను ఒక్కడినీ ఒకవైపూ, నా సైన్యమంతా ఒకవైపూ వస్తాము. కాని నేను యుద్ధము చేయను సలహాలను మాత్రం యిస్తాను. యెవరికి ఏమి కావలెనో నిర్ణయించుకొనండి నేను ముందుగా పార్థుని చూసినాను కనుక ముందుగా అతని అభిప్రాయం తెలుసుకొనుటయే ధర్మం అన్నాడు.



శ్రీకృష్ణుని సహాయమును కోరుచున్న దుర్యోధనార్జునులు

అది విని అర్జునుడు "బావా! యుద్ధం చేయనవసరం లేదు. నీవు మా పక్షమున వుంటే చాలు" అన్నాడు.

అర్జునుడు యేమి అడుగుతాడోనని భయపడిన దుర్యోధనుడు అర్జునుని అభిప్రాయము విని, మనస్సున ఆనందిస్తూ "కృష్ణా! యుద్ధ నైపుణ్యముగల నీ సైన్యాన్ని మాత్రం మా పక్షమున పంపుము అదే నిన్ను కోరేది" అనగా

"అలాగే పంపుతా"నని మాట యిచ్చినాడు శ్రీకృష్ణుడు.

దుర్యోధనుడు అచటనుండి బలరాముని వద్దకు వెళ్ళి సహాయము కోరగా "మీ అన్నదమ్ములు మూర్ఖులై యుద్ధానికి సిద్ధమైనారు. గాని నేను మూర్ఖుడను కాను. నా చిన్నారి కృష్ణునకు పోటీగా నేను నీవైపు రాలేను, నా తమ్ముడెప్పుడూ నా దృష్టిలో నాకు చిన్నవాడే" అని చెప్పినాడు.

యుద్ధసన్నాహములు

కౌరవ పాండవ సేనలు యుద్ధము చేయుటకై కురుక్షేత్రమును చేరినవి. కౌరవులవైపు 11 అక్షౌహిణులు, పాండవులవైపు 7 అక్షౌహినుల సేన చేరినది. కౌరవులు తమలో గల వీరుల బల పరాక్రమములను నిర్ణయించుకొనుచున్న సమయమున భీష్ముడు కర్ణుని అర్ధరథునిగా నిర్ణయించాడు. అది విన్న కర్ణుడు-భీష్ముడున్నంతవరకూ తాను యుద్ధంలోకి రానన్నాడు. ఈ విధముగా వాదోపవాదములు అయిన తరువాత భీష్ముడు కౌరవ సైన్యానికి సేనాధిపతిగా అయినాడు. పాండవుల సైన్యానికి ద్రుపదుని కుమారుడు ధృష్టద్యుమ్నుడు సేనాధిపతిగా నియమింపబడినాడు. ఈ విధముగా ఉభయ సైన్యము యుద్ధ సన్నద్ధమై కురుక్షేత్రమున నిలచినది.

★★★

భీష్మ పర్వము

యుద్ధభూమిలోనికి వచ్చిన ధర్మరాజు అందరినీ ఒకసారి చూసి తన 'ఆయుధము లను రథమునందుంచి కాలినడకన భీష్ముని సమీపించి ఆయనకు నమస్కరించినాడు "తాతా! పూజించుకొనవలసిన నిన్ను ఈ విధముగా యుద్ధరంగమున యెదుర్కోవలసి వస్తుందని అనుకోలేదే, నన్ను ఆశీర్వదించి యుద్ధము చేయుటకు అనుమతి నివ్వమని కోరుతున్నాను" అని ప్రార్ధించాడు.

అతని వినయానికి సంతసించిన భీష్ముడు నాయనా! ధర్మరాజా! నీ ధర్మమే నిన్ను కాపాడుతుంది. నీకు జయం కలుగుతుంది. నేను కౌరవ పక్షమున యుద్ధము చేయుటకు కట్టుబడి ఉన్నవాడిని, కనుక, నన్ను నీ వైపునకు రమ్మనమనే కోరిక తప్ప మరేదైనా వరం కోరుకో యిస్తాను" అన్నాడు. అందుకు ధర్మరాజు "తాతా! నిన్ను యుద్ధమున జయించు మార్గము తెల్పుము" అని మరింత వినయముగా కోరగా భీష్ముడు 'నాచేతిలో విల్లున్నంతవరకూ నన్ను యెవరూ జయించలేరు. కాని, నీకు నన్ను జయించే మార్గము చెబుతాను, తరువాత రా నాయనా' అన్నాడు.

అక్కడినుండి ధర్మరాజు వరుసగా ద్రోణ, కృపులకు ప్రదక్షిణ నమస్కారములు చేసి, వారి అనుమతి ఆశీర్వాదములు కూడా పొంది తమ సేన వద్దకు వచ్చి యుద్ధ సన్నద్ధుడైనాడు.

అర్జునుని ఆవేదన

ఇంతలో అర్జునుడు రథాన్ని శరవేగముతో తోలుకొని వచ్చి ఉభయసేనల మధ్యనా నిలిపాడు - రథసారధి అయిన శ్రీకృష్ణుడు

తన రథమునకు యిరువైపులా బారులుతీరి నిలిచియున్న సేనను చూసిన అర్జునుడు కలత జెందినాడు. తనను పెంచిన తాత భీష్మనీ, తనను వీరునిగా తీర్చిన గురువులనూ చూచినాడు. 'రాజ్యం కొరకు పూజ్యులనూ గురువులనూ హతమార్చాలి



అర్జునునికి గీతోపదేశం చేయుచున్న శ్రీకృష్ణుడు

కదా?" యని మనస్సున తలపోయుచు, ఆవేదన జెంది ధనుస్సునూ, అమ్ములనూ చేజారవిడచి రథములోనే కూలబడిపోయాడు.


అర్జునుడు బేలతనము చూసి శ్రీకృష్ణుడు నవ్వుతూ "అదేమిటి బావా!" అని అడగగా 'నాకు యుద్ధము చేయాలని అనిపించుటలేదు బావా అని తన బాధను చెప్పుకున్నాడు పార్థుడు.

అప్పుడు కృష్ణుడు అర్జునునకు భగవద్గీతను బోధించి, తన విశ్వరూపమును చూపించగా అర్జునుడు ఆ రూపమును కనులారా గాంచి, సమస్త భూమండల భారము ఆ దివ్యమూర్తిలో చూసి, ప్రదక్షిణము చేసి సాష్టాంగ దండ ప్రణామములాచరించి యెన లేని ఉత్సాహముతో ధనుస్సు చేతబట్టి రణశంఖము నూదినాడు.

యుద్ధము ప్రారంభమయినది. ఉభయసేనలు అమితోత్సాహముతో యుద్ధము చేస్తున్నాయి. భీష్ముని నాయకత్వమున కౌరవ సేన చాలా నైపుణ్యముతో పోరాడుచున్నది. భీష్ముడు ధాటికి అర్జునుడు కూడా నిలువలేకుండా వున్నాడు. భీష్ముడు శ్రీకృష్ణునిపైన కూడ బాణములు ప్రయోగించుచుండెను. ఈ విధముగా యెనిమిది రోజులు యుద్ధము సాగినది.

తెల్లవారినది. మరల యుద్ధము సాగినది. యుద్ధరంగమున భీష్ముడు ప్రళయ కాలరుద్రునివలె విజృంభించాడు. అతని బాణములు పాండవ సేనను నల్లులవలె నలిపి వేయసాగినది. భీష్ముడు అంత ఘోరముగా యుద్ధముచేస్తున్నా అర్జునుడు "తాత అనే అభిమానముతోనూ, పూజ్య భావముతోనూ, భీష్మునిపై విజృంభించలేక పోతున్నాడు. ఇది చూసి శ్రీకృష్ణుడు 'ఇక లాభంలేదనుకుని' రథం దిగి భీష్మునిపై తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించబోగా అర్జునుడు శ్రీకృష్ణునకు అడ్డుపడి "బావా భీష్ముడు నాకు పూజనీయుడు. ఆయనను నీ చక్రాయుధమునకు బలి చేయవద్దు" అని అనినాడు. దానితో తొమ్మిదవ రోజు యుద్ధము ముగిసినది.

శ్రీకృష్ణుడు కోపాన్ని చూసిన పాండవులు భయపడి, ఇలా అయితే కష్టమని భావించి ఆ రాత్రి భీష్ముని వద్దకు వెళ్ళి "తాతా! నీవు మాద్వారా మరణించకుండా నిన్ను జయించే మార్గము చెప్పు. శ్రీకృష్ణుని రౌద్రాన్ని మేము భరించి ఆపలేము" అని అడిగినాడు.



పాతాళ గంగను రప్పించి భీష్మునకు దాహం తీర్చుతున్న అర్జునాదులు

'స్త్రీగా పుట్టి తరువాత పురుషత్వము పొందినవారితో నేను యుద్ధము చేయను. అది నా నియమం అంబ నాపైన గల ద్వేషభావముతో, నన్ను జయింపవలెననే పట్టుదలతో తపస్సు చేసి పురుషత్వము పొందినది. గనుక శిఖండిని తీసికొనివచ్చి మీముందు నిలుపుకొన్నట్లయితే నేను యుద్ధము మానివేస్తాను. అప్పుడు నన్ను జయించండి' అని చెప్పి ఆశీర్వదించి పంపించాడు భీష్ముడు.

అప్పటి కప్పుడే వెళ్ళి అర్జునుడు శిఖండిని తీసుకొని వచ్చినాడు. మరునాడు ఉదయాన అర్జునుడు శిఖండిని రథములో వుంచి యుద్ధము చేయసాగినాడు. శిఖండిని చూసి భీష్ముడు తన చేతనన్ను ధనుస్సును రథంపై పడనేసి నిరాయుధునిగా తలచెను ఆ సమయమున భీష్ముడు చెప్పిన ప్రకారము అర్జునుడు భీష్ముని పడగొట్టెను. కాని భీష్ముడికి అతని తండ్రి యిచ్చి వరప్రభావముచేత తనయిష్టం వచ్చినపుడు ప్రాణములు

వదలగలడు కనుక పడిపోయిన సమయమున ప్రాణములు వదిలితే పుణ్యలోకప్రాప్తి యుండదని భావించి, ఉత్తరాయణ ప్రవేశముకొరకు యెదురుచూస్తూ అర్జునుడు బాణములచే యేర్పరచిన శయ్యపై పరుండెను. అలసియున్న భీష్ముడు "దాహం" అనగా కౌరవులు నీరు తేగా భీష్ముడు 'ఆ నీరు వద్దనీ తన దాహం తీర్చుటకు "పాతాళగంగ కావా'లనీ కోరినాడు.

భీష్ముడి కోరిక విని అర్జునుడు వారుణాస్త్రం ప్రయోగించి, భూమిని చేదించి, పాతాళ గంగను రప్పించినాడు' భీష్ముడు భూమినుండి ధారగా వెలువడిన ఆ గంగా జలమును త్రాగి దాహమును తీర్చుకొని విజయునిగా ఆశీర్వదించినాడు.

★★★

ద్రోణ పర్వము

భీష్ముడు పడిపోవటమువలన కౌరవులకు సగము నడుము విరిగినట్లు అయినది. అతని అనంతరము ద్రోణాచార్యులు సర్వసేనాధిపతిగా నియమితుడైనాడు.

దుర్యోధనుడు యుద్ధ సన్నద్ధులైన ద్రోణాచార్యుని వద్దకు వచ్చి 'ఆచార్యా! ధర్మరాజును ప్రాణములతో బంధించి యిచ్చి, నా కోరిక తీర్చవలెను' అనగా-

ద్రోణుడు కోర్కెను విని ఆశ్చర్యపోయెను. "అర్జునుని యుద్ధరంగమున లేకుండా చేయగలిగితే ధర్మరాజును పట్టి యిస్తా"నని వాగ్దానము చేసెను.

పద్మవ్యూహము

పదమూడవరోజున ద్రోణాచార్యుడు కౌరవ సేనతో పద్మవ్యూహమును నిర్మించెను. ఇది తెలియని అర్జునుడు ఆ సమయమున త్రిగర్తదేశపు రాజయిన సుశర్మతోనూ, అతని సోదరులతోనూ పోరాడుటకు మరోవైపుగా వెళ్ళెను. ఇక్కడ ద్రోణుని యెదుర్కొనుట వ్యూహాన్ని చేదించుట పాండవ సేనా నాయకుడయిన దృష్టద్యుమ్నునకు చేతకాలేదు. అది తెలిసినవారు ఒక్క కృష్ణార్జునులు మాత్రమే. వారిద్దరూ సమయానికి లేరు, 'ఏమి చేయటమా?' యని పాండవులు ఆలోచించుట చూసిన అభిమన్యుడు

'నేను పద్మవ్యూహాన్ని చేధించగలను. కాని, తిరిగి రావటము నాకు తెలియదు కనుక నా రక్షగా, మీరు నా వెనుకనే రండి' అని చెప్పి వారి ఆశీర్వాదము పొంది వెంటనే పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ కౌరవసేనను తన బాణములకు బలిచేయుచు ముందుకు సాగెను. అభిమన్యుని వెనుకగా వస్తున్న పాండవులు నలుగురిని సైంధవుడు మధ్యలోనే యెదుర్కొని వరప్రభావముచేత ముందుకు పోనీయకుండా ఆపాడు.

ఈలోపుగా అభిమన్యుడు చాలా దూరము వెళ్ళి కౌరవ సేనను చీల్చి చెండాడ సాగెను. కౌరవ నాయకులంతా అభిమన్యుని పరాక్రమమునకు విస్తుపోయి న్యాయ మార్గమున వీనిని జయించుట కష్టము కనుక అంతా ఒక్కసారిగా ముట్టడించి మోసముతో చంపవలెనని నిర్ణయించుకున్నారు. కర్ణుడు, కృపుడు, శకుని, దుర్యోధన, దుశ్శాసనాది ప్రముఖులందరూ కలసి యెవరికి వీలయిన పద్ధతిలో వారు అభిమన్యునిపై పడి ఒక్కసారిగా చుట్టుముట్టినారు.



అభిమన్యుని మోసముచే చంపుచున్న కౌరవ నాయకులు

ఒకరు విల్లు విరిస్తే మరొకరు వెనుకనుండి తలపై గదతో కొట్టినారు. మరొకరు శూలంతో పొడిస్తే వేరొకరు గుండెలపై కత్తితో పొడిచినారు. ఈ విధముగా యెవరి వీలు ప్రకారంగా వారు ప్రయత్నించి కడకు అందరూ కలసి ఒక్కసారిగా అభిమన్యుని చంపినారు. 'ఈ కౌరవ పాండవ సంగ్రామంలో సువర్ణ లిఖితమైన వీరత్వం అభిమన్యునిదే' అని మెచ్చుకొన్నాడు ద్రోణాచార్యుడు.

సైంధవ సంహారము

సైంధవుని ఓడించి పాండవులు ముందుకు వెళ్ళేటప్పటికి అభిమన్యుడు అంతిమ దశలో నున్నాడు. ఇది చూసి పాండవులు అభిమన్యుని మరణమునకు యెంతగానో విలపించినారు. "అర్జునునికి యేమని చెప్పాలి యెలా చెప్పాలి" అని రోదించసాగినారు. ఈ విధముగా పాండవులు ఒక రత్నాన్ని కోల్పోయారు.

యుద్ధభూమి నుండి విజయముతో తిరిగివచ్చిన అర్జునుడు అభిమన్యుని మరణ వార్త విని మూర్ఛనొందెను. తరువాత ధర్మరాజు వలన జరిగినదంతయు తెలుసుకున్న అర్జునుడు కోపావేశముతో తన కుమారుని మరణమునకు ముఖ్య కారకుడయిన సైంధవుని "మరునాటి సూర్యాస్తమయం లోపుగా సంహరించెద''ననీ, "అలా చేయలేకపోయినట్లయితే 'అగ్నిప్రవేశము' చేసెదననీ, ప్రతిజ్ఞ బూనెను.

ఇది తెలిసిన సైంధవుడు భయపడుచుండగా దుర్యోధనాదులు సైంధవుని సేనకు వెనుకవైపున దూరముగా నిలిపి కాపాడ సాగినారు. సైన్యమునకు ముందు ద్రోణుని నిలిపినారు. అర్జునుడు అరివీరి భయంకరునివలె యుద్ధభూమిలో ప్రవేశించి ద్రోణాది మహా వీరులతో ఘోరంగా పోరాడుచుండెను.

సాయంకాలము అగు సమయము సమీపించుచున్నను సైంధవుని చేర వీలు కాకపోవుచుండుట గమనించిన అర్జునుడు మరింతగా విజృంభించి అడ్డు వచ్చిన వారి తల యెగురగొట్టుచూ అతి నైపుణ్యముతో ద్రోణుని తప్పించుకుని ముందుకు సాగెను. సాత్యకి వచ్చి ద్రోణునీ యెదుర్కొన్నాడు, అదే సమయమున శ్రీకృష్ణుని మాయా ప్రభావము చేత చుట్టూ చీకట్లు క్రమ్మినవి. "సూర్యుడు అస్తమించినాడు, అర్జునుడు

అగ్నిప్రవేశం చేసి ప్రతిజ్ఞ నెరవేర్చుకొంటాడు. ఇక తతిమా వారిని తేలికగా జయింప వచ్చును" అని సంతోషముతో దుర్యోధనాదులు సైంధవుని వదలి చెల్లాచెదురై నారు. ఆ సమయమున శ్రీకృష్ణుని సలహాతో అర్జునుడు సైంధవుని శిరస్సును ఖండించుట, క్రమ్మిన చీకట్లు విడిపోవుట ఒక్కసారిగా జరిగినవి.

అర్జునుని బాణములచే ఖండింపబడిన సైంధవుని శిరస్సు యెగిరి వెళ్ళి తపస్సు చేసుకుంటున్న సైంధవుని తండ్రి చేతిలో పడి, అతని తల వేయి ముక్కలై అతను కూడ మరణించెను. ఈ విధముగా ఒకే బాణముతో తండ్రీకొడుకులు హతులైనారు. అర్జునుని ప్రతిజ్ఞ నెరవేరినది.

సైంధవుని మరణముతో యుద్ధం ఆగకుండా ఆ రాత్రి కూడా సాగినది. ఇరువైపులా సైన్యము విశ్రాంతి మాటమరచి యేకధాటిగా యుద్ధం చేస్తూనే యున్నారు. సైంధవుని



ఘటోత్కచునిపై ఇంద్రశక్తిని ప్రయోగిస్తున్న కర్ణుడు

కాపాడలేక పోయాడనే కోపముతో దుర్యోధనుడు ద్రోణుని తూలనాడి అలంబసుడనే రాక్షసుని రప్పించినాడు. అది చూసి భీముని కుమారుడగు ఘటోత్కచుడు కోపముతో విజృంభించి అలంబసుని చంపి, కౌరవ సేనపై బడి నల్లులను నలిపినట్లుగా నలిపి వేయసాగెను. దుర్యోధనుడు భయపడి కర్ణునితో "అంగరాజా! ఇక ఉపేక్షించి లాభము లేదు. ఘటోత్కచుని వెంటనే హతమార్చినచో ఈ రోజుతో మన ఓటమి తప్పదు" అని చెప్పినాడు'' అది విన్న కర్ణుడు అర్జునుని చంపుటకై దాచి వుంచిన ఇంద్రశక్తిని ఘటోత్కచునిపై యోగించినాడు. దానితో ఘటోత్కచుడు వీరస్వర్గ మలంకరించెను.

ద్రోణాచార్యుని మరణము

పదునైదవ రోజున ద్రోణుడు శక్తినంతా ప్రయోగించి వీరు వారు అనక ఘోరముగా యుద్ధము చేయుచు ద్రుపదుని, విరాటుని చంపి మరింత ముందుకు సాగి పాండవ సేనను ధ్వంసము చేయసాగెను. అదే సమయమున భీముడు "అశ్వత్థామ" అనే యేనుగును చంపినాడు. అది అవకాశముగా తీసుకుని శ్రీకృష్ణుడు ధర్మరాజుతో "అశ్వత్థామ మరణించెను''. అని గట్టిగా అనిపించి, చివర "ఏనుగు'' అని పలికించినాడు ద్రోణుడు "ఏనుగు" అన్నపదం వినకుండా "అశ్వత్థామయే మరణించెను' అన్న పదమును మాత్రమే విని, తన కుమారుడు అశ్వత్మాథమయే మరణించెనని భావించి ఆవేదనలో ధనుస్సును వదలి మూర్ఛితుడై రథముపై ఒరిగిపోయెను.

★★★

కర్ణపర్వము

ద్రోణుని అనంతరము కర్ణుడు కౌరవసేనా నాయకుడయ్యెను. కర్ణుడు శల్యుని ఒప్పించి రథసారథిగా నియమించుకొన్నాడు. కర్ణుడు యుద్ధరంగమున ప్రవేశిస్తేనే అర్జునుని యెదుర్కొనగా, దుశ్శాసనుడు భీముని యెదుర్కొని ముష్టియుద్ధము చేయసాగెను.

దుశ్శాసన వధ

భీముడు దుశ్శాసనునిపైబడి యెక్కడి యెముకల నక్కడే విరగబొడుచుచు క్రింద పడవైచి కోపావేశముతో అతని గుండెను చీల్చి రక్తము త్రాగి, చేతుల నిండుగా రక్తము పూసుకుని, ప్రేవులు మెడలో ధరించి, చూపరులను భయము కొల్పుతూ దోసిలి నిండుగా రక్తము తీసుకొని పోయి ద్రౌపది కురులకు ముడివేసి తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనెను.


మరోవైపున కర్ణుడు కర్ణుడి కుమారుడయిన వృషసేనుడు ఒకేసారిగా అర్జునునిపై బాణములు ప్రయోగించుచుండిరి. అది చూసి అర్జునుడు కోపోద్రేకముతో విజృంభించిన తన కుమారుడు అభిమన్యుని అన్యాయముగా చంపిన వారితో కర్ణుడు ముఖ్యుడు కనుక, కర్ణుని కళ్ళముందే వాని కుమారునీ వధించవలెనని భావించి ఒక్క బాణముతో వృషసేనుని శిరస్సును ఖండించెను. దానితో కర్ణుడు వికల మనస్కుడై వెనుదిరిగిపోయెను.



దుశ్శాసనుని గుండెలు చీల్చి రక్తమును గ్రోలుచున్న భీమసేనుడు

కర్ణుని మరణము

మరునాడు కర్ణుడు యుద్ధరంగమున ప్రవేశించి తన కొడుకును చంపినాడనే కోపముతో అర్జునునిపై భయంకరమైన బాణవర్షము కురిపించసాగెను.



రథచక్రమెత్తుచున్న కర్ణుడు - కర్ణుని హతమొనర్చుచున్న అర్జునుడు

ఆ సమయమున పూర్వము ఒక బ్రాహ్మణుడు యిచ్చిన శాప ప్రభావమున కర్ణుని రథచక్రం భూమిలో దిగబడిపోయెను. అది చూసి మనస్సున కలత జెందుచు కర్ణుడు రథం దిగి చక్రాన్ని పైకెత్త ప్రయత్నించుచుండగా శ్రీకృష్ణుని ప్రోద్బలంచేత అర్జునుడు అస్త్రాన్ని ప్రయోగించి కర్ణుని శిరస్సును ఖండించెను.

★★★

శల్య పర్వము

అర్జునుని అనంతరము శల్యుడు సర్వ సేనానియై యుద్ధరంగమున ప్రవేశించి అర్జునుని యెదుర్కొనెను. అదే సమయమున ధర్మరాజు అక్కడికి రాగా దుర్యోధను కోర్కె గుర్తుకువచ్చి, అర్జునుని వదలి, ధర్మరాజుతో యుద్ధము చేయసాగెను.



మడుగులో దాగిన దుర్యోధనుని దెప్పి పొడుచుచున్న ధర్మరాజు

ధర్మరాజు శల్యునితో ఘోరముగా యుద్ధముచేసి ఒక శక్తి బాణముతో శల్యుని శిరస్సును దునిమివేసినాడు' మరొవైపు సహదేవుని చేతిలో శకుని, నకులుని వలన మరొకొంతమంది కౌరవులూ మరణించినారు.

ఈ విధముగా ఒకే సమయమున చనిపోయినవారితో కౌరవుల తరపున అక్షౌహిణుల సైన్యమును సర్వనాశనమై నలుగురు మాత్రము మిగిలినారు దుర్యోధనుడు,

అశ్వత్థామ, కృపుడు, కృతవర్మలు, పాండవుల సైన్యముకూడా చాలావరకు నశించినా కౌరవులకు కలిగిన దానిలో సగము కూడా నష్టము కలుగలేదు. ఇది చూసి దుర్యోధనుడు భయపడి యుద్ధరంగము నుండి పారిపోయి జలస్తంభన విద్య తెలిసిన వాడగుటచేత ఆ సమీపమున గల మడుగులో దిగి దాగుకొనెను. కొందరు బోయలవలన ఆ విషయము తెలుసుకొని, పాండవులు శ్రీకృష్ణునితో కలసి మడుగువద్దకు వచ్చినారు.

ధర్మరాజు దుర్యోధనుని అనేక రకములుగా దెప్పిపొడుచుచూ, యుద్ధమునకు ఆహ్వానించాడు. గర్మరాజు మాటలు యీటెల్లా తగులగా దుర్యోధనుడు బయటికి వచ్చి భీమునితో గదా యుద్ధమునకై తలపడినాడు.

ఇద్దరూ రెండు కొదమ సింహాలవలె పోరాడసాగిరి, భీమునకు తన ప్రతిజ్ఞ జ్ఞప్తికి వచ్చి, నెరవేర్చుకో నిశ్చయించుకుని, సమయం కొరకు చూస్తూ యుద్ధము చేస్తున్నాడు.



భీమ దుర్యోధనుల గదాయుద్ధము

వారి గదల రాపిడికి నిప్పులు రాలుతున్నాయి. వారి పాదాల తాకిడికి భూమండలం దద్దరిల్లుతూ మహాద్భుతంగా యుద్ధము సాగుచున్న సమయమున భీముడు దుర్యోధనుని తొడలు విరగగొట్టినాడు. దానితో నేలకొరిగి పోయిన దుర్యోధనునికి ద్రౌపదికి జరిగిన అవమానమునుశ్రీకృష్ణుడు గుర్తుచేయగా భీముడు గదతో దుర్యోధనుని తొడలపై కొట్టి నేలకూల్చి యెడమకాలితో అతని శిరస్సుమీద తన్నినాడు. శ్రీకృష్ణుడు భీముని చర్యను వారించుచూ, వారిని తీసుకొని శిబిరాలకు వెళ్ళిపోయెను.

తొడలు విరిగి నేలకూలిన దుర్యోధనుడు బాధతో విలవిలాడుచుండగా అచటకు వచ్చిన అశ్వత్థామాదులు దుర్యోధనుని దురవస్థను చూసి విలపించినారు. అప్పుడు దుర్యోధనుడు 'ఎవరిని అని యేమి లాభం? మంచియేదో చెడు యేదో తెలుసుకోలేక మూర్ఖుడనై భీష్మ పితామహుని మాటలు, విదురుని మంచి మాటలు పెడ చెవిని పెట్టి యుద్ధానికి సిద్ధపడ్డాను. అందుకే అనుభవిస్తు'న్నానని చెప్పి బాధపడినాడు.

అది విని అశ్వత్థామ "మనం యెలాగూ పూర్తిగా నాశనమైపోయాం పాండవ వంశాన్ని మాత్రం యెందుకు నిలవనియ్యాలి? వాళ్ళ వంశాన్ని కూడా సర్వనాశనం చేసి వస్తా'నని చెప్పి కృప, కృత వర్మలను తీసుకొని పాండవ శిఖరములవైపు వెళ్ళాడు.

సౌప్తిక పర్వము

అశ్వత్థామ పాండవ శిబిరములను సమీపించి మరల ఆలోచించి "బలపరాక్రమములు కల పాండవులను ఈ విధముగా ఎదుర్కొని విజయం సాధించుట అసంభవము అని భావించి రాత్రివరకు ఒక చెట్టు క్రింద నుండెను. అదే సమయమున శ్రీకృష్ణుడు విజయం లభించిన పాండవులను తనవెంట నదీతీరమునకు తీసుకొనిపోయెను. అది చూసి అశ్వత్థామ పాండవ శిబిరములోనికి ప్రవేశించెను.

అచట నిద్రించుచున్న శిఖండిని చంపి, ఉపపాండవు లయిదుగురి శిరస్సులను ఖండించి, దృష్టద్యుమ్నుని క్రిందకు లాగి తండ్రిని చంపినాడనే క్రోధముతో ముందు చేయి నరికి తరువాత శిరస్సును ఖండించెను. అశ్వత్థామ అచటి నుండి కొనఊపిరితో నున్న దుర్యోధనుని వద్దకు పోయి జరిగినదంతయు చెప్పెను.



అశ్వత్థామ - నిద్రించుచున్న ఉపపాండవులను, ధృష్టద్యుమ్నుని చంపుట

ఇంతలో తిరిగి వచ్చిన పాండవులు అశ్వత్థామవలన జరిగిన ఘోరాన్ని తెలుసుకున్నారు. కుమారులకై యేడ్చుచున్న ద్రౌపదిని ధర్మరాజు ఓదార్చుచుండగా భీమార్జునులు శ్రీకృష్ణునితో కలసి అశ్వత్థామను పట్టి తెచ్చుటకు వెళ్ళిరి. ఆ ముగ్గురినీ చూసి అశ్వత్థామ భయపడినాడు.

వెంటనే తన ప్రాణ రక్షణకు పాండవ వంశ నాశనమునకు ఉపయోగపడునట్లుగా "బ్రహ్మశిర"మను అస్త్రమును తీసి ప్రయోగించెను. అర్జునుడు మరో దివ్య శక్తి గల అస్త్రమును ప్రయోగించి అశ్వత్థామను బంధించి ద్రౌపదీ ధర్మరాజుల వద్దకు తీసుకొని వచ్చినాడు. అంత వారిద్దరూ అశ్వత్థామను నిందించినారు. "బ్రాహ్మణుడు కనుక వాడు నీతి తప్పినా మనము తప్పకూడదు. "వదలు"మని ద్రౌపది చెప్పిన మాటలు విని భీముడు వాని తల గొరిగి యందలి శిరోరత్నమును తీసుకుని ద్రౌపదికిచ్చి, వానిని వదలివేసెను.

స్త్రీ పర్వము

ధృతరాష్ట్రుడు కుమారుల మరణానికి యెంతగానో దుఃఖించుచుండెను. అపుడు వ్యాసమహర్షి వచ్చి గాంధారీ ధృతరాష్ట్రులకు శాంతి కలిగించినాడు.

అనంతరము వారు కోడండ్రను వెంటబెట్టుకొని యుద్ధభూమికి వెళ్ళినారు. తమ తమ భర్తల శవములపై బడి యేడ్చుచుండగా సంజయుడు, విదురుడు వారి నోదార్చినారు. మరణించినవారి కందరికీ పాండవులు ఉత్తరక్రియలు జరిపించారు.

★★★

శాంతి పర్వము

కౌరవులు, బంధుమిత్రులు నశించినారనే బాధతో ధర్మరాజు తనకు పట్టాభిషేకము



ధర్మరాజు పట్టాభిషేకము

వద్దనీ - ధృతరాష్ట్రుని సేవలో కాలము గడుపుతాననే - లేదా, అడవికి పోయి తపస్సు చేసుకొంటాను అని వికల మనస్కుడై చెప్పినాడు.

అది విని శ్రీకృష్ణుడూ ప్రజలూ ధర్మరాజునకు ఎన్నో విధములుగా చెప్పి బాధను మరిపింప జేసి పట్టాభిషేకమునకు ఒప్పించి శాంతిని కలిగించారు ప్రజల మాటను, ఋషుల ఆశీస్సులను శ్రీకృష్ణుని ఆనతిని తలదాల్చి ధర్మరాజు మరల తమ్ములతోను, ద్రౌపదితోను హస్తినాపురమునకు విచ్చేసి శ్రీకృష్ణ నారదాది బ్రాహ్మణోత్తముల ఆశీర్వాదములతో పట్టాభిషిక్తుడయ్యెను.

★★★

అనుశాసనిక పర్వము

భీష్ముని నిర్యాణము

అంతలో ఉత్తరాయణ కాలము ప్రవేశించినది. భీష్ముడు ధర్మరాజు ద్వారా పాండవులను శ్రీకృష్ణుని రప్పించినాడు. పాండవులకు మరికొన్ని విషయములను తెలిపి తను దేహమును చాలించుటకు అనుమతిని నివ్వమని శ్రీకృష్ణుని కోరి దేహమును చాలించినాడు.

శ్రీకృష్ణుడు భీష్మునికి పుణ్యలోక ప్రాప్తి కలుగునట్లుగా ఆశీర్వదించి, పాండవులను తీసుకొని రాజధాని చేరినాడు. తరువాత భీష్మునకు యధావిధిగా ఉత్తరక్రియలు జరిపించి, భీష్ముని పేరుతో అనేకదానములు చేసినారు.

అశ్వమేధ పర్వము

పరీక్షిత్తు జననము

అశ్వత్థామ ప్రయోగించిన దివ్యాస్త్ర మహిమ ఉత్తరగర్భమున పెరుగుతున్న అభిమన్యుని కుమారునికి తగిలి పిండముగా నుండగానే ప్రాణములు కోల్పోయినాడు. ఆ కారణమువల్లనే ఉత్తరకు చచ్చిపోయిన మగశిశువు కలిగినాడు. అది చూసి వంశ



ఉత్తరా కుమారునికి ప్రాణదానము చేయుచున్న శ్రీకృష్ణుడు

వృక్షాన్ని అభివృద్ధిపరచే ఆ శిశువు మృతుడయినందున పాండవులూ కుంతీ మిగుల దుఃఖించి శ్రీకృష్ణుని ప్రార్థించినారు. అపుడు శ్రీకృష్ణుడు అందరినీ ఓదార్చి ఉత్తరా కుమారులకు ప్రాణంపోసి "పరీక్షిత్తు" అని నామకరణము చేశాడు.

ఆశ్రమవాస పర్వము

ధృతరాష్ట్రాదుల అరణ్యముల కేగుట

కొంతకాలము గడిచినపిమ్మట ఒకనాడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును చేరబిలిచి నాయనా 'ధర్మరాజా! భీష్మాదులూ, కుమారులూ, అందరు పోయినారు. మీరు యెంత ప్రేమగా చూస్తున్నా వారిని మరచిపోలేకపోతున్నాను. అందుచేత మేము తపోవనములకేగి

అచటనే కొంతకాలము వుండి వస్తాము" అని చెప్పి ధర్మరాజును తప్పించి గాంధారితో సహా వానప్రస్థానికి పయనమైనాడు.

అది చూసి కుంతి కూడా వారితో పాటే వనములందుండి తపస్సు చేసుకుంటూ భర్తను చేరతానని చెప్పి బయలుదేరినది. విదురుడు కూడా ధర్మరాజు అనుమతిని పొంది వారితో వెళ్ళిపోయెను. ఆ నలుగురూ అరణ్యము చేరి తపస్సు చేసుకొనుచు ముందుగా కుంతి, తరువాత ధృతరాష్ట్రుడు, గాంధారీ కూడా దేహములకు వీరస్వర్గలోకమును చేరినారు.

మౌసల పర్వము

శ్రీకృష్ణ నిర్యాణము

కురుక్షేత్ర సంగ్రామ అనంతరము ధర్మరాజు 36 సంవత్సరములు రాజ్యపాలన చేశాడు. శ్రీకృష్ణుడు ద్వారకలో నున్నాడని తెలిసి నారదాది మహర్షులందరు శ్రీకృష్ణ దర్శనార్థమై రాగా కొందరు తుంటరులయిన యాదవ కుమారులు సాంబుడను వానికి స్త్రీ వేషము ధరింపచేసి మునులవద్దకు తీసుకొని వచ్చి నమస్కరించి "ఈమెకు యే బిడ్డ పుట్టునో చెప్పు"డని వేడుకున్నారు.

మునులలో గల దుర్వాసుడు యాదవుల కొంటెతనమునకు చిరాకుపడి, కోపముతో "ముసలము (రోకలి) పుట్టును పొమ్మ"ని చెప్పి శ్రీకృష్ణుని దర్శించి వెళ్ళిపోయినారు ముని శాపమున పుట్టిన రోకలిని పిండిచేసి సముద్రమున పారవైచినారు. చివరకు మిగిలిన సన్నని పుల్లను కూడా పారవేయగా అది ఒక బోయవానికి దొరికినది. దానిని వాడు తన విల్లంబులలో వేసుకొనెను.

కొంతకాలమునకు జాతర చేయుచు యాదవులందరూ త్రాగి సముద్రతీరమునకు వచ్చి రోకలి పొడివలన మొలిచిన దుంగలతో కొట్టుకుంటూ ఒకరి నొకరు దుర్భాషలాడుకొనుచు ముని శాప ప్రభావమున అందరూ మరణించినారు. ఇది తెలిసి బలరాముడు కూడ తన అవతారమును చాలించి శేషపాన్పుగా మారి వైకుంఠమును చేరెను. తరువాత బోయవానిచే రోకలి వలన యేర్పడిన బాణముతో దెబ్బతిని శ్రీకృష్ణుడు కూడ దేహము

చాలించెను. వెంటనే సముద్రముపొంగి ద్వారకను ముంచివేసినది ఈ విధముగా ద్వారకా నగర చరిత్ర సమాప్తమయినది.

మహా ప్రాస్థానిక పర్వము

శ్రీకృష్ణుడు అవతారము చాలించినాడని విన్న పాండవులు మిక్కిలి దుఃఖించి, వైరాగ్యముతో అభిమన్యుని కుమారుడయిన పరీక్షిత్తునకు రాజ్యాభిషేకము జరిపించి ధర్మసూక్ష్మములను తెల్పి మహాప్రస్థానమునకు దారి తీసినారు.

మార్గ మధ్యమున ఒక్కొక్కరుగా భీమ, అర్జున, నకుల, సహదేవులు ద్రౌపది మరణించినా సరే ధర్మరాజు చింతింపక ముందుకు సాగినాడు. ధర్మరాజు యెంత దూరమేగినా ఒక కుక్క మాత్రము అతనిని వదలక వెంబడించి రాసాగినది.

స్వర్గారోహణ పర్వము

అంతలో దేవేంద్రుడు ఒక దివ్య రథముతో వచ్చి 'ధర్మరాజా! నీ వారంతా స్వర్గము చేరినారు. నీవు ఇంకా యిక్కడెందుకు? రా, రథము యొక్కు దాహముతోనే స్వర్గాన్ని చేరగల ధర్మాత్ముడవు. అని చెపిపనాడు. ధర్మరాజు రథమును యెక్కగా కుక్కకూడా వచ్చి రథము యెక్కినది. అది చూసి దేవేంద్రుడు కుక్కలకు స్వర్గములో స్థానము వుండదు. దాన్ని వదిలెయ్యి" అనగా ధర్మరాజు విశ్వాసముగల ఈ కుక్కకు స్థానం లేకపోతే నాకూ వద్దు అని రథము దిగబోవగా, అతని ధర్మశీలతకు ఆనందించి కుక్కగా వెంబడించిన ధర్మదేవత ప్రత్యక్షమై ధర్మరాజును ఆశీర్వదించి అంతర్ధానమయ్యెను.

ధర్మరాజు స్వర్గలోకమున జేరి అక్కడ తనవారి నందరినీ కలసి మిగుల ఆనందించెను. తరువాత పాండవులందరు తాను దేవతల అంశలలో కలసిపోయినారు. భారతవీరులు పూర్తిగా భూలోకమును విడిచిన అనంతరమే కలియుగము ప్రారంభ మయినది.

పరీక్షిత్తు ఉన్నంతకాలము ధర్మయుక్తము రాజ్యపాలన నిర్వహించి ప్రజలకు సమస్త సౌఖ్యములు కలిగించెను.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతాం
ధర్మసంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే"

సమాప్తం

★★★

ఫలశ్రుతి

పంచమ వేదమయిన శ్రీమన్మహాభారతము సకల ధర్మానుసారము భారత దేశములో రకరకాలుగా మనకు ప్రీతిపాత్రమై సంక్రమిస్తున్న పెన్నిధి భారత రామాయణ గ్రంథాలు ప్రతియింటా వుండవలసిన పవిత్ర సుమమాలలు, భారత కథలో గీతోపదేశం చేసిన శ్రీకృష్ణపరమాత్ముడు ప్రతివారికీ దైవమే.

ఈ ప్రపంచమందు పుణ్యనదులెంతకాలము ప్రవహించునో, అంతకాలము భారత కథ ప్రతి ఒక్కరికి కన్నతల్లియై ధర్మరక్షణ గావించును. అట్టి ఈ పవిత్ర గ్రంథ సుమమాలను పిన్నలు, పెద్దలు చిత్తశుద్ధితో పఠించి శ్రీకృష్ణుని మహిమాన్విత తత్వమును అర్థము చేసుకొని సద్వర్తనులై కృష్ణ ప్రేమామృతమును పొంది వర్ధిల్లుదురు గాక

రచయిత్రి
జి.యస్.ధనలక్ష్మీ దేవి



గొల్లపూడి బాలల బొమ్మల సంపూర్ణ

మహాభారతము

